సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 143

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'



సోమవారం నాగార్జునసాగర్ గేట్లెత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో పరుగులు తీస్తున్న కృష్ణమ్మ



## వైల్డ్ వర్సెస్ మోదీ

సాహసికుడు బేర్ గ్రిల్స్‌తో కలసి మోదీ సాహసాలు

డిస్కవరీ గ్రూప్ చానళ్లలో ప్రసారమైన సాహసయాత్ర

"చిన్నప్పుడు నేను మురికి బట్టలే వేసుకున్నా. కానీ స్కూలుకు వెళ్లేటప్పుడు శుభ్రమైన యూనిఫామ్ వేసుకెళ్లేవాడిని. మా ప్రాంతంలో మంచు కురి శాక పైన ఉప్పులాంటి పొర ఏర్పడేది. దాన్ని జాగ్రత్తగా ఇసుకలా చేసి స్నానం చేసేటప్పుడు వాడేవాళ్లం.

పదిహేడేళ్లప్పుడు ఇల్లు వదిలేశా. హిమాలయాలకు వెళ్లగానే అక్కడి ప్రకృతి నచ్చింది. అక్కడే రుషులను కలుసుకున్నా. అక్కడి మనుషుల మధ్య గడపడం అద్భుత అనుభవం. ఆ శక్తే నన్ను నడిపిస్తోంది. అక్కడి రుషులంతా చాలా నిరాడంబరంగా ఉన్నారు.

నేను రోజూ చెరువులో స్నానం చేసేవాడిని. అక్కడ కనిపించిన ఓ మొసలి పిల్లను ఇంటికి పట్టుకెళ్లా. దీంతో మా అమ్మ 'తల్లీబిడ్డలను వేరుచేయడం తప్పు. వెళ్లి వదిలేసి రా' అని చెప్పింది. ప్రకృతిని చూసి మనం ఎప్పుడూ భయపడకూడదు.

- 'జిమ్ కార్బెట్' సాహస యాత్రలో బేర్ గ్రిల్స్‌తో ప్రధాని మోదీ

12లో

# కొత్త అధ్యాయం లిఖిస్తాం

## ఏపీ సీఎం జగన్‌తో కలిసి ముందుకెళ్తాం

- రాయలసీమను రతనాలసీమగా మార్చడమే లక్ష్యం
- ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు స్పష్టీకరణ
- గోదావరి సద్వినియోగంపై చర్చించామని వెల్లడి
- కుటుంబ సమేతంగా కాంచీపురం అత్తిరాజవరద స్వామి దర్శనం ... రేణిగుంట విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఘన స్వాగతం
- కేసీఆర్ కుటుంబానికి నగరిలో విందు ఇచ్చిన ఏపీఐఐసీ చైర్‌పర్సన్ రోజా

నగరి/రేణిగుంట (చిత్తూరు జిల్లా): 70 ఏళ్లలో ఎన్నడూ లేనటువంటి కొత్త అధ్యాయాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి లిఖించబోతున్నట్లు తెలంగాణ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు దాదాపు నిండి సముద్రానికి నీరు వెళ్లిపోతోందని.. ఆ నీరు వృథాగా పోకూడదనే ఉద్దేశంతోనే తామిద్దరం చర్చించి సానుకూల నిర్ణయానికి వచ్చామని ఆయన వెల్లడించారు. సోమవారం తమిళనాడు రాష్ట్రం కంచిలోని అత్తివరదరాజ స్వామిని ముఖ్యమంత్రి కేసీఆర్

మిగతా 2వ పేజీలో ▶



కంచిలోని అత్తివరదరాజ స్వామి ఆలయంలో సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో ఏపీఐఐసీ చైర్‌పర్సన్ రోజా

# 'మేఘా' వండర్

- కాళేశ్వరంలో ప్రపంచంలోనే అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్ సిద్ధం
- ఐఫిల్ టవర్‌కన్నా పెద్దదైన పంప్‌హౌస్‌లో 5 బాహుబలి మోటార్లు
- 111.4 మీటర్ల ఎత్తుకు 2 టీఎంసీల నీటిని పంపు చేయగల సామర్థ్యం
- ఒక మోటార్‌కు విజయవంతంగా ట్రయల్ రన్.. మిగతా వాటికి కొనసాగుతున్న పరీక్షలు
- రేపు మోటార్లను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్



ప్యాకేజీ-8లోని పంప్‌హౌస్

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మరో అద్భుతం ఆవిష్కృతం అయింది. ఇంజనీరింగ్ చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా 139 మెగా వాట్ల సామర్థ్యంగల బాహుబలి మోటార్ 111 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం ప్రారంభించింది. ప్రపంచంలో ఇంతవరకూ ఎక్కడా లేని విధంగా, ఇంజనీరింగ్ నిపుణులు సైతం నివ్వెరపోయేలా భూగర్భంలో నీటి పంపింగ్ కేంద్రం నుంచి నీటిని పంప్ చేయించడం ద్వారా నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ లిమిటెడ్ (ఎంఈఐఎల్) కొత్త రికార్డు సృష్టించింది. మానవ నిర్మిత ప్రపంచ అద్భుతాల్లో ముందు వరుసలో ఉండే కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామం వద్ద భూగర్భాన్ని తొలిచి నిర్మించిన లక్ష్మీపూర్ (గాయత్రి) భూగర్భ పంపింగ్ కేంద్రం బుధవారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం కానుంది.

**'మేఘా' మహాద్భుత సృష్టి..**

ప్రపంచంలోనే అతిపెద్దది.. ఇంతకుముందు ఎక్కడా లేనిది.. అందులోనూ భూగర్భంలో నిర్మించిన అతిపెద్ద పంప్‌హౌస్‌గా కాళేశ్వరంలోని లక్ష్మీపూర్ పంప్‌హౌస్ (ప్యాకేజీ–8) ఇప్పటికే పేరు గడించింది. లక్ష్మీపూర్ భూగర్భ నీటి పంపింగ్ కేంద్రం పొడవు ప్రపంచ ప్రఖ్యాత కట్టడం ఐఫిల్ టవర్ పొడవుకన్నా ఎక్కువ. ఐఫిల్ టవర్ ఎత్తు 324 మీటర్లు కాగా ఈ పంప్‌హౌస్ పొడవు 327 మీటర్లు. కోల్‌కతాలో దేశంలోనే అతిపొడవైన భవంతి 'ది 42' (262 మీటర్లు) కంటే ఈ పంప్‌హౌస్ లోతు ఎక్కువ. పంప్‌హౌస్ నిర్మాణం కోసం భూగర్భాన్ని తొలిచి 2.30 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టిని మేఘా ఇంజనీరింగ్ సంస్థ బయటకు తీసింది. ఈ భూగర్భ

మిగతా 2వ పేజీలో ▶

## ఢిల్లీ-లాహోర్ బస్సు రద్దు

- వివరాలు 12లో

## హాంకాంగ్ ఎయిర్‌పోర్టులో నిరసనలు

- హాంకాంగ్ విమానాశ్రయంలో నిరసనకారులు సోమవారం ధర్నాకు దిగారు. నిరసన తెలుపుతున్న ఓ మహిళపై ఆదివారం పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ పోలీసులకు వ్యతిరేకంగా గళం విప్పారు. విమానాశ్రయం లోపల ఇంత పెద్ద స్థాయిలో ఆందోళనలు జరపడం ఇదే తొలిసారి.

- వివరాలు 12లో

## అలా అయితే గ్రీన్‌కార్డ్ రాదు!

- ప్రభుత్వ సౌకర్యాలు పొందాలనుకుంటే శాశ్వత నివాస హోదాకు నో
- అమెరికా తాజా నిర్ణయం



- వివరాలు 12లో




## ఈద్ ప్రార్థనలు ప్రశాంతం

జమ్మూకశ్మీర్‌లో ఆంక్షల సడలింపు

- జమ్మూకశ్మీర్‌లో సోమవారం బక్రీద్ (ఈద్–ఉల్–అధా) వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. జమ్మూతోపాటు కశ్మీర్‌లోని పలుచోట్ల ముస్లింలు భారీ సంఖ్యలో ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. పండుగ నేపథ్యంలో అధికారులు ఆంక్షలు సడలించడంతో బందిపొరలో 10,000 మంది, షోపియాన్‌లో 3 వేల మంది, బారాముల్లాలో 10 మంది ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

- వివరాలు 12లో











మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నీట మునిగిన ఓ కాలనీ

## ఉత్తరాఖండ్‌లో కొండచరియల బీభత్సం

- భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆరుగురు చనిపోయారు. బద్రీనాథ్–పగల్‌నాలా, రిషికేష్–కేదార్‌నాథ్ రహదారుల్లో కొండచరియలు విరిగిపడిన కారణంగా రవాణా సైతం నిలిచిపోయింది. మరోవైపు భారీ వర్షాలతో అతలాకుతలమైన కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లలో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో మృతుల సంఖ్య 192కు చేరగా అందులో ఒక్క కేరళలోనే వరదల వల్ల 76 మంది మృతిచెందారు. కేరళలోని వాయినాడ్‌లో కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ పర్యటించి బాధితులను పరామర్శించారు.

- వివరాలు 12లో

## భిన్నాభిప్రాయాలు ఘర్షణగా మారొద్దు

చైనాకు భారత్ సూచన

- భారత్–చైనా సంబంధాలు సరికొత్త ఎత్తుకు చేరుకుంటాయని ఆకాంక్ష
- చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ క్విషన్, విదేశాంగ మంత్రి వాంగ్‌తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ భేటీ

- వివరాలు 12లో

## రూ. 700కే జియో ఫైబర్

- సెప్టెంబర్ 5న జియో ఫైబర్ సర్వీసుల ప్రారంభం
- ముఖేశ్ అంబానీ వెల్లడి
- ల్యాండ్‌లైన్ నుంచి జీవితకాలం పాటు ఉచిత వాయిస్ కాల్స్
- కనిష్టంగా 100 ఎంబీపీఎస్ బ్రాండ్‌బ్యాండ్ స్పీడ్
- నెలకు రూ. 700 నుంచి రూ. 10,000 దాకా ప్లాన్స్

- బిజినెస్‌లో

ఇదం జగత్



కుదర్దయ్యా! మేం ఏరియల్ సర్వేకొచ్చాం!!





# పచ్చదనాల పల్లె..

దూరంగా పచ్చిక బయళ్లు..
చుట్టూ పచ్చని పంట పొలాలు..
ఇళ్ల మధ్యలో ఏపుగా ఎదిగిన వృక్ష రాజాలు.. ఆరోగ్యంగా, ఆహ్లాదకరంగా ఉన్న ఈ అచ్చమైన పల్లెసీమను చూస్తుంటే అదిరిపోతోంది కదూ! రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యమానేరు పరిధిలోని నీలోజిపల్లె గ్రామ సౌందర్యం ఇది.

*- వంకాయల శ్రీకాంత్, సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా*

# సాగర్‌లో కృష్ణమ్మ పరవళ్లు!

- సాగర్‌లోకి రోజుకు చేరుతున్న 68 టీఎంసీల నీరు
- ఎగువ నుంచి పెరుగుతున్న వరద ఉధృతి
- ఇన్‌ఫ్లో 7.66 లక్షల క్యూసెక్కులు..
- 26 గేట్ల ద్వారా దిగువకు 31 టీఎంసీలు

**సాక్షి ప్రతినిధి, నల్లగొండ/నాగార్జునసాగర్:** నాగార్జునసాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. జిల్లా రైతులకు ఆనందం నింపుతూ రెండు పంటలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందించేలా సాగర్ జలాశయం పూర్తిగా నిండుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద ఉధృతి పెరుగుతుండటంతో సాగర్‌లో జలకళ ఉట్టిపడుతోంది. పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 255 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.045 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 569 (248.0438 టీఎంసీలు) అడుగులకు చేరుకోగానే డ్యామ్ భద్రతను పరిగణనలోకి తీసుకుని సోమవారం ఉదయం 7.30 గంటలకే క్రస్ట్ గేట్లు తెరిచారు. గతేడాది నామమాత్రంగానే మూడు గేట్లు తెరిచి కిందకు విడుదల చేశారు. ఈసారి అనూహ్యంగా ప్రాజెక్టుకు వరద నీరు వస్తుండటంతో పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండుతోంది. అయితే ఎగువ నుంచి వస్తున్న వరదను పరిగణనలోకి తీసుకుని క్రస్ట్ గేట్లను తెరవడంతో కృష్ణమ్మ దిగువకు పరుగులెత్తుతోంది. 26 క్రస్ట్ గేట్లను 10 అడుగులు ఎత్తడంతో 3,33,832 క్యూసెక్కుల (31 టీఎంసీలు) నీరు దిగువకు వెళ్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు, జల విద్యుత్ కేంద్రాల నుంచి కలిపి మొత్తంగా 7,89,094 క్యూసెక్కుల (68 టీఎంసీలు) ఇన్‌ఫ్లో ఉండగా, 3.67 లక్షల ఔట్‌ఫ్లో ఉంది. దీంతో పులిచింతల సైతం నిండే అవకాశం ఉండటంతో అక్కడా గేట్లెత్తారు. ఈ వరద ప్రకాశం బ్యారేజీ మీదుగా బంగాళాఖాతంలోకి వెళ్లనుంది.



నాగార్జునసాగర్ 26 క్రస్ట్ గేట్లనుంచి దిగువకు విడుదలవుతున్న కృష్ణమ్మ..

## పెరుగుతున్న నీటిమట్టం

సాగర్ జలాశయం నీటిమట్టం పెరుగుతోంది. సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు జలాశయం గరిష్ట నీటిమట్టానికి చేరకముందే దిగువకు నీటిని వదులుతున్నామని ప్రాజెక్టు అధికార వర్గాలు చెప్పాయి. 2000, 2015లో మాత్రమే సాధారణం కంటే 60 శాతం అధికంగా వర్షపాతం నమోదైంది. అప్పుడు జూన్, జూలై నెలల్లో బాగా కురిసిన వర్షాలతో ముందుగానే గేట్లు ఎత్తారు. ఇదే పరిస్థితి 1992లో కూడా ఓసారి వచ్చింది. 2005వ సంవత్సరం నుంచి వరుసగా 2006, 2009, 2010, 2011, 2013, 2014, 2018 సంవత్సరాలలో దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నిండినా.. ఎక్కువ వరద రాని కారణంగా 2015, 2016, 2017 సంవత్సరాల్లో మాత్రం సాగర్ గేట్లను ఎత్తలేదు.

## సెల్ఫీ దిగుతూ ఒకరి గల్లంతు

కృష్ణమ్మ అందాలను ఆస్వాదించేందుకు వచ్చిన పర్యాటకులు కొంతమంది పోలీసుల హెచ్చరికలను ఖాతరు చేయకుండా కృష్ణానది తీరంలోగల శివాలయం పుష్కరఘాట్‌లోకి ఈతకు దిగారు. జహీరాబాద్‌కు చెందిన నర్సింహ (42) అనే వ్యక్తి సెల్ఫీ దిగేందుకు లోపలికి వెళ్లగా కాలు జారడంతో కృష్ణానదిలో గల్లంతయ్యాడు. బయటపడేందుకు ప్రయత్నించినా వరద ఉధృతికి రాలేకపోయాడు. అందరూ చూస్తుండగానే అతను నదిలో మునిగిపోయాడు.

## నిండు కుండలా..

కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి భారీగా వరద నీరు పోటెత్తడంతో జూరాల జలాశయం నిండు కుండలా మారింది. మొత్తం 8.34 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అన్ని గేట్లను పైకెత్తి 8.26 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీకి 28 వేల క్యూసెక్కులు, హంద్రీనీవాకు 2,363 క్యూసెక్కులు, ముచ్చుమర్రికి 735 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 878.3 అడుగులు నమోదైంది. పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 179.51 టీఎంసీలు ఉంది. తుంగభద్ర జలాశయం సైతం పూర్తిగా నిండటంతో అక్కడి నుంచి శ్రీశైలానికి 2.12 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. దీంతో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశముంది.

**ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా.. (నిల్వ-టీఎంసీల్లో)**
**(సాయంత్రం 6 గంటలకు అధికారిక బులిటెన్ ప్రకారం)**

| ప్రాజెక్టు | పూర్తి నీటి నిల్వ | ప్రస్తుత నీటి నిల్వ | ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో) | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 106.98 | 5,70,000 | 5,40,000 |
| నారాయణపూర్ | 37.646 | 26.27 | 5,90,000 | 5,99,000 |
| జూరాల | 9.65 | 5.82 | 8,34,000 | 8,26,855 |
| శ్రీశైలం | 215.807 | 179.51 | 8,19,254 | 8,48,673 |
| తుంగభద్ర | 100.86 | 89.43 | 2,44,003 | 2,12,635 |
| ఉజ్జయినీ | 117 | 117.24 | 67,964 | 1,05,950 |
| నాగార్జునసాగర్ | 312.045 | 255 | 7,66,080 | 3,67,580 |
| కడెం | 7.6 | 6.18 | 4,054 | 5,764 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.54 | 5,570 | 5,570 |
| ఎస్సారెస్పీ | 90.31 | 16.35 | 2,960 | 389 |

# పులిచింతల ముంపుతో అలర్ట్

- నాగార్జునసాగర్ నుంచి దిగువకు భారీ వరద
- ముంపు ప్రాంతాల ప్రజలను ఖాళీ చేయిస్తున్న పోలీసులు

**సాక్షి ప్రతినిధి, సూర్యాపేట:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు రెండు లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేయడంతో సూర్యాపేట జిల్లాలోని పులిచింతల ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. వరద ఉధృతి దృష్ట్యా ఈ ప్రాజెక్టు ముంపులో ఉన్న జిల్లాలోని కృష్ణా నదీ పరీవాహక గ్రామాల ప్రజలను పోలీసులు ముందస్తుగా అప్రమత్తం చేశారు. పులిచింతల ప్రాజెక్టు ముంపులో సూర్యాపేట జిల్లాలోని పాలకీడు, మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లోని 16 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లోని ప్రజలకు ముంపు పరిహారం ఇప్పటికే అందజేశారు. మత్స్యకారులు కృష్ణా నదిలో చేపల వేటకు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. అలాగే నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న మట్టపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఘాట్ల వద్ద భక్తులు నదిలోకి వెళ్లకుండా పోలీసులు ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

**నేడో, రేపో విద్యుదుత్పత్తి ప్రారంభం..**

పులిచింతల ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి వరకు 4 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నిండిన తర్వాత ఇక్కడి నుంచి నీళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం బ్యారేజ్‌లోకి వెళ్తాయి. ఈ ప్రాజెక్టును పూర్తిగా ఆంధ్రప్రదేశ్ కృష్ణా డెల్టాలోని 12 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించారు. ప్రాజెక్టు నిర్మించిన తర్వాత తొలిసారిగా ఈ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తోంది. ప్రాజెక్టుకు సంబంధించి 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల కేంద్రాలు టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో ఉన్నాయి. నీళ్లు లేకపోవడంతో ఏడాదిగా ఇక్కడ విద్యుదుత్పత్తి నిలిచింది. భారీ వరద వస్తుండటంతో రెండ్రోజుల్లో నాలుగు యూనిట్లలో పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి ప్రారంభం కానుంది.

# వరద ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి, ఎంపీ

- కృష్ణానదీ తీరాన బోటులో ప్రయాణం
- నీట మునిగిన ఇళ్లు, పంట పొలాల పరిశీలన

**నారాయణపేట:** నారాయణపేట జిల్లా సరిహద్దులోని తంగిడి వద్ద కృష్ణమ్మ, భీమా నదులు ఉప్పొంగడంతో కృష్ణా, మాగనూర్, మక్తల్ మండలాల్లోని 20 గ్రామాల్లో 4 వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. కృష్ణా మండలం వాసునగర్ పూర్తిగా నీట మునిగింది. హిందూపూర్‌లోని ఎస్సీ, బీసీ కాలనీలను వరద నీరు చుట్టేసింది. దీంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ చేతనలతో కలసి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం బోటులో నదీ తీర ప్రాంతాన్ని పరిశీలించారు. హిందూపూర్ నుంచి కృష్ణకు రాకపోకలు స్తంభించడంతో ఆ రోడ్డును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మునిగిన పంటలను చూసి రైతులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ గంట గంటకూ ఇక్కడి పరిస్థితిని తెలుసుకుంటున్నారన్నారు. పది రోజుల్లో స్వయంగా ఇక్కడికి వచ్చి బాధితులతో మాట్లాడతారని భరోసానిచ్చారు. హిందూపూర్‌లో మునిగిపోయిన ఇళ్లను తిరిగి నిర్మించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతాంగానికి సాగునీరు అందించి అందరి కళ్లలో ఆనందం చూడటమే కేసీఆర్ లక్ష్యమని పేర్కొన్నారు.



వరద ప్రాంతాలను బోటులో పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్,

# ‘మేఘా’ వండర్

▶ మొదటి పేజీ తరువాయి

నీటి పంపింగ్ కేంద్రం వైశాల్యం 84,753.2 చదరపు అడుగులు కాగా 139 మెగావాట్ల సామర్థ్యంతో 5 మోటార్లను పంపింగ్‌కు సిద్ధం చేసింది. ఒక్కో మోటార్ బరువు 2,376 మెట్రిక్ టన్నులు. ఈ మోటార్‌లో ప్రధానమైన స్టార్టర్ బరువు 216 టన్నులుకాగా రోటర్ బరువు 196 టన్నులు. సాధారణంగా 200 టన్నుల బరువు మోసే క్రేన్లు ఉండవు. ఇక్కడ వీటిని కదిలించడానికి రెండేసి క్రేన్లను వినియోగిస్తున్నారు. ఈ పంప్‌హౌస్ నిర్మాణం కోసం 6 వేల టన్నుల స్టీల్‌తోపాటు 50 వేల టన్నుల సిమెంట్ కాంక్రీట్ వినియోగించారు. ఇక్కడి నుంచి కనీసం రోజుకు 2 టీఎంసీల నీటిని పంప్ చేసేలా నిర్మాణ పని పూర్తయింది. ఈ మిషన్లు పని చేయడం ప్రారంభం కాగానే నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రవాహం ఎంత పెద్దదో అంతకన్నా రెండింతలు పెద్దగా నీరు ప్రవహిస్తుంది. అక్కడ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులుకాగా ఇక్కడ 22 వేల క్యూసెక్కుల నీరు పంపింగ్ ద్వారా వస్తుంది. సాధారణంగా 30 లేదా 40 మీటర్ల ఎత్తుకు నీటిని పంప్ చేయడమే ప్రాజెక్టుల్లో అరుదైన విషయంకాగా భూగర్భం నుంచి 111.4 మీటర్ల ఎత్తుకు 2 టీఎంసీల నీటిని పంపింగ్ చేసేలా మోటార్లను మేఘా సిద్ధం చేసింది. మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టులో 2 టీఎంసీల పంపింగ్‌కుగాను 4,627 మెగావాట్ల పంపింగ్ సామర్థ్యం గల మోటార్ పంపులు అవసరంకాగా ఒక్క మేఘానే 3,057 మెగావాట్ల పంపింగ్ సామర్థ్యంగల మోటార్ పంపులను ఏర్పాటు చేసింది. దీంతోపాటే పంప్‌హౌస్ ఆకృతి నిర్మాణంలో సర్వీస్ బే భూమి ఉపరితలం నుంచి 210 మీటర్లు లోతున ఉంది. పంప్ బే 190.5 మీటర్లు, యాన్సిరీ బే 195.5 మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్ బే 215 మీటర్లు, కంట్రోల్ రూం 209 మీటర్ల లోతున ఉన్నాయి. ఆదివారం ఒక మోటార్‌కు విజయవంతంగా ట్రయల్ రన్ చేపట్టగా సోమవారం మధ్యాహ్నం సుమారు 45 నిమిషాలపాటు నీటిని పంప్ చేశారు. బుధవారం నాటికి రెండు మోటార్లను సిద్ధం చేయనుండగా వాటిని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్నారు. ఇక్కడి నుంచి నీటిని మిడ్‌మానేరుకు తరలించనున్నారు.

**ప్రపంచంలోనే వినూత్నమైంది..**

ఇదొక అత్యద్భుతమైన అండర్‌గ్రౌండ్ పంప్‌హౌస్. భూమికి 470 అడుగుల దిగువన, జంట టన్నెల్స్‌తోపాటు ప్రపంచంలోనే అతిపెద్ద సర్జ్‌పూల్స్ నిర్మించాం. ఈ మెగా ప్రాజెక్టులో 139 మెగావాట్ల సామర్థ్యంగల 5 మెషీన్లతో రోజుకు 2 టీఎంసీల నీటిని పంపింగ్ చేయగల సామర్థ్యంతో నెలకొల్పాం. ఏ రకంగా చూసినా ఈ ప్రాజెక్టు ప్రపంచంలోనే వినూత్నమైన మెగా ప్రాజెక్టు. ఈ మహా అద్భుతమైన ప్రాజెక్టును అనతికాలంలోనే పూర్తి చేసిన ఘనత మాకే దక్కుతుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల, నిరంతర పర్యవేక్షణ, నేరుగా యంత్రాంగంతో ప్రతి అంశం చర్చించి ప్రోత్సహించడం వల్లే తక్కువ కాలంలో దీన్ని పూర్తి చేయడం సాధ్యమైంది. *– బి. శ్రీనివాస్‌రెడ్డి, మేఘా డైరెక్టర్*



సోమవారం చిత్తూరు జిల్లా నగరిలో ఏపీఐఐసీ చైర్‌పర్సన్ రోజా నివాసంలో తేనీటి విందు స్వీకరిస్తున్న సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులు. చిత్రంలో ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఏపీ మంత్రి నారాయణస్వామి, ఎంపీ మిథున్ రెడ్డి తదితరులు



కేసీఆర్ కుమార్తె కవితకు పట్టువస్త్రాలు ఇస్తున్న రోజా. చిత్రంలో కేసీఆర్ సతీమణి శోభ

# కొత్త అధ్యాయం లిఖిస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

సకుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో చిత్తూరు జిల్లా నగరి పట్టణంలోని ఏపీఐఐసీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే ఆర్కే రోజా నివాసానికి వెళ్లారు. ఆయనకు ఎమ్మెల్యే రోజా, పూర్ణకుంభంతో వేద పండితులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోజా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విందులో కేసీఆర్ పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘కంచి దేవస్థానానికి విశేష దర్శనానికి వచ్చాం. దర్శనం బాగా జరిగింది. పెద్దలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారు శ్రద్ధ తీసుకున్నారు. కుమార్తె ఆర్కే రోజా మంచి ఆతిథ్యమిచ్చారు. అన్నదాత సుఖీభవ. రాయలసీమ ప్రాంతానికి గోదావరి జలాలు రావాల్సిన అవసరముంది. క్రియాశీలకంగా పట్టుదలతో పనిచేసే యువకుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు కనుక తప్పకుండా ఇది సాధ్యమౌతుంది. అన్నగా రాయలసీమ ప్రజల కష్టాలు నాకు తెలుసు. అందుకే 100% నా ఆశీస్సులు, సహకారం ఆయనకు ఉంటుంది. దీనిపై ఇప్పటికే చర్చలు జరిపాం. ఇప్పుడు నీరుంది. సుమారు వెయ్యి టీఎంసీలు గోదావరి నుంచి పోయింది. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులు దాదాపు నిండి సముద్రంలోని నీరు వెళ్తోంది. ఆ నీరు అలా వృధాగా పోకూడదని ఆలోచించి నేను, జగన్‌మోహన్ రెడ్డి చర్చించి సానుకూల నిర్ణయానికి వచ్చాం. 70ఏళ్లలో లేనటువంటి కొత్త అధ్యాయాన్ని నేను, జగన్ కలిసి లిఖించబోతున్నాం. కొందరికి ఇది అర్థం కాకపోవచ్చు, జీర్ణం కాకపోవచ్చు, అజీర్తి కూడా కావచ్చు. ప్రజల దీవెన ఉన్నంత కాలం తప్పకుండా వారి కోరికలు నెరవేరుస్తాం. రాయలసీమను రతనాలసీమగా మార్చడానికి దేవుడిచ్చిన సర్వశక్తులు వినియోగిస్తాం’అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, భూగర్భ గనులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆదిమూలం, ఎంఎస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు సాదర స్వాగతం

అంతకుముందు సీఎం కేసీఆర్‌కు సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. కాంచీపురం శ్రీఅత్తి వరదరాజస్వామి దర్శనార్థం ఆయన ప్రత్యేక విమానంలో ఉదయం 11.35గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్తూరు జిల్లా ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆదిమూలం, ఎంఎస్ బాబు, జిల్లా కలెక్టర్ ఎన్ భరత్ గుప్తా, అర్బన్ ఎస్పీ అన్బురాజన్, ఆర్‌డీవో కనకనరసారెడ్డి, తహసీల్దార్ విజయసింహారెడ్డి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సురేష్, సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శుక్లా, వైఎస్సార్ సీపీ నేతలు భూమన అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, పోకల అశోక్ కుమార్, వల్లివేడు పృథ్వీరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డుమార్గాన కాంచీపురానికి బయల్దేరి వెళ్లారు. కాంచీపురంలో ఆయనకు ఆలయ అధికారులు, వేదపండితులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అత్తి వరదరాజస్వామికి కేసీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి త్యాగరాజు ప్రసాదాలు అందజేసి సత్కరించారు. కేసీఆర్ వెంట ఆయన సతీమణి శోభ, కుమార్తె, మాజీ ఎంపీ కవిత, ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్‌పర్సన్ ఆర్కే రోజా, ఎంపీ మిథున్ రెడ్డి తదితరులున్నారు. వరదరాజస్వామి దర్శనం అనంతరం రాత్రి 7.10గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడినుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వచ్చేశారు. ఆయనకు విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సారథ్యంలో శ్రీకాళహస్తి దేవస్థానానికి చెందిన వేదపండితులు ప్రత్యేక ఆశీర్వచనమిచ్చారు. ఎమ్మెల్యే కేసీఆర్‌కు జ్ఞాపికను బహూకరించారు.



# ఆడా.. ఈడా.. మనోళ్లే!

**అన్ని రాష్ట్రాల్లోనూ తెలుగువారు.. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్తున్న వైనం**

**కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ అధ్యయనంలో వెల్లడి**

**కర్ణాటక, మహారాష్ట్రలకే అత్యధిక వలసలు**

సాక్షి, హైదరాబాద్

దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా తెలుగువారి జాడలే కనిపిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం ఆయా రాష్ట్రాల్లో తాత్కాలిక, స్థిర నివాసం ఏర్పరచుకుంటున్నట్లు కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. వీరంతా దశాబ్దకాలం క్రితమే అక్కడికి వెళ్లి వివిధ రంగాల్లో సెటిల్ అయినట్లు వెల్లడించింది. ఏపీ నుంచి కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు.. తెలంగాణ నుంచి కర్ణాటక, మహారాష్ట్రలకు అత్యధికులు వలస వెళ్లినట్లు ఈ అధ్యయనం పేర్కొంది. తెలుగు రాష్ట్రాల నుంచి వలసవెళ్లిన వ్యక్తులు, కుటుంబాలను ఈ అధ్యయనంలో సుమారుగా లెక్కించారు. వీరిలో అత్యధికంగా 8.90 లక్షల మంది కర్ణాటకలో స్థిరనివాసం ఏర్పరచుకున్నట్లు వెల్లడించారు. ఇక రెండో స్థానంలో ఉన్న మహారాష్ట్రలో సుమారు 4.37 లక్షల మంది స్థిరనివాసం ఏర్పరచుకున్నట్లు పేర్కొన్నారు.

## ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు సైతం..

తెలుగు రాష్ట్రాల నుంచి పొరుగు రాష్ట్రాలతో పాటు ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాలకు వలస వెళ్లినవారు ఉండటం విశేషం. విద్య, ఉద్యోగం, ఉపాధి కోసమే అత్యధికులు ఆయా రాష్ట్రాలకు పయనమైనట్లు ఈ అధ్యయనం పేర్కొంది. కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో తెలంగాణ ప్రాంతానికి నిజాం కాలం నుంచి భౌగోళికంగా, సాంస్కృతికంగా, భాషాపరంగా సాన్నిహిత్యం ఎక్కువగా ఉండటంతో పలువురు ఆయా రాష్ట్రాలకు పయనమైనట్లు వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో పరిశ్రమలు, భవన నిర్మాణ కార్మికులు, పవర్‌లూమ్‌లు, చేనేత, మార్కెటింగ్, ఐటీ, వ్యాపారం, వాణిజ్యం, ఆటోమొబైల్, నిర్మాణరంగంతోపాటు ఇతర రంగాల్లో తెలుగువారు ఉపాధి పొందుతున్నట్లు తెలిపింది. కర్ణాటకకు వలసవెళ్లిన తెలుగువారిలో సుమారు 1.60 లక్షల మంది సింగిల్‌గా ఉపాధి కోసం వెళ్లినట్లు పేర్కొంది. మరో 7.3 లక్షల మంది కుటుంబాలతో సహా వలస వెళ్లినట్లు తెలిపింది. ప్రధానంగా తెలుగువారు బీదర్, రాయచూర్, బసవకల్యాణ్ తదితర ప్రాంతాల్లో తాత్కాలిక, స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడించింది. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి అత్యల్పంగా కేరళ, పుదుచ్చేరి, బిహార్, జార్ఖండ్ ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాలకు పయనమైనట్లు పేర్కొంది.

**రాష్ట్రాలకు వలసవెళ్లిన తెలుగువారి సంఖ్య సుమారుగా..**

| రాష్ట్రం | వలస వెళ్లిన వారు | | |
|---|---|---|---|
| కర్ణాటక | 8.90 లక్షలు | గోవా | 5,652 |
| మహారాష్ట్ర | 4.37 లక్షలు | హిమాచల్‌ప్రదేశ్ | 1,933 |
| తమిళనాడు | 2.86 లక్షలు | ఉత్తరాఖండ్ | 117 |
| ఒడిశా | 1.20 లక్షలు | ఢిల్లీ | 23,436 |
| గుజరాత్ | 46,784 | ఉత్తరప్రదేశ్ | 16,060 |
| కేరళ | 6,269 | బిహార్ | 06 |
| జమ్మూ కశ్మీర్ | 2,085 | అసోం | 3,465 |
| పుదుచ్చేరి | 40 | అరుణాచల్‌ప్రదేశ్ | 43 |
| పంజాబ్ | 7,789 | నాగాలాండ్ | 407 |
| హరియాణా | 8256 | మణిపూర్ | 167 |
| రాజస్థాన్ | 12,193 | మిజోరాం | 92 |
| మధ్యప్రదేశ్ | 17,375 | పశ్చిమబెంగాల్ | 16,707 |
| గుజరాత్ | 46,784 | జార్ఖండ్ | 21 |
| | | ఛత్తీస్‌గఢ్ | 6,484 |

# ఏనుగుల పార్కు చూసొద్దాం!

- మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అటవీప్రాంతంలో సంరక్షణ కేంద్రం
- కాళేశ్వరం నుంచి 69 కిలోమీటర్ల దూరం
- ఆసక్తి చూపుతున్న కాళేశ్వరం పర్యాటకులు
- బ్రిటిష్‌కాలం తర్వాత అటవీశాఖ ఆధ్వర్యంలో ఏనుగుల సంరక్షణ
- ఇన్ని రోజులు ప్రపంచానికి దూరంగా... ప్రస్తుతం సోషల్ మీడియాతో వెలుగులోకి
- పార్కులో 10 వరకు ఏనుగులు



**కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించేందుకు పెద్ద ఎత్తున వస్తున్న పర్యాటకులు ఆ చుట్టుపక్కల ఉన్న పర్యాటక కేంద్రాలను కూడా చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఉన్న ఏనుగుల పార్కు ప్రస్తుతం ఇక్కడికి వచ్చే సందర్శకులను ఆకట్టుకుంటోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో చుట్టూ గుట్టలు.. చెరువుల మధ్య అహ్లాదకరమైన వాతావరణంలో మహారాష్ట్ర అటవీశాఖ ఈ పార్కును ఏర్పాటు చేసింది. గడ్చిరోలి జిల్లా కమలాపూర్ గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఈ పార్కు ఉంటుంది. ఈ పార్కు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామానికి 69 కిలోమీటర్ల దూరంలో ఉంది. మహారాష్ట్ర అటవీశాఖ రూ. 2 కోట్లతో ఇక్కడ కాటేజీలు, చిన్న చిన్న షెడ్ల నిర్మాణం చేపట్టింది. సందర్శకులు విడిది చేయడానికి అన్ని హంగులను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇప్పటివరకు ఇతర ప్రాంతాల వారికి పెద్దగా తెలియని ఈ పార్కుకు సోషల్ మీడియా వల్ల ప్రాచుర్యం వచ్చింది.

**కాళేశ్వరంతో పెరిగిన సందర్శకులు**

తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా ఇక్కడి కాళేశ్వరాలయంతో పాటు చుట్టప్రక్కల ఆలయాలు, పార్కులకు సందర్శకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం-మహారాష్ట్రలోని చింతలపల్లి, సిరొంచ-రాపన్‌పల్లి (చెన్నూర్)వద్ద గోదావరి, ప్రాణహిత నదులపైన అంతర్‌రాష్ట్ర వంతెనలు అందుబాటులోకి రావడంతో రాకపోకలు సులువయ్యాయి. దీంతో మహారాష్ట్రలోని ఏనుగుల పార్కును చూసేందుకు కూడా అవకాశం వచ్చిందని పర్యాటకులు చెబుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు వచ్చే పర్యాటకులు ఏనుగుల పార్కును చూడటానికి కూడా ఆసక్తి చూపుతున్నారు.

**బ్రిటిష్ హయాంలో ఏనుగుల వినియోగం..**

1908లో బ్రిటిష్ పాలకుల కాలంలో ఏనుగులను వివిధ రకాల పనులకు వాడేవారు. అందులో భాగంగా ఇక్కడి విలువైన ప్రకృతి సంపదను ఇంగ్లండ్‌కు తరలించే క్రమంలో పెద్దపెద్ద యంత్రాలు లేకపోవడంతో ఏనుగులను వాడేవారని ఫారెస్టు గార్డులు పేర్కొంటున్నారు. ఇలాగే విలువైన టేకు దుంగలను మోయడానికి కూడా ఏనుగులు వాడేవారు. ఇలా ఇక్కడి ప్రాంతంలో ఏనుగులు మిగిలాయని గార్డులు తెలిపారు. 1965లో ఆళ్లపల్లి అడవిలో నాలుగు ఏనుగులు మిగిలాయి. ఆ నాలుగు ఏనుగులను అక్కడి నుంచి కమలాపూర్‌కు తీసుకువచ్చి ఏనుగుల సంరక్షణ బాధ్యతను మహారాష్ట్ర అటవీశాఖ చూస్తోంది. అటవీశాఖ అధికారులు కూడా కలప స్మగ్లర్లు పెద్ద టేకు కలపను నరికి తీసుకువెళ్తుండగా పట్టుబడితే దుంగలను డిపోకు తీసుకు వచ్చేందుకు ఏనుగులను ఉపయోగించేవారు. కాలక్రమేణా జంతువులతో పనులు చేయించరాదని ఆదేశించడంతో ఏనుగులను అటవీశాఖ సంరక్షిస్తూ వస్తోంది.

**మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకే ..**

మధ్యాహ్నం 12 గంటలకు ఆహారం తినేందుకు వచ్చే ఏనుగులు 3 గంటల వరకు ఆహారం తిని చెరువు వద్ద నుంచి తిరిగి అడవిలోకి వెళ్తాయి. రాత్రి మొత్తం అడవిలో తిరుగుతాయి. కాగా, సందర్శకులు ఏనుగులు చూసేందుకు మధ్యాహ్నం 12-3 గంటల వరకు వస్తేనే వీలవుతుంది. మిగతా సమయాల్లో చూడటానికి వీలుండదు.

**పార్కుకు వెళ్లేది ఇలా..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం మీదుగా అంతర్‌రాష్ట్ర వంతెన దాటాలి. సిరొంచ, బామిని, రేపన్‌పల్లి దాటాక కుడివైపునకు వెళ్లాలి. అక్కడ కమలాపూర్ గ్రామం ఉంటుంది. అక్కడి నుంచి మూడు కిలోమీటర్ల దూరం తారురోడ్డు మీదుగా అడవిలోకి వెళ్లాలి. ఈ మార్గాన్ని ఆళ్లపల్లి-అహేరి మార్గం అంటారు. ఆర్టీసీ బస్సులు మాత్రం అందుబాటులో ఉండవు. కేవలం ప్రైవేట్ వాహనాల్లోనే వెళ్లాల్సి ఉంటుంది.

## ప్రస్తుతం పది ఏనుగులు

కమలాపూర్ అడవిలో ప్రస్తుతం పది ఏనుగులు ఉన్నాయి. ఇందులో రెండు చిన్న ఏనుగులు ఉన్నాయి. వీటిలో పెద్ద ఏనుగుకు 90 సంవత్సరాలకుపైగా వయసు ఉంటుందని ఫారెస్టు గార్డులు తెలిపారు. మరొకటి 87 సంవత్సరాల వరకు ఉంటుందన్నారు. ఏనుగులకు గార్డుల ద్వారా ప్రత్యేకమైన శిక్షణ ఇప్పించడంతో దగ్గరికి వెళ్లినా అవి ఎలాంటి హానీ చేయవని తెలిపారు. ఈ ఏనుగుల్లో బసంతి(90) అనే ఏనుగు అత్యధికంగా 15 అడుగుల ఎత్తుతో ఉండగా మిగతావి 8-12 అడుగుల వరకు ఉన్నాయి.





## ప్రత్యేక ఆహారం

పార్కులో ప్రతీరోజు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఏనుగులు ఆహారం తినేందుకు చెరువు వద్దకు వస్తాయి. ఆ సమయంలో పది ఏనుగులకు 50 కిలోల బియ్యంతో ప్రత్యేకంగా అన్నం వండి పెడతారు. అన్నంలో నూనె, ఉప్పు కలిపి రెండు కిలోలకు ఒక ముద్దను అందుబాటులో ఉంచుతారు. అలాగే, గోధుమ పిండినికూడా ముద్దలుగా చేసి పెడతారు. అడవిలో కంక బొంగులు, వాటి ఆకులు, దుంపిడి, టేకు ఆకులు, మద్ది ఆకులను సైతం ఏనుగులు తింటాయి.



4వ బాహుబలి విద్యుత్ మోటార్ వెట్‌రన్‌తో గ్రావిటీ కాలువలోకి వస్తున్న నీరు

## మరో బాహుబలి మోటార్ వెట్‌రన్ సక్సెస్

**రామడుగు (చొప్పదండి):** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీపూర్ పంపుహౌస్ (గాయత్రి)లో అధికారులు సోమవారం రాత్రి 9.15 గంటలకు 4వ బాహుబలి విద్యుత్ మోటార్ వెట్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అధికారులు ఇక్కడ 5వ బాహుబలి మోటార్‌కు విజయవంతంగా వెట్‌రన్ నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం మధ్యాహ్నం 4వ మోటార్ వెట్‌రన్‌కు ఏర్పాట్లు చేసుకున్న అధికారులు కొన్ని సాంకేతిక సమస్యలు రావడంతో వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించి రాత్రి వెట్‌రన్ నిర్వహించారు. రాష్ట్ర సాంకేతిక సలహాదారు పెంటారెడ్డి స్విచ్‌ఆన్ చేసి మోటార్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈ నూనె శ్రీధర్, డీఈఈ గోపాలకృష్ణ, ఏఈఈలు సురేశ్, రమేశ్, శ్రీనివాస్ ఇతర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. దాదాపు గంటపాటు ఈ వెట్‌రన్‌ను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

# నౌకలో భారీ పేలుడు



మంటల్లో చిక్కుకున్న కోస్టల్ జాగ్వార్ నౌక

- సముద్రంలో దూకి ఒకరి మృతి.. మరొకరి గల్లంతు
- 15 మందికి గాయాలు
- రాష్ట్రానికి చెందిన ముగ్గురి సహా ఆరుగురి పరిస్థితి విషమం
- విశాఖ ఔటర్ హార్బర్‌లో దుర్ఘటన

**సాక్షి, విశాఖపట్నం, పాతపోస్టాఫీసు (విశాఖ దక్షిణం):** విశాఖ తీరానికి సుమారు మూడు నాటికల్ మైళ్ళ దూరంలో ఉన్న చిన్న నౌక...టగ్‌లో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో సముద్రంలో దూకి ఒకరు మరణించగా, మరొకరు గల్లంతయ్యారు. 15మంది గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. వీరిలో రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఉన్నారు. వీరిందరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముడి చమురు నౌకలను నిలిపి ఉంచే సింగిల్ పాయింట్ మూరింగ్ (ఎస్‌పీఎం) టెర్మినల్ వద్ద హెచ్‌పీసీఎల్‌కు చెందిన అద్దె నౌక 'టగ్' కోస్టల్ జాగ్వార్‌లో (ఔట్ హార్బర్‌లో నిలిపి ఉన్న నౌకలను ఇన్నర్ హార్బర్‌లోకి తీసుకువచ్చే నౌకను టగ్‌గా వ్యవహరిస్తారు) ఒక్కసారిగా పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. హెచ్‌పీసీఎల్‌కు సంబంధించిన ముడి చమురును నౌకల్లోకి తరలించే భారీ నౌకలో ఆదివారం రాత్రి గాలుల ధాటికి సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. వాటిని సరిచేసేందుకు కోస్టల్ జాగ్వార్ టగ్‌లో సోమవారం ఉదయం సిబ్బంది వెళ్లారు. టగ్‌ను భారీ నౌకకు హోస్ పైపులతో అనుసంధానించే క్రమంలో టగ్ అడుగు భాగం నుంచి ఆయిల్ లీక్ అయి రాపిడికి ఒక్కసారిగా మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. క్షణాల్లోనే టగ్ 70 శాతం వరకు తగలబడింది. ఆరుగురు సిబ్బంది మంటల్లో చిక్కుకోగా వారి శరీరం చాలావరకు కాలిపోయింది. పేలుడు సమయంలో ప్రాణాలను రక్షించుకునేందుకు ఎనిమిది మంది సముద్రంలోకి దూకేశారు. వీరిలో ఆరుగురు ఈతకొట్టుకుంటూ ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఇద్దరు గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో ఆసీస్ అనే వ్యక్తి మృతదేహం లభ్యమైందని హార్బర్ ఏసీపీ టి.మోహన్‌రావు తెలిపారు. మరొకరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇండియన్ కోస్ట్‌గార్డ్, పోర్టుకు చెందిన ఐదు నౌకలు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల్ని రక్షించడంతో పాటు నౌకలోని మంటలను ఆదుపుచేశాయి. అగ్నిప్రమాదంపై జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్ విచారణకు ఆదేశించారు.

**పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నవారు..**

1.వనమాడి అన్నవరం (40)
తూర్పు గోదావరి జిల్లా - 2.అన్సార్ (39)
కోల్‌కతా - 3.తాశారపు భరధ్వాజ్ (23)
విశాఖపట్నం (అత్యంత విషమం)
4.జస్వీర్ సింగ్ (46) ఉత్తరప్రదేశ్
5.జువిన్ జోషి (24) కేరళ
6.చింతపల్లి తండేలు (48) శ్రీకాకుళం, ఎచ్చెర్ల

**ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు..**

1.కన్నయ్య (44)..గుజరాత్
2.వై. సత్తిబాబు (39) తూర్పు గోదావరి
3.రామ్ నివాస్ యాదవ్ (64) హరియాణా
4.రోహిత్ చౌహాన్ (31)ఉత్తరప్రదేశ్
5.శ్యాం కె.అర్జున్ (25) కేరళ - 6.మంజిత్ కుమార్ (27)ఉత్తరప్రదేశ్ - 7.రాకేష్ కుమార్ (27) జార్ఖండ్ - 8.ముఖేష్ కుమార్ (35) హరియాణా
9.కమల్‌కాంత్ (24)బిహార్

# నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం


- ప్రతీ క్షణం ఆ దిశగానే మా పరిపాలన: ఏపీ సీఎం జగన్
- ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రజలకు ధైర్యాన్నిచ్చింది
- మాపై వారి విశ్వాసమే ఓటుగా మారి సంచలన విజయాన్ని అందించింది
- సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి రచించిన 'జయహో' పుస్తకావిష్కరణ సభలో ఏపీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్

సాక్షి, అమరావతి

రాష్ట్ర ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కానివ్వరాదని ప్రతీ క్షణం ఆలోచిస్తూ ఆ దిశగా పరిపాలన సాగిస్తున్నట్లు ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉండగా తాను చేపట్టిన 3,648 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర ప్రజలకు ధైర్యాన్నిచ్చిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రపై సీనియర్ పాత్రికేయుడు కొండు భట్ల రామచంద్రమూర్తి రచించిన 'జయహో' పుస్తకావిష్కరణ సభ ఎమెస్కో ఆధ్వర్యంలో సోమ వారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాల యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ సాధారణంగా ఎన్నికల మేనిఫెస్టోను రాజకీయ పార్టీలు పేజీలకు పేజీలు ముద్రిస్తాయని, వైఎస్సార్‌సీపీ మాత్రం రెండు పేజీల్లోనే ప్రజలకిచ్చిన హామీలతో మేనిఫెస్టో రూపొందించిందని చెప్పారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి హామీని అమలుచేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. 19 బిల్లులు ఒకే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

**పాదయాత్ర గుర్తొస్తే గొప్ప ఉత్తేజం: జగన్**

'పాదయాత్ర నిజంగానే గొప్ప అనుభవం. అంత దూరం నడిచానని గుర్తు చేసుకున్నప్పుడు గొప్ప ఉత్తేజం కలుగుతుంది. జగన్ వచ్చాడు.. మమ్మల్ని కలుస్తాడు... మా కష్టాలు చెప్పుకుంటామంటూ ప్రజలు వచ్చేవారు. మా కష్టాలు విన్నాడు, దేవుడు ఆశీర్వదిస్తే వాటిని తీరుస్తాడనే వారి నమ్మకమే ఒక ఉప్పెనై అదే ఓటుగా మారింది. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ ఎరుగని విజయాన్ని ప్రజలు అందించారు. దేవుడి ఆశీర్వాదంతో వారి నమ్మకాన్ని నిజం చేసేలా ముందుకు వెళుతున్నాం''



జయహో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్. చిత్రంలో రచయిత, సీనియర్ పాత్రికేయుడు కె.రామచంద్రమూర్తి, "ది ప్రింట్" ఎడిటర్ ఇన్ చీఫ్, పద్మభూషణ్ శేఖర్ గుప్తా

**జగన్ విజయవంతమైన యువనేత: శేఖర్ గుప్తా**

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే విజయవంతమైన, యువకుడైన కొత్త తరం నాయకుడని 'ది ప్రింట్' ఎడిటర్ ఇన్‌ఛీఫ్, పద్మభూషణ్ పురస్కార గ్రహీత శేఖర్ గుప్తా పేర్కొన్నారు. జయహో పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మరెవరిలోనూ చూడని ఆత్మవిశ్వాసాన్ని తాను దివంగత వైఎస్సార్‌లో చూసినట్లు తెలిపారు. జగన్ రూపంలో వైఎస్సార్ వారసత్వం మన మధ్యే ఉందన్నారు. సొంతంగా ఓటింగ్ బలం ఉన్న 30 మంది ప్రాంతీయ నాయకులతో దేశం సుస్థిరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

**'జయహో' వంద శాతం సంతృప్తినిచ్చింది: రామచంద్రమూర్తి**

జర్నలిస్టుగా నాలుగున్నర దశాబ్దాల తన వృత్తి జీవితంలో నూటికి నూరుపాళ్లు సంతృప్తినిచ్చిన కార్యక్రమం 'జయహో' పుస్తకరచన అని సీనియర్ పాత్రికేయుడు కొండుభట్ల రామచంద్రమూర్తి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో పాదయాత్ర సందర్భంగా హాజరైన ప్రజలు.. నదిపై సముద్రంలా నడిచారని గుర్తు చేసుకున్నారు. కానీ తర్వాత రోజు ఒక్క సాక్షిలో మినహా ఏ పత్రికలోనూ ఆ ఫొటో కనిపించలేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రచురణకర్త ఎమెస్కో విజయకుమార్ తదితరులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఈ సందర్భంగా సీఎం జగన్‌కు శాలువ కప్పి సన్మానించారు. వేదికపై ఆశీనులైన వారికి బొకేలకు బదులుగా పుస్తకాల్ని అందజేశారు. ప్రజా సంకల్ప పాదయాత్ర ఫొటోలు తీసిన జర్నలిస్టులను ఈ సందర్భంగా వేదిక పైకి పిలిచి అభినందించారు. కార్యక్రమంలో పలువురు నేతలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# కొండముచ్చుకు ఫోన్ నచ్చింది!

**తాడేపల్లిరూరల్ (మంగళగిరి):** అడవిలో ఆకులు, అలములు తింటున్న ఆ కొండముచ్చుకి బోర్ కొట్టినట్టుంది.. అందుకే కొండ సమీపంలో ఉన్న ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్‌ను పట్టుకెళ్లింది. కొండపై కూర్చుని ఎంచక్కా ఆ మొబైల్‌తో ఆడుకుంటూ తెగ ఎంజాయ్ చేస్తోంది.. గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణానికి చెందిన ఎస్‌కే చాంద్‌బాషా ఇంట్లోకి సోమవారం ఓ కొండముచ్చు చొరబడి.. ఆయన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కెళ్లింది. దీంతో చాంద్‌బాషా దానిని వెంబడించాడు. తినుబండారాలు వేస్తే ఫోన్ వదిలేస్తుందని భావించి.. అరటిపళ్లు వేశాడు. తాపీగా వాటిని తినేసిందిగానీ సెల్ మాత్రం వదల్లేదు. ఆ ఫోన్‌కు కాల్ చేయగా.. రింగవుతున్న ఆ మొబైల్‌ను రెండుచేతులతో పట్టుకుని మరింత ఆసక్తితో చూస్తోంది తప్ప వదలడం లేదు. రెండు గంటలు ప్రయత్నించి విసిగిపోయిన చాంద్‌బాషా చివరికి కొండముచ్చుపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారం కిందటే రూ.12 వేలతో ఫోన్ కొనుగోలు చేశానని పోలీసుల ఎదుట వాపోయాడు.

## ఓవర్ స్పీడ్‌కు కళ్లెం ఏది?

- రాష్ట్రంలోని ముంబై,విజయవాడ(65), బెంగళూర్ (44), భూపాలపట్నం (163) జాతీయ రహదారులపై వాహనాలు మితి మీరిన వేగంతో దూసుకెళుతున్నాయి. కార్లు గంటకు 90–120 కి.మీ., ప్రైవేటు లారీలు, బస్సులు 120 కి.మీ. నుంచి 150 కి.మీ. వేగంతో వెళుతున్నాయి. ఈ రహదారులపై స్పీడ్‌కు ఎలాంటి కళ్లెం లేదు. స్పీడ్‌గన్లు లేవు.
- ఆయా రహదారులపై గూడ్స్ వాహనాలు పలువురు ప్రయాణికులను ఎక్కించుకుని వెళుతున్నాయి. వీటిని పోలీసులు, ఆర్టీఏ అధికారులు అడ్డుకోవడంలేదు. తూతూ మంత్రంగా జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు.

## కొత్త చట్టం అమల్లోకి వస్తేనే!

మామూలు జరిమానాలను ఎవరూ పెద్దగా ఖాతరుచేయడంలేదు. ఓవర్‌స్పీడ్ విభాగం లోనే గత ఆరునెలల్లో ఏకంగా రూ.46 కోట్ల జరిమానాలు వసూలు చేశారు. ఓవర్‌లోడిం గ్‌కు రూ.2కోట్లకు పైగా జరిమానా విధిం చారు. అయినా ఇలాంటి డ్రైవర్లలో మార్పు రావడం లేదు. ఇంతకాలం ఓవర్‌స్పీడ్‌కు కేవలం రూ.400 మాత్రమే జరిమానా విధించేవారు. కొత్త మోటారు వాహన చట్టం అమల్లోకి వస్తే రూ.1000తోపాటు వాహనంలో ఎంతమంది ఉంటే అన్ని రూ.2000 చెల్లించాలి. అప్పుడుగానీ కాస్త మార్పు రావొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

"అనుమతులు లేని వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరం. వాటిలోనే కూలీలు ప్రయాణిస్తున్నారు. ఒకవేళ ప్రమాదం జరిగి కూలీలు మరణించినా వారి కుటుంబాలకు పరిహారం దక్కదు. అలాంటి వాహనాలు ఎక్కడమే చట్టవిరుద్ధమైనపుడు వాటి వల్ల ప్రమాదం జరిగితే బాధిత కుటుంబాలకు కోర్టులు న్యాయం చేయవు.

– ఆటో అండ్ మోటార్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దయానంద్

# రోడ్డున పడ్డ భద్రత!

## ఓవర్‌లోడ్ పట్టని పోలీసులు, ఆర్టీఏ అధికారులు

- ప్రమాద తీవ్రతను పెంచుతున్న వేగం, ఓవర్‌లోడింగ్
- నేతి బీర చందంగా రహదారి భద్రత
- కొండగట్టు, కొత్తపల్లి ప్రమాదాలతో మేల్కొని అధికారులు




- ఇటీవల మహబూబ్‌నగర్‌జిల్లా మిడ్జిల్ మండలం కొత్తపల్లి వద్ద ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో 13 మంది చనిపోయారు.
- గతేడాది జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద 100 మందికిపైగా ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కందకంలో పడి 60 మంది ప్రాణాలు కోల్పోయారు.
- ఓవర్‌లోడ్ వాహనాలపై పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం వల్లే ఈ రెండు ప్రమాదాల్లో భారీగా ప్రాణనష్టం జరిగిందని రోడ్డు భద్రతా నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

రోడ్డుభద్రత 'నేతి బీరలో నెయ్యి చందం' అయింది. భద్రతకు భరోసా లేకుండా పోయింది. ఓవర్‌లోడ్, ఓవర్‌స్పీడ్ వాహనాలకు కళ్లెం వేసేనాథుడు లేడు. ఆర్అండ్ బీ, ఆర్టీఏ శాఖలు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తు న్నాయి. ఫలితంగా రహదారులు రక్తధారలుగా మారుతున్నాయి. పెద్దసంఖ్యలో అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. – సాక్షి, హైదరాబాద్

**కమిషనరేట్లు, జిల్లాల పరిధిలో...**

| | |
|---|---|
| సైబరాబాద్ | 386 |
| రాచకొండ | 368 |
| సంగారెడ్డి | 231 |
| వరంగల్ | 172 |
| నల్లగొండ | 166 |
| సిద్దిపేట | 151 |
| రామగుండం | 140 |
| సూర్యాపేట | 130 |





శామీర్‌పేటలో కరీంనగర్-హైదరాబాద్ రహదారిపై ప్రమాదంలో కారు పైకి దూసుకెళ్లిన మరో కారు

# విధి చిదిమేసింది!

- శామీర్‌పేట పెద్దచెరువు వద్ద రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి, మరో ముగ్గురికి గాయాలు
- డివైడర్‌ను ఢీ కొట్టి.. గాల్లోకి ఎగిరి ఎదురుగా వస్తున్న మరో కారుపైకి దూసుకెళ్లిన వాహనం
- అతివేగమే ప్రమాదానికి కారణం..

**శామీర్‌పేట్:** పిల్లలతో సహా పెళ్లిరోజు వేడుకలను సంతోషంగా జరుపుకుని వస్తున్న ఓ కుటుంబంపై విధికి కన్నుకుట్టింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆ కుటుంబాన్ని చిదిమేసింది. కరీంనగర్–హైదరాబాద్ రహదారి శామీర్‌పేటలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందగా ఆ కుటుంబంలోని ఓ బాలుడితో పాటు ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. శామీర్‌పేట సీఐ నవీన్‌రెడ్డి ప్రమాదం జరిగిన తీరును వెల్లడించారు. హైదరాబాద్‌లోని నాగోల్.. బండ్లగూడకు చెందిన కోసూరి కిశోర్ చారి (55), భార్య భారతి (45), వీరి ఇద్దరు కుమారులు సుధాంశ్ (15), తనిష్‌లు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ (టీఎస్08ఎఫ్‌వీ3005) కారులో సిద్దిపేట జిల్లా, వర్గల్ దేవాలయంలో దర్శనం చేసుకుని నగరానికి వస్తున్నారు. ఈ క్రమంలో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దచెరువు (రాజీవ్ రహదారిపై) సమీపంలో వీరి కారు వేగంగా వెళ్తూ.. డివైడర్‌ను ఢీ కొట్టింది. వేగం ఎక్కువగా ఉండడంతో గాల్లోకి ఎగిరి అవతలి రోడ్డులో (హైదరాబాద్–కరీంనగర్) గజ్వేల్‌కు వెళ్తున్న మారుతి సుజుకీ ఎర్టిగా (టీఎస్ 36ఈ 7111) కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎకోస్పోర్ట్ వాహనంలోని కిశోర్ చారి, ఆయన భార్య భారతి, పెద్దకుమారుడు సుధాంశ్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, చిన్న కుమారుడు తనిష్‌తో పాటు ఎదురుగా వస్తున్న ఎర్టిగా కారులో ప్రయాణిస్తున్న రాజు, మహేష్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రెండు కార్లు ధ్వంసమయ్యాయి మృతదేహాలు కారులోనే ఉండటంతో స్థానికుల సాయంతో వీటిని బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామని, ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ నవీన్‌రెడ్డి తెలిపారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన సీసీటీవీలో ఈ ప్రమాద దృశ్యాలు, ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు వేగంగా అదుపుతప్పిన తీరు రికార్డయ్యాయి.

**పెళ్లి రోజు జరుపుకునేందుకు వెళ్లి..**

నాగోలు డివిజన్ పరిధిలోని వెంకట్‌రెడ్డి నగర్‌కు చెందిన బీజేపీ నాయకుడు, ఓబీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు కోసూరి కిశోర్‌చారి దంపతులతో పాటు వారి కుమారుడు సోమవారం సాయంత్రం శామీర్‌పేట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. కిశోర్, భారతిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వీరి కారులో బీదర్ లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకుని.. అక్కడినుంచి వేములవాడకు చేరుకుని రాజరాజేశ్వరుడి దర్శనం తర్వాత నగరానికి తిరుగుపయనమయ్యారు. సోమవారం మధ్యాహ్నం శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వీరి కారు ప్రమాదానికి గురైంది. సుధాంశ్ నాగోల్‌లోని ఎస్ఆర్ డీజీ స్కూల్లో టెన్త్ చదువుతున్నట్లు తెలిసింది. కిశోర్ చారి మృతితో నాగోలు డివిజన్‌లో బీజేపీ చురుకైన కార్యకర్తను కోల్పోయిందని బీజేపీ నేతలు కందికంటి కన్నాగౌడ్, శ్రీకాంత్, తదితరులు విచారం వ్యక్తం చేశారు.

## క్లుప్తంగా...

### అనంతగిరి ఇక 'అన్నపూర్ణ'

**సాక్షి, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో నిర్మించిన అనంతగిరి రిజర్వాయర్, పంపుహౌస్‌లకు అన్నపూర్ణ అనే పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. అయితే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్లకు మాత్రం అవే పేర్లు కొనసాగుతాయి. మొదటి ఐదు నిర్మాణాలకు ఇప్పటికే దేవతామూర్తుల పేర్లు పెట్టారు. మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంపుహౌజ్‌కు లక్ష్మి పేరును, అన్నారం బ్యారేజీ, సిరిపురం పంపుహౌజ్‌కు సరస్వతి, సుందిళ్ల బ్యారేజీ, గోలివాడ పంపుహౌజ్‌లకు పార్వతిగా ఇప్పటికే నామకరణం చేస్తూ నిర్ణయించారు. నందిమేడారం రిజర్వాయర్, పంపుహౌజ్‌కు నంది, లక్ష్మీపురం పంపుహౌజ్‌కు గాయత్రి పేరు పెట్టిన విషయం తెలిసిందే.

### 'కాంగ్రెస్ ఓ గాలి బుడగ'

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాయకత్వ సంక్షోభంలో కూరుకుపోయిందని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు వ్యాఖ్యానించారు. ఇప్పుడు కాంగ్రెస్ ఒక గాలిబుడగని, అది పేలడం ఖాయమని, కాకపోతే ఎప్పుడు, ఎక్కడ అనేదే చూడాలని సోమవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. బలమైన ప్రజాస్వామ్యానికి సమర్థవంతమైన ప్రతిపక్షం ఉండాలని బీజేపీ కోరుకుంటుందని, కానీ కాంగ్రెస్ ప్రతిపక్షంగా బతికి బట్టకట్టే పరిస్థితి కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికైన సోనియా గాంధీకి అభినందనలు తెలుపుతూ సమర్థమైన ప్రతిపక్షంగా తమ బాధ్యతలు నిర్వర్తిస్తారని ఆశిస్తున్నామన్నారు.

### 'అఖిలపక్ష భేటీలు నిర్వహించాలి'

**సాక్షి, హైదరాబాద్:** బీసీ రిజర్వేషన్లను 34 శాతం కొనసాగించాలని, వీటి ప్రకారంగానే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఈ నెల 16 నుంచి 22 వరకు అన్ని జిల్లాల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తెలిపారు. ఉన్న రిజర్వేషన్లను తగ్గిస్తే ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రిజర్వేషన్ల పెంపునకు మద్దతిచ్చిన కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు.

### బీజేపీలో చేరిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే శ్రీధర్

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీకి చెందిన వర్ధన్నపేట్ మాజీ ఎమ్మెల్యే కె. శ్రీధర్ సోమవారం బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీధర్‌తో పాటు టీఆర్ఎస్‌కు చెందిన బెల్లంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ రాజులాల్ యాదవ్, పీసీసీ జాయింట్ సెక్రటరీ వి.రఘు తదితరులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు దత్తాత్రేయ, జి.వివేక్, ధర్మారావు, వెంకటేశ్వర్లు, ఎస్.కుమార్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బంగారం, వజ్రాల వేట..!

- ఎన్ఎండీసీకి అన్వేషణ బాధ్యత అప్పగించే యోచన
- జీఎస్ఐ సహకారంతో బంగారం, తగరం వెలికితీత
- మైనింగ్ ఆదాయంలో దేశంలోనే మూడో స్థానం
- చైనా, రొమేనియా తరహాలో క్వారీ గుంతల అభివృద్ధి
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన భూగర్భ వనరుల శాఖ

**సాక్షి, హైదరాబాద్:** ఖనిజ ఆదాయంలో దేశంలోనే మూడోస్థానంలో ఉన్న రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో భూగర్భవనరుల సంపూర్ణ సమాచారాన్ని క్రోడీకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు చేసింది. ఆదాయ పెంపుదలకు బొగ్గు, యురేనియం, సున్నపురాయి, మాంగనీసు, ఇనుము తదితర ఖనిజాలతోపాటు ఇతర ఖనిజాల వెలికితీతను కూడా ముమ్మరం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ మైనింగ్ సంస్థ (ఎన్ఎండీసీ) సహకారంతో బంగారం, వజ్రపునిల్వల అన్వేషణ, వెలికితీత పనులు చేపట్టాలని నిర్ణయించింది. వజ్రాల జాడపై ఎన్ఎండీసీ ద్వారా సూర్యాపేట జిల్లాలో ఇదివరకే ప్రాథమిక సర్వే చేయించింది. మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వజ్రాలజాడల కోసం అన్వేషణ ప్రారంభించాలని ప్రతిపాదించింది. బంగారం, వజ్రాల వెలికితీత కోసం కొన్ని ప్రాంతాలను ఎన్ఎండీసీకి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) సహకారంతో గద్వాల జిల్లాలో బంగారం, వనపర్తి జిల్లా ఆత్మకూరు ప్రాంతంలో తగరం నిల్వల అన్వేషణ, వెలికితీత చేపట్టేందుకు గనులశాఖ సిద్ధమవుతోంది.

**బయ్యారం స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు వీలుగా..**

రాష్ట్ర పునర్విభజన చట్టం 13వ షెడ్యూలులోని 93వ సెక్షన్ ప్రకారం ఖమ్మం జిల్లాలో స్టీల్ ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సి ఉంది. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంటుకు అవసరమైన ముడి ఖనిజాన్ని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా(సెయిల్) సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఖమ్మం, వరంగల్ జిల్లా సరిహద్దులోని బయ్యారం ప్రాంతంలో 16 బ్లాకుల్లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ముడిఖనిజం అన్వేషణ చేపట్టింది. వీటితో పాటువరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో ఫాస్ఫేట్, ఎపటైట్, పొటాష్, పైరైట్, గ్లాకోనైట్ సంబంధిత ఖనిజాలపై కూడా అన్వేషణ సాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



**అగ్రస్థానంలో సిద్దిపేట జిల్లా..!**

జిల్లాల పునర్విభజనకు పూర్వం(2016 సెప్టెంబర్) నాటికి మైనింగ్ ఆదాయంలో నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో ఉండగా, పునర్విభజన తర్వాత సిద్దిపేట జిల్లా ఆదాయంలో టాప్‌లో ఉంది. 2018–19కు సంబంధించి సిద్దిపేట జిల్లాలో 230.65 కోట్ల ఆదాయం లభించింది. తర్వాతి స్థానాల్లో కరీంనగర్, సూర్యాపేట జిల్లాలు ఉన్నాయి.

**పర్యాటక కేంద్రాలుగా మైనింగ్ క్వారీలు**

ఖనిజాల వెలికితీత తర్వాత ఏర్పడుతున్న భారీ గుంతలను టూరిజం కేంద్రాలుగా మార్చాలనే ప్రతిపాదనను కూడా రాష్ట్ర భూగర్భ వనరుల శాఖ ప్రతిపాదిస్తోంది. చైనాలోని షాంఘై, రొమేనియా, పోలాండ్‌లోని పోర్ట్‌లాండ్ తరహాలో మైనింగ్ గుంతల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, అమ్యూజ్‌మెంట్ పార్కులు, బోటింగ్ వంటి వాటిని ఎకో టూరిజంలో భాగంగా ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. సినిమా షూటింగ్ స్పాట్లు, చేపల పెంపకం, సాగు, తాగునీటి వనరులుగా కూడా ఈ గుంతలను ఉపయోగించేలా తీర్చిదిద్దే ప్రణాళికలు ఉన్నట్లు మైనింగ్ అధికారులు చెప్తున్నారు.

### మైనింగ్ ఆదాయంలో పైపైకి..!

మైనింగ్ ఆదాయంలో దేశవ్యాప్తంగా 77 శాతం వృద్ధిరేటుతో ఒడిశా అగ్రస్థానంలో ఉండగా, 32 శాతంతో రాజస్తాన్ రెండు, 31 శాతంతో తెలంగాణ మూడోస్థానంలో ఉన్నాయి. ఖనిజాలు, మైనింగ్ రంగం ద్వారా రాష్ట్రానికి 2017–18లో రూ.4,848.85 కోట్ల ఆదాయం లభించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,060.03 కోట్లు లక్ష్యం విధించగా 31 శాతం వృద్ధిరేటుతో లక్ష్యానికి మించి రూ.788.82 కోట్ల అదనపు అదాయం వచ్చింది. 2004–05 నుంచి 2013–14 వరకు పదేళ్ల కాలంలో మైనింగ్ ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.12,048.43 కోట్ల ఆదాయం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మైనింగ్ పాలసీ 2014'విధానాలతో 2014–15 నుంచి 2017–18 మధ్య ఐదేళ్లకాలంలో మైనింగ్ ఆదాయం ఏకంగా రూ.16060.89 కోట్లకు చేరింది.

# టీఆర్ఎస్‌కు తోక పార్టీగా కాంగ్రెస్

- వారంతా ఏకమైనా బీజేపీ గెలుపును ఆడ్డుకోలేరు
- సెప్టెంబర్ 17ను నిర్వహించి తీరుతాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్
- కేసీఆర్ నియంతృత్వాన్ని సమష్టిగా ఎదుర్కోవాలి: వివేక్

**సాక్షి, హైదరాబాద్:** అన్ని రాష్ట్రాల్లో తోక పార్టీగా మారిపోతున్న కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో టీఆర్ఎస్‌కు తోక పార్టీగా మారిపోయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎంపీ జి.వివేక్ సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వివేక్‌తో కలిసి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బిడ్డల బలిదానాలతో ఏర్పడిన టీఆర్ఎస్ పార్టీ ఒక కుటుంబానికే పరిమితం అయిందన్నారు. టీఆర్ఎస్‌తో కలిసి కాంగ్రెస్ లాలూచీ రాజకీయాలు చేస్తోందన్నారు. ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించాల్సింది పోయి ప్రధాన అనుచర పార్టీగా మారిపోయిందన్నారు. కేటీఆర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇద్దరు కలిసి ఒకేలా మాట్లాడుతున్నారని, తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. 2023లో బీజేపీ గెలుపును ఉత్తమ్, కుంతియా, కేసీఆర్, కేటీఆర్ అంతా ఏకమైనా అడ్డుకోలేరన్నారు. తెలంగాణ విమోచన దినాన్ని విస్మరిస్తున్న టీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని బీజేపీ భావిస్తోందని, అమిత్ షా నేతృత్వంలో సెప్టెంబర్ 17ను నిర్వహించి తీరుతామన్నారు. బంగారు తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. తెలంగాణ రావడం బీజేపీకి ఇష్టం లేదని దుష్ప్రచారం చేస్తున్నారని, సుష్మాస్వరాజ్ పార్లమెంటులో ఏం మాట్లాడారో ఉత్తమ్‌కి తెలియదా? అని ప్రశ్నించారు. బీజేపీకి తెలంగాణ నుంచి ఒక్క ఎంపీ లేకున్నా బీజేపీ ఎంపీలు ప్రత్యేక తెలంగాణ బిల్లుకు మద్దతుగా ఓటు వేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీలే ప్రాంతాలుగా విడిపోయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కేటీఆర్ తెలంగాణ సెంటిమెంటుతో పబ్బం గడుపుకోవడం లేదా? రజాకార్ల వారసత్వంతో ఉన్న మతోన్మాద మజ్లిస్ పార్టీని భుజానికి ఎత్తుకోవడం లేదా అని ప్రశ్నించారు. అక్బరుద్దీన్ హిందూ దేవుళ్లపై, దేవతలపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే టీఆర్ఎస్ ఎందుకు నోరు మెదపలేదని, కనీసం కట్టడి చేయడం లేదన్నారు. దళితుణ్ణి ముఖ్యమంత్రి చేస్తానని మాట ఇచ్చి తప్పింది మీ తండ్రి కాదా అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. లౌకిక రాజ్యం అంటున్న మీరు వందేమాతరం పాడను.. అంటున్న ఒవైసీ సోదరులను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ ఎంపీ వివేక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లక్ష్మణ్. పక్కన దత్తాత్రేయ

**ప్రజాస్వామ్య తెలంగాణను మరచిన కేసీఆర్**

మాజీ ఎంపీ జి.వివేక్ మాట్లాడుతూ అందరం కలిసి తెలంగాణ కోసం పోరాడామన్నారు. కానీ ఇప్పుడు కేసీఆర్ ప్రజాస్వామ్య తెలంగాణను మరిచిపోయారన్నారు. కల్వకుంట్ల తెలంగాణ ఎలా చేసుకోవాలో ఆలోచిస్తున్నారన్నారు. ఉద్యమ సమయంలో ప్రజల గురించి మాట్లాడిన కేసీఆర్ గెలిచాక కొడుకు, కూతురు గురించి మాట్లాడడం మొదలు పెట్టారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన హరీశ్, కోదండరాం, జితేందర్‌రెడ్డిని అప్పట్లోనే పక్కనపెట్టాలని చూశారన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన వారిలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి కేసీఆర్ అని వివేక్ దుయ్యబట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను చెంప దెబ్బ కొట్టారని, కేసీఆర్ నియంతృత్వ పాలనను ఎదుర్కొనేందుకు అందరూ బీజేపీలోకి రావాలని కోరుతున్నానన్నారు.

# ఉత్తమ ఫలితాలకు సమగ్ర ప్రణాళిక

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలకు ప్రత్యేక టైంటేబుల్
- ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు, ప్రతి వారం రెండు పరీక్షలు
- పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలకు గురుకుల సొసైటీల కసరత్తు
- సెప్టెంబర్ రెండో వారం నుంచి కొత్త కార్యాచరణ అమల్లోకి..



**సాక్షి, హైదరాబాద్:** గురుకుల పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాల సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ అమలుకు గురుకుల సొసైటీలు నిర్ణయించాయి. ప్రస్తుతం కొనసాగుతున్న సమయపాలనకు అదనంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లనున్నాయి. 2018–19 వార్షిక సంవత్సరంలో గురుకుల పాఠశాలల్లో పదోతరగతి ఫలితాల్లో 94.5 శాతం సగటు ఉత్తీర్ణతను సాధించాయి. ఈసారి నూరు శాతం ఫలితాలు సాధించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. అలాగే ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ పాయింట్లు సాధించేలా చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాయి. నాలుగు గురుకుల సొసైటీలు ఉమ్మడిగా రూపొందించిన ఈ ప్రణాళికను వచ్చే నెల రెండో వారం నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేపట్టాయి.

**ప్రతిరోజు రెండు స్పెషల్ క్లాసులు**

గురుకుల సొసైటీలు రూపొందించిన ఉమ్మడి ప్రణాళికను ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న వారికే అమలు చేయనున్నారు. ఈ ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు రెండు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. దీంతో వారంలో ప్రతి సబ్జెక్టును రెండు సార్లు ప్రత్యేక తరగతుల్లో బోధిస్తారు. ఇందులో ఒక తరగతిలో రివిజన్, మరో తరగతిలో అభ్యాసన కార్యక్రమాలు ఉంటాయి. వారాంతంలో శని లేదా ఆదివారాల్లో స్లిప్‌టెస్టులు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుంటూ విద్యార్థి సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. సబ్జెక్టులో వెనుకబడినట్లు గుర్తిస్తే వారికి మరింత సాధన చేయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల రెండో వారం నుంచి ప్రత్యేక తరగతులు ప్రారంభమవుతాయి.

### సొసైటీ కార్యాలయాలకు పురోగతి నివేదికలు

నాలుగు గురుకుల సొసైటీలు ఉమ్మడిగా రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అమలు పర్యవేక్షణ సైతం రోజువారీగా నిర్వహించనున్నాయి. ఈమేరకు గురుకుల సొసైటీ కార్యాలయాల్లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. క్షేత్రస్థాయిలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసిన తర్వాత ఆ వివరాలను గురుకుల ప్రిన్సిపాళ్లు సంబంధిత సొసైటీ కార్యాలయాలకు పంపించాలి. అలా వచ్చిన వివరాలను సొసైటీలు అంచనా వేస్తాయి. దీంతో సొసైటీ పరిధిలోని పాఠశాలల పనితీరుపై స్పష్టత వస్తుంది. పరిస్థితులకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని సొసైటీ అధికారులు భావిస్తున్నారు.

# 'ఉపాధి' మాట... నిరీక్షణ బాట



'స్వయం'పథకాలకు నిధుల గండం

దరఖాస్తులిచ్చి ఏళ్లు గడుస్తున్నా దరి చేరని మంజూరు పత్రాలు

కార్పొరేషన్లు, ఫెడరేషన్ల వద్ద 10.29లక్షల దరఖాస్తులు పెండింగ్

బ్యాంకులు హామీ ఇచ్చినా కదలని దరఖాస్తులు

ఎదురు చూపుల్లో నిరుద్యోగులు

నిరుద్యోగ యువతకు ఉద్యోగానికి బదులు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో ఉపాధి కల్పనకు తలపెట్టిన స్వయం ఉపాధి పథకాలు నీరసించాయి. నిధుల విడుదలలో ప్రభుత్వం జాప్యం చేస్తుండటం... పథకాల వార్షిక కార్యాచరణను ఆమోదించడంలో తాత్సారం చేయడంతో నిరుద్యోగుల ఆశలు గల్లంతవుతున్నాయి. దరఖాస్తులు సమర్పించిన వారు ఆమేరకు యూనిట్ల ఏర్పాటుకు ఏళ్లుగా ఎదురు చూడాల్సి వస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్పొరేషన్లు, ఫెడరేషన్ల పరిధిలో దాదాపు 10.29లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడం గమనార్హం.

– సాక్షి, హైదరాబాద్

## గాడి తప్పిన ప్రక్రియ...

స్వయం ఉపాధి పథకాల దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హతను నిర్ధారించాల్సిన బాధ్యత ఆర్థిక సహకార సంస్థలపై ఉంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక అర్హులను గుర్తించి రాయితీ పంపిణీ చేయాలి. ఇది గాడితప్పింది. కార్పొరేషన్లు సమర్పించిన వార్షిక ప్రణాళికలకు ప్రభుత్వం ఆమోదించకపోవడంతో పరిశీలన సైతం ప్రారంభం కాలేదు. 2017–18లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు సమర్పిం చిన వార్షిక ప్రణాళికలకు ఆమోదం రాలేదు. ఆ తర్వాత 2018–19 వార్షికంలోనూ పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్ల క్రితం ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, బీసీ ఫెడరేషన్లు క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా 7.59లక్షల దరఖాస్తులు వచ్చాయి. గతేడాది ఎస్సీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్లు దరఖాస్తులు స్వీకరించగా మరో 2.69లక్షలు వచ్చాయి. ప్రస్తుతం కార్పొరేషన్ల వద్ద 10.29లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019–20 సంవత్సరంలో కనీసం దరఖాస్తులను సైతం పరిశీలించలేదు.

## బ్యాంకుల హామీలు వృథా...




తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన సుదీర్ఘకాలం తర్వాత కార్పొరేషన్లు రాయితీ రుణ దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టాయి. 2014–15 నుంచి 2016–17 వరకు బీసీ కార్పొరేషన్ దరఖాస్తుల స్వీకరణే చేపట్టలేదు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లకు పెద్దగా నిధులు రాకపోవడంతో వాటి రాయితీల పరిస్థితి అంతంత మాత్రంగానే సాగింది. 2017–18లో దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం ఉపక్రమించింది. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు బ్యాంకుల నుంచి హామీ (కన్సెంట్) పత్రాలు తీసుకున్నారు. వీటిని దరఖాస్తుతో పాటే అధికారులకు సమర్పించారు. కానీ వీటిపై కార్పొరేషన్లు స్పందించకపోవడంతో బ్యాంకులిచ్చిన హామీ పత్రాలు దండగయ్యాయి.

## రెండు సార్లు వెయ్యికోట్లు...

ఎంబీసీ కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఏటా వెయ్యి కోట్లు వంతున రెండుసార్లు కేటాయిస్తూ వచ్చింది. తొలి ఏడాది ఎంబీసీ కులాలపై స్పష్టత లేకపోవడంతో గందరగోళంలో పడ్డా... ఆ తర్వాతి ఏడాది వీటిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ పథకాల పంపిణీపై గందరగోళం వీడలేదు. నిధులు కేటాయించినప్పటికీ... లబ్ధిదారుల ఎంపికపై యంత్రాంగం శ్రద్ధ తీసుకోలేదు. దీంతో కేటాయించిన నిధులు ఏటా మురిగిపోతున్నాయి.

**కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు... 2017-18 వార్షిక సంవత్సరం**

| కార్పొరేషన్ | దరఖాస్తులు |
|---|---|
| ఎస్సీ | 85,495 |
| ఎస్టీ | 96,575 |
| ఎంబీసీ | 13,372 |
| బీసీ | 2,81,260 |

**ఫెడరేషన్లు**

| | |
|---|---|
| వాషర్‌మేన్ | 51129 |
| నాయిబ్రాహ్మణ | 33,961 |
| వడ్డెర | 23,833 |
| సగర(ఉప్పర) | 5,313 |
| కృష్ణబలిజ | 5,955 |
| వాల్మీకిబోయ | 14,419 |
| భట్రాజు | 878 |
| కుమ్మరి శాలివాహన | 22,130 |
| విశ్వబ్రాహ్మణ | 54,824 |
| మేదర | 5,164 |
| టాడీటాపర్ | 65,391 |

**2018-19 వార్షిక సంవత్సరంలో దరఖాస్తులు**

| కేటగిరీ | దరఖాస్తులు |
|---|---|
| ఎస్సీ కార్పొరేషన్ | 2,41,804 |
| మైనార్టీ కార్పొరేషన్ | 23,829 |
| క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ | 4,230 |

## క్లుప్తంగా...

### రానున్న మూడ్రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు

**వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం**

**సాక్షి, హైదరాబాద్:** రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఒకటి, రెండుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే చాలాచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈశాన్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు తెలిపింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, రానున్న 24 గంటల్లో ఇది మరింత తీవ్రంగా మారే అవకాశముందని వెల్లడించింది.

**వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం:** మెదక్ జిల్లాలో 4 సెం.మీ., రామాయంపేట్ 4 సెం.మీ., పాపన్న పేట్ 2 సెం.మీ., బజ ర్‌హత్నూర్ (ఆదిలాబాద్) 4 సెం.మీ., గాంధారి (కామారెడ్డి) 3 సెం.మీ., నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి 3 సెం.మీ., వేల్పూర 3 సెం.మీ., కోటగిరి 3 సెం.మీ., భీంగల్ 3 సెం.మీ., దార్‌పల్లి 3 సెం.మీ., వర్నీ 3 సెం.మీ., వేములవాడ (రాజన్న సిరిసిల్ల) 3 సెం.మీ., కరీంనగర్ 2 సెం.మీ., జగిత్యాలల్లో 2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

### ఐసెట్ వెబ్‌ఆప్షన్ల గడువు రేపటికి పొడిగింపు

**సాక్షి, హైదరాబాద్:** టీఎస్‌ఐసెట్–2019 సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల గడువును ఈ నెల 14 వరకు పొడిగిస్తున్నట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఈ వెరిఫికేషన్‌కు సంబంధించి సోమవారం వరకు 21,406 మంది ఫీజు చెల్లించి స్లాట్ బుక్ చేసుకున్నారని పేర్కొన్నారు. 19,328 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారని, 17,189 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 16న సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు.

### తెలుగు యువకులకు నేషనల్ యూత్ అవార్డులు

**సాక్షి, న్యూఢిల్లీ:** 2016–17 సంవత్సరానికిగాను ముగ్గురు తెలుగు యువకులకు నేషనల్ యూత్ అవార్డులు దక్కాయి. వివిధ రంగాల్లో అభివృద్ధి, సామాజిక సేవారంగంలో పనిచేసినందుకు కేంద్ర యువజన సర్వీసుల శాఖ ఇచ్చే ఈ అవార్డులను సోమవారం ఆ శాఖ మంత్రి కిరణ్ రిజిజు వ్యక్తుల కేటగిరీలో 20 మందికి అందజేశారు. మరో మూడు సంస్థలు కూడా ఈ అవార్డులు అందుకున్నాయి. తెలంగాణ నుంచి ఒద్దిరాజు వంశీకృష్ణ, ఏపీ నుంచి గట్టెం వెంకటేశ్, పృథ్వీ గొల్ల అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

### దక్షిణాదిన సుప్రీం బెంచ్ ఏర్పాటు చేయాలి

**సౌత్ ఇండియా అడ్వొకేట్స్ జేఏసీ**

**హైదరాబాద్:** దక్షిణాది రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని సౌత్ ఇండియా అడ్వొకేట్స్ జేఏసీ డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సౌత్ ఇండియా అడ్వొకేట్స్ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో జేఏసీ చైర్మన్ వినోద్‌కుమార్, కన్వీనర్ నాగేందర్‌లు మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో సుప్రీంకోర్టు బెంచ్ లేక వేలాది కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఢిల్లీతోపాటు కోల్‌కతా, చెన్నై, ముంబై, హైదరాబాద్‌లలో కూడా సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ విషయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, బార్ కౌన్సిల్, లా కౌన్సిల్ 2009లో తీర్మానాలు చేసినప్పటికీ తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# మున్సి'పోల్స్'పై తేలనున్న భవితవ్యం!

**'పిల్'పై నేడు హైకోర్టులో విచారణ**



**సాక్షి, హైదరాబాద్:** మునిసిపల్ ఎన్నికలపై నేడు స్పష్టత రానుంది. మంగళవారం హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం విచారణకు రానున్న నేపథ్యంలో పురపోరుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. వార్డుల డీలిమిటేషన్, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఉన్నత న్యాయస్థానంలో పిల్ దాఖలైంది. ఇవే అభ్యంతరాలతో పలు మున్సిపాలిటీల నేతలు కూడా పిటిషన్లు దాఖలు చేయడంతో న్యాయస్థానం ఎన్నికలను నిలిపివేస్తూ స్టేలు విధించింది. ఈ పరిణామాలు ప్రభుత్వ ముందరికాళ్లకు బంధం వేశాయి. ఇప్పటికే ఎన్నికలు పూర్తి చేయాలని సర్కార్ భావించినా, న్యాయపరమైన చిక్కులు ప్రతిబంధకంగా మారాయి. అయితే, ఇటీవల పిల్‌ను విచారించిన న్యాయస్థానం కేసును ఈనెల 13వ తేదీకి వాయిదా వేసింది. కోర్టు కేసులు ఉన్నవాటిని మినహాయించి, అభ్యంతరాల్లేని పురపాలికల ఎన్నికల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఎస్ఈసీ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. అదేసమయంలో వార్డుల విభజన, ఓటర్ల జాబితాల తయారీపై వెల్లువెత్తిన అభ్యంతరాలను పరిష్కరించామని, ఎన్నికలను నిలిపివేస్తూ విధించిన స్టేలను ఎత్తివేయాలని ప్రభుత్వం కూడా కౌంటర్ దాఖలు చేసింది. ఈ క్రమంలో మున్సిపాలిటీలకు సంబంధించిన కేసులన్నీ మంగళవారం ధర్మాసనం ముందుకు వచ్చే అవకాశం ఉండడంతో అందరిచూపు హైకోర్టు వైపు ఉంది. ఒకవేళ ఈ విచారణలో మున్సిపోల్స్‌పై స్పష్టత వస్తే.. సెప్టెంబర్ ద్వితీయార్ధంలోపు ఎన్నికల క్రతువు పూర్తయ్యే వీలుంది. ఒక వైపు న్యాయస్థానంలో కేసులు నడుస్తున్నా.. పురపాలక శాఖ మాత్రం ఎన్నికల కసరత్తును దాదాపుగా పూర్తి చేసింది. ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ పత్రాల ముద్రణ, రూట్ ఆఫీసర్ల నియామకం ప్రక్రియను కొలిక్కి తెచ్చింది. హైకోర్టు నిర్ణయం వెలువడగానే వార్డు/డివిజన్, చైర్‌పర్సన్/మేయర్ స్థానాల రిజర్వేషన్ల ఖరారును పూర్తి చేసి ఎస్ఈసీకి అందజేయాలని మున్సిపల్ శాఖ భావిస్తోంది. అదేసమయంలో ఈసీ కూడా సాధ్యమైనంత త్వరగా నగారా మోగించేందుకు సన్నాహాలు చేస్తోంది.

# పేదవిద్యార్థుల కలలు కల్లలే..!

**'ఎన్ఎంసీ' బిల్లును వ్యతిరేకించిన ప్రజాసంఘాల నేతలు**



సోమవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రజాసంఘాల నేతలు

**హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎన్ఎంసీ'బిల్లుతో వైద్యవిద్య అభ్యసించాలని ఆశించే పేద విద్యార్థుల కలలు కల్లలవుతాయనీ, దాన్ని వెంటనే రద్దు చేయాలని పలువురు ప్రజా సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు వలన వైద్య, విద్యారంగం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఈ బిల్లుపై దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య విద్యార్థులు, మెడికల్ కౌన్సిల్ వారు చేస్తున్న సమ్మెకు తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు వైద్యసంఘాలు, ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు నేతలు, తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 'ఎన్ఎంసీ'బిల్లు–వైద్యరంగంలో మార్పులు, వైద్య, విద్య ప్రైవేటీకరణ'అంశాలపై బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్యా..వైద్యం..రాజ్యాంగం కల్పించిన హక్కులనీ, వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏవిధమైన అధికారం లేదన్నారు. మన దేశంలో డాక్టర్ల సంఖ్య చాలా తక్కువగా ఉందని, దీనిని భర్తీ చేసే దిశగా కేంద్రప్రభుత్వం ఆలోచనలు చేపట్టాలే కానీ..ఇష్టానుసారమైన బిల్లుల ద్వారా ప్రైవేటు వైద్యానికి ఊపిరి పోయకూడదన్నారు. బిల్లులో గ్రామీణ ప్రజలకు వైద్యులను అందుబాటులోకి తీసుకొని వచ్చే అంశంపై స్పష్టత లేదన్నారు. పేద విద్యార్థులకు వైద్య, విద్యను దూరం చేయడానికే ఈ బిల్లును ప్రవేశ పెట్టారని ఆరోపించారు. 50 శాతం సీట్లు డొనేషన్‌లకు అమ్ముకొనే విధంగా ఉన్న అంశాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. తాము ఏం చేసినా అడిగేవారెవరనే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ వైద్యవిద్యను ప్రైవేటీకరించి అన్ని వర్గాల ప్రజల్ని బీజేపీ ప్రభుత్వం రోడ్డున పడేస్తోందని ఆరోపించారు. విద్యారంగంపై కేంద్ర ప్రభుత్వానికి ఏడు శాతమే నియంత్రించే అధికారం ఉందన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఎంసీఐ అనేది రెగ్యులేటరీ వ్యవస్థనీ, ఎన్ఎంసీని ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిందనీ ఇది స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం లేదన్నారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రప్రభుత్వాలకు ఉండే స్వయం ప్రతిపత్తి కోల్పోతాయన్నారు. తెలంగాణ ఇంటి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ ఈ బిల్లుపై వైద్య రంగం లో స్పష్టత లేదన్నారు. బిల్లు కేవలం ప్రైవేటు వ్యక్తులకు బలం చేకూరేలా ఉందే తప్పా పేద, బడుగు, బలహీన వర్గాల వారికి కాదన్నారు. ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. ప్రతాప్ మాట్లాడుతూ బిల్లులో లోపాలు ఉండటం వల్లనే దేశవ్యాప్తంగా ఇంతమంది వైద్యులు ఈరో జు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. జనసేన నాయకుడు జేడీ లక్ష్మీనారాయణ మాట్లా డుతూ మెరుగైన నిబంధనలను రూపొందించి వైద్యరంగానికి ఉపయోగపడేలా బిల్లు ఉండాలన్నారు.

# కిడ్నాప్ కేసులో 'కేసరి' చిక్కాడు!

- గజేంద్ర పరేఖ్ అపహరణకు సహకరించిన రౌడీషీటర్
- గతంలో మూడుసార్లు రెజ్లింగ్‌లో కేసరిగా నిలిచిన ఒమర్
- ఇతడితో పాటు మరో నిందితుడు సల్మాన్ సైతం కటకటాల్లోకి
- డబ్బు కాజేసేందుకు ప్రయత్నించి జైలుకు వెళ్లిన ఒమర్ తండ్రి



పట్టుబడిన సొమ్ముతో నిందితులు

**సాక్షి, హైదరాబాద్:** చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న మైనా ఫైనాన్స్ కంపెనీ యజమాని గజేంద్ర పరేఖ్ కిడ్నాప్ కేసులో మరో ఇద్దరు నిందితుల్ని మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గత నెల 28న చోటుచేసుకున్న ఈ నేరానికి సంబంధించి 30వ తేదీనే సూత్రధారి అల్మాస్ సహా ముగ్గురిని అరెస్టు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న మీర్‌చౌక్ రౌడీషీటర్ ఒమర్, అతడి స్నేహితుడు సల్మాన్‌లను సోమవారం పట్టుకుని రూ.48 లక్షలు రికవరీ చేశాడు. గజేంద్రను కిడ్నాప్ చేయడం ద్వారా వసూలు చేసిన డబ్బులో కొంత కాజేసేందుకు ప్రయత్నించిన ఒమర్ తండ్రిని కూడా పోలీసులు కటకటాల్లోకి పంపారు. దీంతో నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసులో నిందితుల సంఖ్య ఆరుకు చేరింది. హిమాయత్‌నగర్‌కు చెందిన గజేంద్ర పరేఖ్ దోమలగూడలో మైనా ఫైనాన్స్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. దీని ద్వారా వాహనాలపై ఫైనాన్స్ చేస్తూ ఉంటాడు. దీనికి సమీపంలోని మిశ్రీగంజ్‌కు చెందిన మహ్మద్ అల్మాస్ మోటో జోన్ మోటార్స్ పేరుతో సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలు–విక్రయం దందా నిర్వహిస్తున్నాడు. ఫైనాన్స్ వాయిదాలు చెల్లించని కారణంగా గజేంద్ర సీజ్ చేసిన అనేక వాహనాలను అల్మాస్ ఖరీదు చేశాడు. ఇలా వీరిద్దరికీ ఏర్పడిన పరిచయం నేపథ్యంలోనే గజేంద్ర ప్రతి నెలా రూ.కోట్లలో వ్యాపారం చేస్తాడని గుర్తించాడు. దీంతో అల్మాస్ డబ్బు కోసం గజేంద్రను కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ పని చేయడానికి తన స్నేహితులైన మహ్మద్ అక్బర్, మీర్ షరీఫ్ అలీలతో పాటు మీర్‌చౌక్ రౌడీషీటర్ మీర్జా అలీ ఒమర్ బేగ్, సయ్యద్ సల్మాన్‌లతో ముఠా కట్టాడు.

**మూడు సార్లు 'కేసరి' కైవసం..**

పాతబస్తీలోని మీర్‌చౌక్ ఠాణాలో రౌడీషీటర్‌గా ఉన్న ఒమర్ గతంలో రెజ్లర్‌గా రాణించాడు. ఈ నేపథ్యంలోనే 2016లో ఆంధ్రా కేసరి, 2017లో వాల్మీకి కేసరి, 2018లో తెలంగాణ కేసరి టైటిల్స్ గెలుచుకున్నాడు. ఇతడి పక్క ఇంట్లో ఉండే సల్మాన్‌కు అల్మాస్ స్నేహితుడు కావడంతో ఈ ముఠాలో చేరాడు. ఈ ఐదుగురూ కలిసి గత నెల 28న అల్మాస్‌కు చెందిన ఇండికా కారులో అక్బర్, ఒమర్, సల్మాన్‌లు గజేంద్ర వద్దకు వెళ్లారు. అదను చూసుకుని అతడిని బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. ఈ ప్రయత్నంలో ఒమర్ బలం ప్రయోగించడంతో గజేంద్ర ఎడమ చేయి విరిగింది. అక్బర్ కారు డ్రైవ్ చేస్తుండగా.. మిగిలిన ఇద్దరూ అతడి కారు వెనుక–ముందు సీట్లకు మధ్యన పడేసి ఒడిసిపట్టుకున్నారు. ఆ సమయంలో కాస్త దూరంలో మరో కారులో వేచి ఉన్న అల్మాస్, షరీఫ్‌లు జరుగుతున్నది గమనించారు. తాను నేరుగా కనిపిస్తే గజేంద్ర గుర్తిస్తాడని అల్మాస్ దూరంగా ఉన్నాడు. గజేంద్రను మిశ్రీగంజ్‌లో ఉన్న అల్మాస్ ఇంటి వద్దకు తీసుకువెళ్లి బంధించారు. ఆపై అతడిని తీవ్రంగా భయపెట్టి.. రూ.కోటి వసూలు చేసి విడిచిపెట్టారు. గజేంద్ర బయటకు వచ్చిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చిక్కడపల్లి ఠాణాలో కేసు నమోదైంది. దీంతో మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సాయిని శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్సై శ్రీనివాసులు, కేఎస్ రవి తదితరులతో కూడిన బృందం అల్మాస్, షరీఫ్, అక్బర్‌లను అరెస్టు చేసింది.

**ఒమర్ తండ్రికీ అరదండాలు..**

ఆ సమయంలో ఒమర్, సల్మాన్‌లు హైదరాబాద్ విడిచి పారిపోయారు. గజేంద్ర నుంచి వసూలు చేసిన సొమ్ము నుంచి వీరిద్దరూ తమ వాటాగా రూ.60 లక్షలు తీసుకున్నారు. దీన్ని ఒమర్ తన ఇంట్లో రహస్యంగా దాచాడు. దీని నుంచి తమ ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు తీసుకున్న ఇద్దరూ విమానంలో ముంబైకి ఉడాయించారు. అక్కడ కొన్ని రోజులు ఉండి గోవా వెళ్లి జల్సాలు చేశారు. వీరి కోసం టాస్క్‌ఫోర్స్ గాలిస్తుండగా.. ఒమర్ తండ్రి అజర్ అలీ తెరపైకి వచ్చాడు. తన కుమారుడు ఏదో తప్పు చేసినట్లు ఉన్నాడని, ఇంట్లో రూ.15 లక్షలు తీసుకువచ్చి దాచాడని చెప్పి ఆ మొత్తం పోలీసులకు అప్పగించాడు. తన కుమారుడి ఆచూకీ తెలియదంటూ.. మిగిలిన రూ.40 లక్షలు మరో చోట దాచేసి ఆ మొత్తం స్వాహా చేయడానికి ప్రయత్నించాడు. వివిధ ప్రాంతాల్లో తిరిగిన ఒమర్, సల్మాన్‌లు కిడ్నాప్ కేసు సర్దుమణిగిందని భావించారు. దీంతో సోమవారం సిటీకి చేరుకున్న ఇద్దరినీ మాటు వేసి ఉన్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వీరిని లోతుగా విచారించగా తాము కేవలం రూ.5 లక్షలే తీసుకువెళ్లామని, మిగిలింది ఒమర్ ఇంట్లోనే ఉందని చెప్పుకొచ్చారు. ఎన్నిసార్లు ప్రశ్నించినా ఇదే మాట చెబుతుండటంతో అజర్ అలీపై అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా.. ఇంట్లో ఉన్న రూ.40 లక్షల్ని తాను కాజేయాలని ప్రయత్నించి మరో చోటకు మార్చానని, కొంత ఖర్చు చేశానని అంగీకరించాడు. దీంతో అతడిని కూడా నిందితుల జాబితాలో చేర్చిన పోలీసులు ఒమర్, సల్మాన్‌లతో పాటు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.48 లక్షల నగదు స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల నిమిత్తం చిక్కడపల్లి పోలీసులకు అప్పగించారు.

# దోపిడీపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి

**జస్టిస్ చంద్రకుమార్**



**హైదరాబాద్:** భూస్వాములు చేస్తున్న దోపిడీపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని హై కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో తెలంగాణ రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్), తెలంగాణ వ్యవసాయ కార్మిక సమాఖ్య(ఏఐఏడబ్ల్యూఎఫ్)ల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ ఏర్పడ్డాక కూడా 4వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం భూస్వాములకే మేలు చేసిందని విమర్శించారు. రైతులకు గిట్టు ధర కల్పించకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పని కట్టుకొని కార్మిక చట్టాలను మారుస్తోందని విమర్శించారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వల్లపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి ఆచరణలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు పథకం వల్ల చిన్న రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. కౌలుదారుల హక్కుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ ఏఐఏడబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుప్పల వెంకన్న, ఎంసీపీయూ(యు) రాష్ట్ర కార్యదర్శి తాండ్ర కుమార్, మహిళా సంఘం కార్యదర్శి కుంభం సుకన్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్‌ను ఢీకొని యువకుడి మృతి

- హైదరాబాద్ గచ్చిబౌలిలో ఘటన
- మృతుడు పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల సోదరి మనవడు

**హైదరాబాద్:** అతివేగం ఓ యువకుడి ప్రాణాలు తీసింది. బైక్‌పై వేగంగా వస్తున్న యువకుడు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. వరంగల్ జిల్లా హన్మకొండకు చెందిన ద్రుపద్ (22) ఖాజాగూడలోని వెంకటేశ్వర పీజీ హాస్టల్‌లో ఉంటూ మాదాపూర్‌లోని ఐకాన్ డిజిటల్ ఇన్‌స్టిట్యూట్‌లో డిజిటల్ మార్కెటింగ్ కోర్సు చదువుతున్నాడు. సోమవారం తన స్నేహితుడు కృష్ణ చైతన్యను గౌలిదొడ్డిలోని హాస్టల్‌లో దింపి విప్రో సర్కిల్ వైపు వస్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ద్రుపద్.. అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడు మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య సోదరి మనవడు. దీంతో ఈ ఘటనపై పొన్నాల లక్ష్మయ్య గచ్చిబౌలి పోలీసులను ఆరా తీశారు.

సాక్షి

మంగళవారం, ఆగస్టు, 13

# బాణీ మారని కాంగ్రెస్

దాదాపు రెండున్నర నెలలపాటు సాగిన అంతర్గత మథనం తర్వాత చివరకు కాంగ్రెస్ పార్టీ గాంధీ–నెహ్రూ కుటుంబమే దిక్కని తీర్మానించింది. పార్టీ అధ్యక్ష పదవికి ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే వంటి దళిత నేతల పేర్లు, జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలెట్ వంటి యువ నేతల పేర్లు వినబడి, వారిలో ఎవరో ఒకరిని ఎన్నుకోవడానికి సంప్రదింపుల ప్రక్రియ ప్రారంభమైన కొన్ని గంటలకే అనూహ్యంగా సోనియాగాంధీకి పగ్గాలు అప్పగించాలని నిర్ణయించినట్టు పార్టీ ప్రకటించింది. అయితే ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనన్న వివరణ కూడా వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ 'తాత్కాలిక ఏర్పాటు' వ్యవధి ఎంతో ఎవరూ చెప్పలేరు. అధ్యక్ష పదవి నుంచి రాహుల్ తప్పుకున్నాక పార్టీ నిద్రాణస్థితికి చేరుకుంది. దేశం దశ, దిశ మార్చే కీలక పరిణామాలు అనేకం చోటుచేసుకుంటున్నా పార్టీ అయోమయావస్థలో ఉండిపోయింది. ఎవరికి తోచినట్టు వారు వ్యాఖ్యానాలు చేసి పార్టీ పరువు తీశారు. ఇంత మూల్యం చెల్లించాక కాంగ్రెస్ చివరకు 'నీవే తప్ప ఇతఃపరంబెరుగ... సంరక్షించు భద్రాత్మకా' అని సోనియానే శరణువేడింది. ఆమెకు విశ్రాంతినవ్వడం అవసరమని కేంద్ర మాజీ మంత్రి ఏకే ఆంటోనీ చేసిన ప్రకటన మినహా ఇతరులంతా ఆ కుటుంబం మనసు మార్చుకుని సారథ్యబాధ్యతలు స్వీకరించడాన్ని హర్షిస్తున్నారు.

మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో అధికారం మాట అటుంచి, కనీసం గౌరవప్రదమైన స్థాయిలో కాంగ్రెస్‌కు స్థానాలు లభిస్తాయని చాలామంది అంచనా వేశారు. అందుకు కారణం రాహుల్ గాంధీలో కనబడిన పరిణతే. 2014తో పోలిస్తే ఆయన చురుగ్గా పనిచేశారు. విపక్షంలో ఉండటం వల్ల ఆయనలో పోరాటశీలత పెరిగింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వగైరా అంశాల్లో ఆయన పార్లమెంటులోనూ, వెలుపలా చెప్పుకోదగ్గ రీతిలో పోరాడారు. పంజాబ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం రాహుల్ నాయకత్వంపై పార్టీ శ్రేణులకు భరోసా కలిగించింది. కానీ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ చతికిలబడిన తీరుతో వారు నిరాశలో కూరుకుపోయారు. గతంతో పోలిస్తే 8 స్థానాలు మాత్రమే అదనంగా రావడం, కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదాకైనా దిక్కులేకపోవడం నైతికంగా దెబ్బతీసింది. రాహుల్‌గాంధీయే అయోమయావస్థలో పడిపోయారు. ప్రధాని నరేంద్రమోదీపైనా, బీజేపీపైనా తాను ఒంటరి పోరు చేయాల్సి వచ్చిందని ఆయన, ఆయన సోదరి ప్రియాంక నేరుగానే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో నిష్ఠూరమాడారు. ఆ తర్వాతే పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతోపాటు తమ కుటుంబం నుంచి ఎవరూ పగ్గాలు చేపట్టే ప్రశ్నేలేదని తేల్చిచెప్పారు. నేతలంతా నచ్చజెప్పాలని చూసినా, పీసీసీలు, ఇతర అనుబంధ సంస్థలూ తీర్మానాలు చేసినా ఆయన చలించలేదు. గత్యంతరం లేక కొత్త అధ్యక్షుడిని అన్వేషించడం కోసం ముఖ్యనేతలతో కమిటీని ఏర్పాటు చేశారు. వారు రాష్ట్రాలవారీగా అభిప్రాయాలు తీసుకున్నారు. యువ నేతలైతే మంచిదన్న వారు కొందరైతే, రద్దయిన లోక్‌సభలో విపక్ష నేతగా వ్యవహరించిన మల్లికార్జున్ ఖర్గే సమర్థుడని మరికొందరు చెప్పారన్న కథనాలు వెలువడ్డాయి. సోనియా రాజకీయ వ్యవహారాల సలహాదారు అహ్మద్ పటేల్ ముకుల్ వాస్నిక్ లేదా ఖర్గే ఆ పదవి అధిష్ఠించాలని కోరుకుంటున్నారన్న వదంతులు గుప్పుమన్నాయి. చివరకు తిరిగి తిరిగి సోనియా వద్దకే ఆ పదవి వెళ్లింది.

పార్టీని పూర్తిగా తమ అదుపాజ్ఞల్లో ఉండేవిధంగా తీర్చిదిద్ది, దాని అభివృద్ధికి సూచనలు చేసిన వారినీ, సొంత చొరవతో పార్టీ పటిష్టతకు చిత్తశుద్ధిగా పనిచేసినవారిని అనుమాన దృక్కులతో చూసినచోట, అవమానించి వెళ్లగొట్టినచోట ఇంతకంటే మెరుగైన పరిణామాలను ఊహించలేం. విధేయతే ప్రధాన అర్హతగా భావించకుండా నేతలకు వేర్వేరు బాధ్యతలప్పగించి, లక్ష్యాలు నిర్దేశిస్తే ఎవరి సమర్థత ఎంతో తెలిసేది. పార్టీని, దాని ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అందరూ సమష్టిగా కృషి చేసేవారు. తమ తమ సత్తా చాటేవారు. కానీ ఇందుకు భిన్నంగా తమ చుట్టూ కోటరీని నిర్మించుకోవడంతోపాటు రాష్ట్రాల్లో దానికి అనుబంధంగా పనిచేసే బృందాలను ఏర్పాటు చేసుకున్నారు. కనీసం తమ నివాస ప్రాంతాల్లో ఓట్లు కూడా రాబట్టలేనివారు కూడా ఇందులో భాగస్తులయ్యారు. చాడీలు చెప్పి నాయకులుగా చలామణీ అయ్యారు. వారు చెప్పిందే వేదమైంది. వారితోనే పార్టీ విజయశిఖరాలు అధిరోహిస్తుందన్న భ్రమలో సోనియా, రాహుల్ కూరుకుపోయారు. వాస్తవానికి రాహుల్‌గాంధీ ఈ సంగతి గ్రహించకపోలేదు. పార్టీకి కొత్త నెత్తురు ఎక్కించాలని, యువతకు చోటీయాలని ఆయన మొదట్లో కొంత ప్రయత్నించారు. కానీ అందులో కాస్తయినా విజయం సాధించలేకపోయారు.


ఇక పార్టీలో 'నిజమైన' మార్పు ఖాయమనుకున్న నేతలకు చివరకు నిరాశే మిగిలింది. సోనియా కుటుంబసభ్యులు పోటీలో ఉండబోరన్న సంగతి తెలిశాక యువనేతలు కొందరు పార్టీ సారథ్యాన్ని అందుకోవడానికి తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టకపోలేదు. కానీ ఆ కుటుంబం నేరుగా తాము రంగంలో లేకపోయినా తమ చెప్పుచేతల్లో ఉండేవారిని అక్కడ ప్రతిష్ఠించదల్చుకున్నదని వారికి ఆలస్యంగా అర్థమైంది. కనుకనే కొత్త సారథి ఎంపిక ప్రక్రియ తూ తూ మంత్రంగా సాగింది. పార్టీలో అందరికీ ఆమోదయోగ్యులైనవారు, దాన్ని ఏకతాటిపై నడపగలిగిన వారు 'రెడీమేడ్'గా దొరకరు. బాధ్యతలు అప్పగించి వారిని సొంతంగా పనిచేయనిస్తే... నిర్ణయాత్మకంగా వ్యవహరించడానికి, కొత్త ఆలోచనలు చేయడానికి అవకాశం ఏర్పడితే అలాంటి నేతలు రూపొందుతారు. అప్పుడు సమాజంలోని భిన్నవర్గాలు పార్టీకి చేరువవుతాయి. కానీ కాంగ్రెస్‌లో అది ఇప్పట్లో సాధ్యం కాదని తాజా పరిణామం నిరూపించింది. కనీసం ఈ 'తాత్కాలిక' దశలోనైనా పార్టీలో పని సంస్కృతిని సోనియా పెంచగలుగుతారా, చిత్తశుద్ధితో పనిచేసేవారిని గుర్తించగలుగుతారా అన్నదాన్నిబట్టి కాంగ్రెస్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.త్రయోదశి ప.1.38 వరకు, తదుపరి చతుర్దశి నక్షత్రం ఉత్తరాషాఢ తె.5.38 వరకు (తెల్లవారితే బుధవారం) తదుపరి శ్రవణం, వర్జ్యం ప.12.43 నుంచి 2.23 వరకు, దుర్ముహూర్తం ఉ.8.15 నుంచి 9.06 వరకు, తదుపరి రా.10.55 నుంచి 11.40 వరకు, అమృతఘడియలు... రా.10.51 నుంచి 12.33 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

# విభజన పాపం ఆ రెండు పక్షాలదే



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

''కశ్మీర్, జమ్మూ ప్రజల అభీష్టమే శిలాశాసనంగా ఉండాలి. మీరు ఇండియాలో కలిసిపోవాలని నేను మహారాజా హరిసింగ్‌ను కోరబోను. కశ్మీర్ ప్రజల్ని 'మీరు పాకిస్తాన్‌లో చేరదలచారా, లేక ఇండియాలో చేరతారా అని మాత్రమే అడగాలి. విలీనీకరణ నిర్ణయం వారి ఇష్టం, పూర్తిగా వారి అభీష్టం. ఈ విషయంలో పాలకుడికి పాత్ర లేదు, అతడు నిమిత్తమాత్రుడే, కేవలం ప్రజలే సర్వ శక్తిమంతులు, వారి నిర్ణయమే అంతిమం. కశ్మీర్ విక్రయ దస్తావేజు ఫలితం''

*– మహాత్మాగాంధీ : దేశ స్వాతంత్య్ర ప్రకటనకు ముందు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కశ్మీర్ ప్రజల అభీష్టాన్ని తెలుసుకు రమ్మని గాంధీని కశ్మీర్ పర్యటనకు పంపినప్పుడు పర్యటనానంతరం ప్రకటన 1947.*

''సగటు కశ్మీర్ కుటుంబాలు ఉన్నంతలో తాము హుందాగా బతికేందుకే ప్రాధాన్యమిస్తాయి. ఉపాధి కోసం ఇతర బయటి రాష్ట్రాలకు వెళ్లడాన్ని, కూలిపని చేయడాన్ని కశ్మీరీలు నామోషీగా భావిస్తారు. సుగంధ ద్రవ్యాలు, యాపిల్ పండ్ల సాగు, కళాత్మకమైన పనులు, చేతి వృత్తుల విషయంలో కశ్మీరీలకు మంచి నైపుణ్యం ఉంది. సొంతంగా తాము నిలదొక్కుకోవాలన్న తపన కశ్మీరీలలో చాలా అధికం''

– ఇస్మాయిల్, 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి, జమ్మూ–కశ్మీర్ నుంచి (8.8.2019)

'నరజాతి చరిత్ర సమస్తం పరపీడనా పరాయణత్వం' అన్న మహాకవి వాక్కు అక్షరసత్యం. దుష్ట పాలకులవల్లే మానవ జాతికి ఈ దుస్థితిపట్టింది. మరోసారి తన ఉనికికే ప్రమాదం ఏర్పడిన సందర్భంగా, తనకు సంబంధం లేని పాత, కొత్త రకం పాలనా శక్తుల, విధానాల ఫలితంగా అమాంబాపతు సంధుల పర్యవసానంగా కశ్మీర్ తన ప్రత్యేకతనే కోల్పోయే స్థితిలో పడింది. కర్ణుడి చావుకి అనేక కారణాలున్నట్టుగా ఆది నుంచి అందాల కశ్మీర్ తన ఉనికిని కోల్పోవడానికి కారకులు ఒకరా, ఇద్దరా, ఎందరెందరో. భారత స్వాతంత్య్ర మహోదయ ముహూర్తంలో, కశ్మీర్ ఇంకా భారతదేశంలో విలీనం కాని దశ అది. కశ్మీర్ ఉత్థాన పతనాల చరిత్రను తలచుకుంటే, నిన్న మొన్నటిదాకా బీజేపీ పాలకులు దాని ప్రస్తుత ఉనికిని కాపాడుకుంటూ వచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని కాస్తా రద్దు చేయడంతో మరోసారి కశ్మీర్ ప్రజల్ని 'పెనం నుంచి పొయ్యిలోకి పడదోసినట్టయింది. కడుపు చించుకుంటే కాళ్లమీద పడినట్టుగా అసలు జమ్మూ–కశ్మీర్ ఏర్పాటే బ్రిటిష్ పాలకులు తమ సామ్రాజ్య ప్రయోజనాలు ఈడేరుకోవడానికి సృష్టించిన పన్నాగం. ఈ ఏర్పాటుకు తన విద్రోహం ద్వారా బ్రిటిష్ పాలకులకు సాయపడిన త్రాష్టులు కొందరు డోగ్రా రాజులు (శుద్ధ శ్రోత్రియులు) లాహోర్‌లోని సిక్కు దర్బార్ (లాహోర్ దర్బార్ అని ప్రసిద్ధి)ను మోసగించిన వారిలో ప్రసిద్ధుడు గులాబ్ సింగ్. ఎప్పుడైతే రంజిత్ సింగ్ 1839లో చనిపోయాడో అప్పటినుంచీ సిక్కు రాజ్యం బదాబదలవుతూ వచ్చింది. ఈ అదను చూసుకుని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులు పంజాబ్‌ను మింగేయాలనుకున్నారు. దీని పర్యవసానమే నాటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ సర్ హెన్రీ హార్డింజ్, సిక్కులపై యుద్ధం ప్రకటించడం. విద్రోహానికి మారుపేరైన గులాబ్ సింగ్ బ్రిటిష్ పాలకులతో లోపాయికారీగా సంధి సంప్రదింపులు నడిపాడు. ఫలి తంగా తొలి ఆంగ్లో–సిక్కు యుద్ధంలో (1845–46) సిక్కు రాజ్యం ఓడిపోయింది. సిక్కుల పతనం గులాబ్ సింగ్ విద్రోహ ఫలితం. దీని పర్యవసానంగా బ్రిటిష్ వాళ్లతో లాహోర్ సంధికి (1846 మార్చి 9) సిక్కులు దిగివచ్చారు. ఈ సంధి ఫలితం దేనికి దారి తీసింది? మొత్తం సట్లెజ్ భూభాగాలు, బియాస్ సట్లెజ్ ఉమ్మడి ప్రాంతాలు, వాజారా, యావత్తు కశ్మీర్ రాష్ట్రమూ బ్రిటిష్ సామ్రాజ్య ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ఈస్టిండియా కంపెనీకి బలవంతంగా ధారాదత్తం కావలసి వచ్చింది. ఇందుకు ముదరాగా విద్రోహి రాజా గులాబ్ సింగ్ 'స్వతంత్ర సార్వభౌమాధికారి'గా కంపెనీ గుర్తించి కొన్ని భూభాగాలను, జిల్లాలనూ అతనికి 'అత్తసొమ్ము అల్లుడి'కి మాదిరిగా ధారాదత్తం చేసింది. ఇది ప్రత్యేక ఒప్పందం ద్వారా కుదిరింది. కనుకనే మహాత్మాగాంధీ 1947లోనే 'అమృత్‌సర్ సంధి'ని విక్రయ దస్తావేజు (డీడ్ ఆఫ్ సేల్)గా నిరసించారు. ఇంతకూ రాజా గులాబ్ సింగ్ని కశ్మీర్‌ను బ్రిటిష్ వాళ్లకు కేవలం రూ. 75 లక్షలకు అమ్మేశాడు. కశ్మీర్ ప్రజల తీవ్ర నిరసనను బ్రిటిష్‌వాళ్లు ఘోరంగా అణచివేశారు. ఆ సమయంలో కూడా సిక్కు పూర్వ పాలకులు కశ్మీర్ గవర్నర్‌గా నియమించుకున్న షేక్ ఇమాముద్దీన్ కశ్మీర్ లోయను గులాబ్ సింగ్‌కు స్వాధీనం చేయడానికి నిరాకరిస్తే గులాబ్ సింగ్‌కి సాయంగా బ్రిటిష్ సైన్యం వెళ్లి సింహాసనం మీద కూర్చోబెట్టింది. అందుకే ఆ తర్వాత భారత స్వాతంత్య్ర ప్రకటనకు ముందు బ్రిటిష్ పాలకులు దేశ విభజన సందర్భంగా రాడ్‌క్లిఫ్ అవార్డును ప్రకటించి, వివాదానికి తెరలేపకుండా ఉన్నట్టయితే భూమార్గంలో కశ్మీర్ చేరుకోవడానికి వీలుండేది కాదని సుప్రసిద్ధ భారత చరిత్రకారుడు, న్యాయవాది కశ్మీర్ వివాదంపై సాధికార గ్రంథాలు రచించిన ఎ.జి. నూరానీ ('కశ్మీర్ డిస్ప్యూట్' 1947–

### రెండో మాట

2012) రాశారు.

నిజానికి భారతదేశ (ఉపఖండం) విభజనకు గాంధీజీ పచ్చి వ్యతిరేకం. బహుశా అందుకే ఆయనను హత్యచేసి ఉంటారు, తిరిగి వారే నేడు గాంధీ జయంతులు జరుపుతూ, విగ్రహావిష్కరణలు చేస్తున్నారు. గాంధీజీ హత్యా పాపానికి ఉపశమనంగా బహుశా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ (నాటి జనసంఘ్ నేత, ఇప్పటి బీజేపీ నేతలకు ఇష్టుడు) పండిట్ నెహ్రూ మంత్రి వర్గ సభ్యుడిగా ఉండి, 'కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని నికరం చేసిన మంత్రివర్గ తీర్మానానికి మద్దతు పలికి ఉంటారు. కానీ అదే శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ మద్దతు తెలిపిన కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి చెందిన 370వ రాజ్యాంగ నిర్ణయ సభ ఆర్టికల్‌ను బీజేపీ పాలకులు ఎందుకు రద్దు చేయవలసి వచ్చిందో చెప్పరు.

370వ ఆర్టికల్‌ను రద్దుపర్చడం ద్వారా కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశామన్న అల్ప సంతోషం పాలకులకు మిగలవచ్చు గానీ కశ్మీర్ ప్రజలను, వారి ప్రజా ప్రతినిధులను సంప్రదించకుండా నిరంకుశ ధోరణిలో ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడాన్ని వారం రోజుల తర్వాత కూడా కశ్మీరీలు సమ్మతించగల స్థితిలో లేరని చక్కబడని పరిస్థితులు తెల్పుతున్నాయి. కానీ కశ్మీర్ పరిస్థితులకు, భారతదేశ విభజనకు కాంగ్రెస్–జన్‌సంఘ్ ఉభయపక్షాలే కారణమంటే అతిశయోక్తి కాదు. కశ్మీర్ విషయంలో రాజ్యాంగ నిర్ణయసభ, 370 ఆర్టికల్ ద్వారా ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తూ చేసిన నిర్ణయానికి, దేశీయ స్వతంత్ర సంస్థానాలను రద్దు చేస్తూ 16 సంస్థానాలతో కుదుర్చుకున్న విలీనీకరణ ఒప్పందాలకు ఉన్న తేడాను విస్మరించడం సమర్థనీయం కాదు. ఎందుకంటే, ముస్లిం మెజారిటీ ప్రజలున్న కశ్మీర్‌కు పాలకుడైన హిందూ మహారాజా హరి సింగ్ ఇండియాలో కశ్మీర్ విలీనీకరణ పత్రంపై సంతకం చేయకుండా, ఆయన తరఫున మరొకరు సంతకం చేశారన్న తీవ్ర అభియోగాలున్నాయి. ఇందుకు సాక్ష్యంగా చరిత్ర పరిశోధకులు ప్రొఫెసర్ లాంబ్, ఆండ్రూ వైట్‌హెడ్, విక్టోరియా స్కోఫీల్డ్‌ల పరిశోధనలున్నాయి. అంతేగాదు, కొన్ని యథాతథ ఒడంబడికల (స్టాండ్ స్టిల్ అగ్రిమెంట్స్)పైన, విలీనీకరణ పత్రాలపైన సంతకాలు చేసినవారు సంస్థానాధీశులు కారని, వారి తరఫున వారికి లోబడి పనిచేసే వ్యక్తులనీ, ఒకచోట ఆంతరంగిక కార్యదర్శి, ఇంకోచోట ప్రధాన కార్యదర్శి లేదా తాత్కాలిక ప్రధానమంత్రి అనీ పరిశోధకుల భావన. జమ్మూ కశ్మీర్ విలీనీకరణ పత్రాలలో కొన్నింటిపైన దిద్దులు, తుడిచి ఉన్నట్టు కూడా కొందరు పరిశోధకుల అభిప్రాయం.

అలాగే జమ్మూలో ప్రవేశించిన డోగ్రాలు బడా భూస్వాములు. వీరు బ్రిటిష్ పాలకుల కనుసన్నల్లో మెసులుతూ తూర్పు ఇండియా కంపెనీకి గులాములుగా మారారు. వీరు ఎంతవరకు పోకారంటే జమ్మూలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నెలకొల్పిన 'ప్రజా పరిషత్' (ఆరెస్సెస్ శాఖ)కు ప్రేమ్‌నాథ్ డోగ్రా అధ్యక్షుడయ్యారు, ఆరెస్సెస్ జమ్మూ యూనిట్ మాజీ అధ్యక్షుడుగా పనిచేశారు. కశ్మీర్ ఇటు ఇండియాలో గానీ, అటు పాకిస్తాన్‌లోగానీ విలీనం కాకుండా స్వతంత్ర కశ్మీర్‌గా ప్రత్యేక ప్రతిపత్తితోనే కొనసాగుతుందని షేక్ అబ్దుల్లా ప్రకటించడం కాంగ్రెస్–జన్‌సంఘ్‌లకు కన్నెర్రయింది. కారణం? అబ్దుల్లా కశ్మీర్ అధినేతగా భూములపై కొద్దిమంది గుత్తాధిపత్యాన్ని రద్దుచేసే 'ఎస్టేట్స్ రద్దు చట్టాన్ని' 1951లో ప్రవేశపెట్టడంతో డోగ్రాల ఆర్థిక గుత్తాధిపత్యానికి గండిపడింది, అదీ నష్టపరిహారం చెల్లించనవసరం లేదని చట్టం నిర్దేశించడంవల్ల.

ఇండియన్ యూనియన్‌లో భాగంగానే జమ్మూ–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తికి చట్టరీత్యా బలమైన పునాది వేయడానికి కశ్మీర్ అధినేత అబ్దుల్లా కశ్మీర్ రాజ్యాంగాన్ని రూపొందించడానికి సిద్ధం కావటంతోనే కాంగ్రెస్–జన్‌సంఘ్ వర్గాలు అప్రమత్తమై ప్రతివ్యూహాలు పన్నాయి. తాను సమ్మతించిన అబ్దుల్లానే నెహ్రూ పదకొండేళ్లు జైలుపాలు చేయగా, బీజేపీ నాయకులు ఇప్పుడు రాజ్యాంగ నిర్ణయ సభ కశ్మీర్‌కు ప్రకటించిన ప్రత్యేక ప్రతిపత్తినే రద్దు చేయడానికి సాహసించి, సరికొత్త అశాంతికి తెరలేపారు. రూ. 75 లక్షల విక్రయ (అమ్మకపు) దస్తావేజుపై రాజా గులాబ్ సింగ్ సంతకంతో ప్రారంభమైన కశ్మీర్ ఇప్పటికీ కన్నీళ్లోడుతున్న సందర్భంగా ఆనాటి ప్రసిద్ధ ఉర్దూ కవి హఫీజ్ జలంధారి ఆవేదనలోంచి జాలువారిన విషాద గీతికను ('పచాత్తర్ లాక్ కా సౌదాం') ఒక్కసారి గుర్తుచేసుకుందాం:

*''దేశం మాది కానీ 75 లక్షలకు అమ్ముకున్నాం. అవును, ఇతర్లు కొల్లగొట్టిన మా సంపదకు లక్షలు చెల్లించింది. 75 లక్షలు. ఆ మా సంపద–గొడ్డు గోదా, మనుషులే కావొచ్చు.. కొడుకులు, కూతుళ్లు, వారి వంశపారంపర్యమే కావొచ్చు/*

*మా స్వేచ్ఛను, ఆస్తిపాస్తుల్ని దోచుకున్నవారు ఎన్నడూ స్వేచ్ఛగా ఉండలేరు/*

*ఎందుకో తెలుసా– కేవలం 75 లక్షలకే మానవుల భవితవ్యాన్ని స్వర్గతుల్యమైన మా కశ్మీర్‌ను 75 లక్షలకే ధారాదత్తం చేశారు/*

*శీలవంతమైన మా మానవతలను 75 లక్షలకే కుదువబెట్టేశారు/ ఒక్కమాటలో– మా దేశాన్ని, మా జాతిని, మా కశ్మీరీల సర్వస్వాన్నీ/ 75 లక్షలకే అమ్మేశారు. ఇంగ్లిష్‌వాడి కశ్మీరీ గులాములు''.*

ఈ శాపనార్థాలు రేపు మనల్ని చుట్టబెట్టకుండా ఉండాలంటే దేశ పాలకులు 'మంచి బాలుర'న్న కనీస కితాబు దేశ ప్రజాబాహుళ్యం నుంచి పొందగలగాలి.

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### పండుగ



"భజన జర్నలిస్టులంతా బుల్లెట్ ప్రూఫ్ ప్రభుత్వ స్కార్పియో వాహనాల్లో, సైనిక హెలీకాప్టర్లలో తిరు గుతూ, ప్రభుత్వ ఇంటర్నెట్ వాడు కుంటూ కశ్మీర్‌లో అంతా ప్రశాంతంగా ఉందని చెబుతున్నారు. ప్రభుత్వ దృష్టిలో కశ్మీర్‌లో జరిగేదంతా సాధారణమే. మోసం, అబద్ధాలు, పౌరుల గొంతు నొక్కేసి ప్రశాంతంగా ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్య ప్రమాణాల ప్రకారం అది ప్రశాంతత కాదు. ఉదయాన్నే మా అమ్మను పలకరించలేనప్పుడు ఇది ఈద్ పండుగ ఎట్లా అవుతుంది?"

– షెహ్లా రషీద్, కార్యకర్త , జేఅండ్‌కే పీపుల్స్ మూవ్‌మెంట్

### స్వేచ్ఛ



"కశ్మీర్‌లో 370వ అధికరణాన్ని ఎత్తివేయడాన్ని నిరసిస్తూ యూపీలో జరుగుతున్న శాంతియుత ప్రదర్శనలో పాల్గొనడానికి యత్నించిన మెగసెసె అవార్డు గ్రహీత సందీప్ పాండేను గృహనిర్బంధంలో ఉంచారు. అంటే, ఈ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలపడానికి కూడా అనుమతించరా? ప్రశ్నించే హక్కునే కాదు, నిరసన హక్కును కూడా కాలరాస్తున్నారు"

– అపర్ణా సేన్, ఫిల్మ్ మేకర్

### మాన్-వైల్డ్



"నీ కాలర్‌పై ఆ లిప్‌స్టిక్ మరక ఏంటి? నీకు ఎవరితోనైనా సంబంధాలు ఉన్నాయా అని నా భార్య అడిగింది. మాన్ వెర్సస్ వైల్డ్ చూశాకా ఆమెతో చెప్పా–నా బాల్యంలో చాలా పేదరికం అనుభవించే వాళ్లం. కాలర్‌పైనున్న లిప్‌స్టిక్ మరకలు తొలగించుకోవడానికి హిమాలయ పర్వత సానువుల వరకూ వెళ్లి ఉతుక్కునే వాళ్లం అని సమాధానమిచ్చా. వెంటనే మా ఆవిడ కన్నీటి పర్యంతమవుతూ నన్ను కౌగిలించుకుంది"

– అతుల్ ఖత్రి, కమెడియన్

### భవిష్యత్



"మీ భవిష్యత్ గురించి ఎటువంటి ఆందోళన వద్దు. మేమంతా మీరు సులువుగా ఈ వరదల నుంచి బయటపడటం కోసమే పని చేస్తున్నాం. వైనాడ్‌లో మళ్లీ మనమంతా కలిసి పనిచేద్దాం. ఈ విషాదం ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించినది కాదు"

– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత

### మూడు తప్పులు



"ఎవరినీ తప్పుపట్టలేం. కానీ, కశ్మీరీలు మూడు తప్పులు చేశారు. వాళ్ల ఉద్యమాన్ని పాకిస్తాన్ సొంతం చేసుకోవడానికి అనుమతించడం మొదటిది. దాంతో చాలామంది భారతీయుల్లో వారి డిమాండ్లు అసమంజసమైనవిగా ముద్రపడ్డాయి. వాళ్ల విశ్వాసాన్ని కూడా కోల్పోయారు. కశ్మీరీ పండిట్లను తరిమివేయడమేగాక, వాళ్లు తిరిగి రాకుండా అడ్డుకోవడం రెండో తప్పు. వారిని తరిమివేయడం పొరపాటని సర్ది చెప్పుకోవచ్చు. కానీ, తిరిగి రాకుండా అడ్డుకోవడం ఉద్దేశపూర్వకంగా తీసుకున్న నిర్ణయం. దీంతో లౌకికవాద భావనకు కశ్మీరీలు దూరమయ్యారు. వాళ్ల ఉద్యమాన్ని ఇస్లామీకరించడం మూడో తప్పు. తోయిబా, ఐసిస్ రూపంలో పాక్ ప్రవేశించడాన్ని గ్రహించలేకపోయారు"

– సోనాలీ రనడే, జర్నలిస్ట్

# కశ్మీర్ సుస్థిరత బాటలో తొలి అడుగు

అభిప్రాయం



కె. వెంకట కృష్ణారావు

ఆర్టికల్ 370వ అధికరణాన్ని రద్దు చేసి కశ్మీర్‌కి ఉన్న ప్రత్యేక అధికారాలను ప్రభుత్వం తొలగించింది, స్వాతంత్య్రం సిద్ధించిన కాలం నుంచి దేశం ఎదుర్కొంటున్న కశ్మీర్ సమస్య తొలిగిపోయింది అనుకోవడానికి లేదు. కానీ ఇదొక ముందడుగు అని చెప్పుకోవచ్చు. 370వ అధికరణని తొలగించడం ద్వారా కశ్మీర్ సమస్య అంతర్గత విషయమే నని భారత్ ప్రపంచానికి చెప్పకనే చెప్పింది. 370వ అధికరణ తొలగించిన వెంటనే దానికి కారణాల గురించి పి–5 దేశాలకి చెప్పిన భారత్ తనకు వ్యతిరేకంగా ఆ దేశాల నుంచి ఒక మాట కూడా రాకుండా జాగ్రత్తపడింది. ఇక నుంచి రెండు పౌరసత్వాలు, రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు పోయి ఒకటే పౌరసత్వం, ఒకటే జెండా, ఒకటే రాజ్యాంగం ఉంటాయి.

జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2019 ప్రకారం ఇక నుంచి జమ్మూ కశ్మీర్ ప్రాంతం విధాన సభతో కూడిన కేంద్ర పాలితప్రాంతంగా, లడఖ్ ప్రాంతం కేవలం కేంద్రపాలిత ప్రాంతంగా ఉండబోతుంది. ఇకపోతే జమ్మూ కశ్మీర్‌లో కొత్తగా ఏర్పడపోయే ప్రభుత్వానికి ఇంతకు ముందున్న అధికారాలు కాదు కదా.. మిగతా రాష్ట్రాలకు ఉండే అధికారాలు కూడా ఉండవు. ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉంటాయి. కొత్తగా ఏర్పడే ప్రభుత్వానికి, లెఫ్టినెంట్ గవర్నర్‌కి ఏదయినా సమస్య తలెత్తితే లెఫ్టినెంట్ గవర్నర్‌దే ఆఖరి నిర్ణయం, దీనివలన కశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వం పాత్ర పెరిగిపోతుంది, ఇది మంచి పరిణామమే, కేంద్ర ప్రభుత్వం ద్వారా భారతీయులు కశ్మీరీల మనసులు గెలవడానికి ఆస్కారం ఏర్పడింది. ఇంతకు ముందున్న రాష్ట్ర ప్రభుత్వాలు కశ్మీర్ యువత, స్థానికులు పాకిస్తాన్ నుండి వచ్చే ఉగ్రవాదులకు సహాయం చేస్తున్నారు అని తెలిసినా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చూసీ చూడనట్టు వది లేసారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం –2005, చదువుకునే హక్కు చట్టం–2009 లాంటి మంచి చట్టాలు ఇప్పటి వరకు జమ్ముకశ్మీర్ రాష్ట్రంలో అమలులో లేవు, ఇక నుండి ఆ చట్టాలు అమలులోకి రావడం వలన ప్రతి ఒక్కరూ చదువుకొని మంచి మార్గాన్ని ఎన్నికకు అవకాశమేర్పడుతుంది.

కశ్మీరులో 370వ అధికరణ వలన బాగుపడింది రాజకీయనాయకులు, వేర్పాటువాదులు తప్ప సగటు సామాన్యులు అభివృద్ధికి, బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్నారు, కశ్మీర్ ప్రాంతానికి చెప్పుకోదగ్గ పెట్టుబడులు గత 70 ఏళ్లలో ఒకటి కూడా రాలేదు. 370వ అధికరణ రద్దు వలన ఇక నుండి భారతీయులు ఎవరైనా కశ్మీర్‌కి వెళ్లి అక్కడ వ్యాపారం, స్థలం కొనుక్కోవడం, అక్కడే స్థిరపడి పోవడం లాంటివి చేయవచ్చు. ఇకనుంచి వ్యాపార సంస్థలు అక్కడకి వెళ్లి స్థలాలుకొని కంపెనీ పెట్టుబడులు పెట్టడం వలన స్థలాల ధరలు పెరిగి రైతులకి ఆస్తులు పెరుగుతాయి. పైగా ఆ కంపెనీలో ఉద్యోగాలు రావడం వలన నిరుద్యోగం తగ్గుతుంది.

కశ్మీరీ మహిళలు వేరే రాష్ట్ర అబ్బాయిని పెళ్లి చేసుకుంటే అక్కడ పౌరసత్వంతో పాటు, అక్కడ ఉన్న ఆస్తులను వదులుకోవడం లాంటి వివక్షను ఎప్పటి నుండో ఎదుర్కొంటున్నారు, దానితోపాటుగా 50 ఏళ్ల క్రితం నుంచి జమ్మూ కశ్మీర్‌లో స్థిరపడిన లక్షల మంది ఇన్నాళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు, ప్రభుత్వ ఉద్యోగాలకి అర్హత లేకపోవడం లాంటి వివక్షతని ఎదుర్కొన్నారు. ఈ అధికరణం రద్దుతో వారికి ఇప్పటి నుంచి న్యాయం జరగడానికి ఆస్కారం ఏర్పడింది.

కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వం ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాలి, ఎప్పటి నుంచో ఉన్న స్థానికులు ఇక నుంచి కొత్తగా వచ్చి స్థిరపడే వారితో సఖ్యత పెంచుకోవడం, ప్రభుత్వ ఉద్యోగాలలో కొత్తవారితో పోటీపడటం, ప్రభుత్వ పథకాలు కొత్తగా స్థిరపడే వారికి కూడా పంచడం లాంటి విషయాలలో ఎప్పటి నుంచో ఉన్న స్థానికులకి కొంత ఇబ్బందులు ఏర్పడవచ్చు. దానిని పోగొట్టాల్సిన బాధ్యత కొత్తగా ఏర్పడే ప్రభుత్వం మీద ఉంటుంది.

కశ్మీర్‌లో పేదరికం, నిరుద్యోగం, ఉగ్రవాదం పోయి సగటు మనిషి అక్షరాస్యత పెరగడం, ఆరోగ్యం, జీవన విధానంలో ప్రమాణతలు పెరిగి భారతీయులతో పాటుగా అధునాతన ప్రపంచంతో పోటీపడిన రోజున కశ్మీర్ సమస్య తీరిపోతుంది.

వ్యాసకర్త రీసెర్చ్ స్కాలర్, ఐఐటీ, వారణాసి
మొబైల్ : 97053 69773

# మానవాన్వేషి.. పాఠక కవి

**''అంతర్మథనంలో స్పందించిన నాలుగు రచనల్నీ,**
**గాలిపటాల్లా ఎగరేసి,**
**కాలాన్నీ మామతాన్నీ తట్టుకొని**
**ఎన్ని నిలుస్తవో అన్నదే గమనించాలి**
**ప్రతి పదాన్నీ పాదాన్నీ కాలం వస్త్రకాయితం పడుతుంది''**

**– సి.వి.కృష్ణారావు 'కల్పన' లోంచి.**

మృత్యువంచులోని కొస వెలుతురుని కూడా జీవశ్వాసగా బంధించి అక్షరాల్లోకి వంపుకున్న కవి ఆయన. సత్యనిష్ఠ కలిగిన కవి. ఆయన రాసిన ప్రతి వాక్యమూ ఆచరణలోంచి, స్వీయానుభవం లోనుంచి పలికిన జీవ కవిత్వం. సాధారణంగా అగుపడే ఆయన కవిత్వమంతా అసాధారణ అనుభవాల చిక్కదనాన్ని ప్రసారం చేసింది. తన వ్యక్తిత్వానికీ, కవిత్వానికీ మధ్య సరిహద్దు రేఖను ఆయన ఎప్పుడో చెరిపివేసుకొని జీవించాడు. 'వైతరణి', 'మాది మీ వూరే మహరాజ కుమారా', 'అవిశ్రాంతం', 'కిల్లారి' కవిత్వ సంకలనాలలో తను ఆకాంక్షించిన మానవీయ అస్తిత్వ అన్వేషణ, ఆచరణ దృష్టే పాఠకుల అంతరంగాలను ఆర్ద్రపరుస్తుంది. స్వభావరీత్యా.. శాంత స్వభావి. సమాజంలోని అన్ని రకాల సామాజిక, సాంఘిక అసమానతల పట్ల తీవ్రమైన ఆగ్రహం ఉంటుంది ఆయన కవిత్వంలో. అయితే, ఆయన ఉగ్రత్వం.. శాంతత్వంలోకి మారువేషం వేసుకొని వచ్చి మనల్ని అస్థిరపరుస్తుంది. ఇదే కృష్ణారావుగారి కవిత్వంలోని ప్రత్యేకత.

కృష్ణారావుగారు 1926లో నల్లగొండ జిల్లా రేవూరు గ్రామంలో జన్మించిన తెలంగాణ తొలి తరం కవుల్లోని విశిష్ట కవి. లోకంలోని అనేకానేక ప్రశ్నలకు కృష్ణారావుగారి వంటి వారి దగ్గర ఒకటో రెండో సమాధానాలు మాత్రమే ఉంటాయి. అవి అనేక ప్రశ్నలను బ్యాలెన్స్ చెయ్యగలిగినవే అయి ఉంటాయి. రాబోయే తరాల ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పగలిగిన బతుకు సత్తా కలిగినవే అయి ఉంటాయి. జీవితం తాలూకు దెబ్బల్ని తట్టుకొని, దెబ్బదెబ్బకూ బలాన్ని పుంజుకొని బతికిన కవి యోధుడు తను. ఆయనను అందరూ వెన్నెల కృష్ణారావుగా రంటారు. నేను కవిగా 1990లో నా దారిని వెతుక్కుంటూ 'నెలనెలా వెన్నెల'లోకి ప్రవేశించాను. ఇందులో సభ్యత్వమూ సభ్యత్వ రుసుములూ ఉండవు. కవులకూ, పాఠకులకూ ఎజెండాల ఆంక్షలుం డవు. అక్కడ ఏ జెండాల రంగులు పొంగులు ఉండవు. ఏ కవికయినా వారి వారి స్వీయ మానసిక ఎజెండాల రాజకీయాల దృష్టి ఉండొచ్చు. అది తమ కవిత్వాన్ని సాంద్రపరిచి, సునిశితం చేయ గలిగితే చాలు. అక్కడి పాఠకమ్మన్యులు మనసారా అక్కున చేర్చుకుంటారు. అదీ నెలనెలా వెన్నెల ప్రత్యేకత. అటువంటి వేదికకు నిర్వాహకుడు, సేవకుడూ కృష్ణారావుగారు.



నివాళి

90వ దశకంలో అస్తిత్వ ఉద్యమాలు ఊపుగా తెరమీదికి వస్తున్నాయి. అంతే బలంగా మరొకవైపు, తెలుగు సాహిత్యంలో ముఠాల, మఠాల మాఫియా బెదిరింపులు ఎక్కువవుతున్నాయి. కొత్తగా కవిత్వం రాస్తూ బలపడుతున్న కవులను రాజకీయ, అరాజకీయ, స్వరాజకీయ ఎత్తుగడలతో భయపెట్టేవాళ్లు. కొత్త కవుల్ని.. హైదరాబాద్‌లో 'రాంపురి చాకుల (సిద్ధాంతాల పేరుతో) వంటి విన్యాసాలతో పొడిచి చంపుతూన్న సందర్భం. సరిగ్గా అటువంటి అయోమయంలో నెలనెలా వెన్నెలతో చల్లగా సాయంకాలాల ఇరానీ హోటళ్ల సగం కప్పు జిందగీతనంతో నెనరుగల నాయ నగా, సహృదయుడిగా కొత్త కవుల వేదికతో తెర మీదికి వచ్చారు కృష్ణారావుగారు. అప్పుడు 'నెలనెలా వెన్నెల'ది ఉత్తమమైన dietary contribution అని కూడా నాకు తెలిసి వచ్చింది. దళిత, స్త్రీవాద, బహుజన, మైనార్టీ ప్రాంతీయ అస్తిత్వాలు వేళ్లూనుకొని విస్తరించడానికి నెలనెలా వెన్నెలలోని ప్రజాస్వామ్యం ఎంతో దోహదపడింది. ఆయా కవుల తొలి సంకలనాల ఆరంగేట్ర స్థలమయ్యింది. సభల్లో ఛాయ, బిస్కెట్ 'తెహజీబ్'ని సాంప్రదాయంగా ముందుకు తెచ్చారు. పైసల ప్రస్తావనే ఉండేది కాదు. ఆయన డిమాండ్ అంతా కవులను కొత్త కవితలు పట్టుకుని రమ్మనడమే. తను కొత్త కవిత రాయగానే వెంటనే పట్టుకు వచ్చి వినిపించేవారు. ఆయన పాఠకులకు శక్తినీ, సహనాన్నీ ఇవ్వగలిగిన సాహిత్య తత్వ విజ్ఞత ఉన్న గొప్ప మనిషి. తరతరాలు గుర్తుండిపోయే కవి.

(ఆదివారం కనుమూసిన ప్రముఖ కవి సి.వి.కృష్ణారావు స్మృతిలో..)

– సిద్ధార్థ, ప్రముఖ కవి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



ఎత్తుగా ఉన్న పర్వతాన్ని చూసి భయపడనక్కర్లేదు.
లోయలో నిలబడి కుంగిపోనక్కర్లేదు. అధిరోహించొచ్చు.
ఆ పర్వతం భుజం మీద ఎక్కి పర్వతం ఇచ్చిన ఆనందానికి చప్పట్లు కొట్టొచ్చు.
'సాహో' సినిమా ఒక పర్వతం లాంటిది.
దాన్ని గౌరవించడానికి, కీర్తించడానికి మాత్రమే
చాలా సినిమాలు డేట్లు మార్చుకున్నాయి.
ఆ సినిమాల హీరోలు 'సాహోను సెలబ్రేట్ చేద్దాం' అని
పర్వతం భుజం మీద ఎక్కి చప్పట్లు కొడుతున్నారు.

● ప్రభాస్

### అందరికీ ధన్యవాదాలు...

'సాహో' సినిమాకు సోలో రిలీజ్ ఇవ్వడం కోసం పోస్ట్‌పోన్ చేసుకున్న సినిమా టీమ్స్ అందరికీ 'సాహో' బృందం తరఫున ధన్యవాదాలు తెలిపారు ప్రభాస్. "తమ సినిమాలను పోస్ట్‌పోన్ చేసుకున్న యాక్టర్స్, ప్రొడ్యూసర్స్, డైరెక్టర్స్ అందరికీ పెద్ద థ్యాంక్స్. మా 'సాహో' టీమ్ మీ అందరికీ గ్రేట్‌ఫుల్‌గా ఉంటుంది. మీ సినిమాలకు ఆల్ ది బెస్ట్" అని ప్రభాస్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా తెలిపారు.

# సాహో కోసం...

'టిప్పర్ లారీ వచ్చి స్కూటర్‌ని గుద్దితే ఎలా ఉంటుందో.. అలా ఉంటుంది నేను గుద్దితే' అని 'బుజ్జిగాడు' సినిమాలో విలన్‌కు తన స్టామినా గురించి వార్నింగ్ ఇస్తాడు ప్రభాస్. ఇప్పుడు ప్రభాస్ టిప్పర్ లారీ కాదు బుల్డోజర్. బాక్సాఫీస్‌ని బలంగా తాకి వసూళ్లను భారీగా కొల్లగొట్టే బుల్డోజర్. ఇప్పుడు ఆ బుల్డోజర్ మరోసారి బాక్సాఫీస్‌ను ఢీ కొనడానికి దూసుకొస్తోంది. రోడ్డు ఎంత ఖాళీగా ఉంటే ఫోర్స్ అంత గట్టిగా ఉంటుంది. 'సాహో' ఇంకా గట్టిగా యాక్సలేటర్ తొక్కేందుకు మిగతా సినిమాలు సైడ్ ఇండికేటర్‌లు వేసి సైడ్ అయ్యాయి. రూట్ క్లియర్ చేశాయి. 'సాహో' సోలో రిలీజ్ కోసం తమ సినిమాల రిలీజ్‌లు వాయిదా వేసుకున్నాయి. 'సాహో' డేట్ పోస్ట్‌పోన్ కావడంతో డేట్స్ షిఫ్ట్ అయిన సినిమాలు, డేట్ షిఫ్ట్ చేసుకున్న సినిమాల వివరాలు ఓ సారి చూద్దాం.

'సాహో' సినిమాను ముందుగా ఆగస్ట్ 15న రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం. నేషనల్ హాలిడే. ఓపెనింగ్స్ సృష్టించడానికి ఓపెన్ గ్రౌండ్. కానీ పోస్ట్ ప్రొడక్షన్‌లో పూర్తవ్వాల్సిన పనులు చాలా ఉన్నాయి. ఉడకని విందుభోజనాన్ని ఆడియన్స్‌ను అందించడం ఎవరికి ఇష్టం ఉంటుంది చెప్పండి... అందుకే 15 రోజులు పోస్ట్‌పోన్ చేసుకున్నారు. ఆగస్ట్ 30న వస్తున్నారు. దాంతో ఆగస్ట్15 ఖాళీ ఏర్పడింది. ఆ డేట్‌ను శర్వానంద్ 'రణరంగం', అడవి శేష్ 'ఎవరు' సద్వినియోగం చేసుకున్నాయి. సరైన డేట్ కోసం చూస్తున్న 'రణరంగం'కి మంచి డేట్ కుదిరింది. 23 వస్తున్నాం అని అనౌన్స్ చేసిన 'ఎవరు' వారం ముందే వచ్చేస్తోంది. క్యాలెండర్‌లో కొంచెం ముందుకెళ్తే ఆగస్ట్ 30. నానీ 'గ్యాంగ్ లీడర్', సూర్య 'బందోబస్త్' (తమిళంలో 'కాప్పాన్') రిలీజ్ డేట్‌లు ప్రకటించాయి. 'సాహో' ఆగస్ట్ 30కు రావడంతో ఆ రెండు చిత్రాలు వాయిదా పడ్డాయి.

### 'సాహో' కథేంటి?

ట్రైలర్‌ను బట్టి గమనిస్తే... ముంబైలో రెండు వేల కోట్ల చోరీ జరుగుతుంది. దీన్ని ఛేదించడానికి 'అశోక్ చక్రవర్తి' (ప్రభాస్ పాత్ర పేరు) అనే అండర్ కవర్ ఆఫీసర్ రంగంలో దిగుతాడు. మరోవైపు 'వాజీ' అనే భయంకరమైన సిటీ. గ్యాంగ్‌స్టర్స్ అడ్డా. అందులో ఓ బ్లాక్ బాక్స్. ఆ బాక్స్ సంపాదిస్తే చాలు ప్రత్యేకంగా డబ్బు సంపాదించాల్సిన పనిలేదు. కోటీశ్వరులు అయిపోవచ్చు. దానికోసం ప్రయత్నాలు జరుగుతుంటాయి. ముంబైలో చోరీకి, వాజీ సిటీకి ఏంటి సంబంధం? తెలియాలి. ''సాహో' స్క్రీన్‌ప్లే ప్రధానమైన చిత్రం. పాత్రలు మంచివా చెడ్డవా అనేవి స్క్రీన్‌ప్లే మారుస్తుంది'' అంటోంది చిత్ర బృందం. మరి ప్రభాస్ హీరో నా? హీరో ముసుగులో ఉన్న విలనా? విలన్‌గా కలరింగ్ ఇచ్చే హీరోనా? ప్రస్తుతానికి సస్పెన్స్.

పోస్ట్‌పోన్ చేసుకున్న సినిమాల వివరాల్లోకి వెళ్తే ...



### 'గ్యాంగ్ లీడర్' కహానీ క్యా హై?

పార్థసారథి.. రివెంజ్ స్టోరీల రైటర్. రివెంజ్ కథలు రాశాడంటే తిరుగే లేదు. ఓ రివెంజ్ స్టోరీ రాయమని పార్థసారథి దగ్గరకు వస్తుందో గ్యాంగ్. ఆ గ్యాంగ్‌లో స్కూల్ పాప నుంచి బామ్మ వరకూ ఐదుగురు అమ్మాయిలు ఉంటారు. క్లుప్తంగా చెప్పాలంటే వాళ్ల రివెంజ్ తీర్చుకునే ప్లాన్‌ను సారథి రాయాలి. రాయడమే కాదు వాళ్లకు రథసారథి కూడా కావాలి. నానీ 'గ్యాంగ్ లీడర్' చిత్ర కథ ఇది. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. ఆగస్ట్ 30న రిలీజ్ కావాల్సిన ఈ సినిమా సెప్టెంబర్ 13న రిలీజ్ కాబోతోంది.

''సాహో' మనందరి సినిమా. దేశవ్యాప్తంగా బజ్ క్రియేట్ చేస్తోంది. 'సాహో' విజయం సాధిస్తే మనందరం సెలబ్రేట్ చేసుకుంటాం. ప్రభాస్ అన్నకు, సాహో టీమ్ అందరికీ బ్లాక్‌బస్టర్ విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని ట్వీటర్ ద్వారా 'సాహో'కు శుభాకాంక్షలు తెలిపారు నాని.



### 'బందోబస్త్' ఎవరికి?

ప్రధాన మంత్రిని కాపాడే 'స్పెషల్ ప్రొటెక్షన్ ఆఫీసర్' అతను. ప్రధానిగా మోహన్ లాల్, అతనికి బందోబస్త్‌గా నిలిచే పాత్రను సూర్య చేశారు. కేవీ ఆనంద్ దర్శకుడు.'అయాన్' (తెలుగులో వీడొక్కడే), 'మాట్రాన్' (బ్రదర్స్) ఇది వరకు వీళ్ల కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు 'బందోబస్త్' వీరి కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా. ఆగస్ట్ 30న విడుదల చేయాలనుకున్నా ఈ సినిమా సెప్టెంబర్ 20న రిలీజ్ కానుంది.

### ఏడుగురు ఛిఛోరేల కథ

కాలేజీ రోజుల్లో రేపు అనేది లేనట్టు జీవితాన్ని ఆస్వాదిస్తాం. ప్రతి క్షణాన్ని ఎంజాయ్ చేస్తాం. మన గ్యాంగ్‌తో జ్ఞాపకాల్ని సృష్టించుకుంటాం. కాలేజీ అయిపోయిన తర్వాత? కలుస్తామో లేదో? కుదురుతుందో లేదో? ఈ కాన్సెప్ట్‌తో 'దంగల్' దర్శకుడు నితేష్ తివారీ తీసిన సినిమా 'చిచోరే'. ఏడుగురు స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది. సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్, శ్రద్ధా కపూర్, నవీన్ పొలిశెట్టి ముఖ్యపాత్రల్లో నటించారు. 'ఛిఛోరే' కూడా ఆగస్ట్ 30 రిలీజ్ . ఇప్పుడు సెప్టెంబర్ 6కి పోస్ట్‌పోన్ చేశారు.

### శ్రద్ధా వర్సెస్ శ్రద్ధా.. నహీ!

ఏ ఆర్టిస్ట్‌కైనా ఒకేరోజు తన రెండు సినిమాలు విడుదలైతే అదో కిక్కు. ఒకప్పటి స్టార్స్‌కి ఇలాంటి సీన్ దాదాపు ప్రతి శుక్రవారం ఉండేది. అయితే ఈ తరం తారలకు ఎప్పుడో కానీ అలా కుదరదు. ఈ ఏడాది శ్రద్ధా కపూర్ ఆ కిక్‌ని ఆస్వాదించగలుగుతారని చాలా మంది ఊహించారు. ఎందుకంటే 'సాహో', 'ఛిఛోరే' ఒకేరోజు విడుదలయ్యే పరిస్థితి కనిపించింది. అయితే శ్రద్ధా వర్సెస్ శ్రద్ధా నహీ (లేదు). ఎందుకంటే 'సాహో' హిందీలోనూ విడుదలవుతోంది కాబట్టి.. అక్కడి సినిమాలు కొన్ని వెనక్కి తగ్గాయి. అలా శ్రద్ధా కపూర్ 'ఛిఛోరే' కూడా వాయిదా పడింది.



● శ్రద్ధా కపూర్




### మేడ్ ఇన్ చైనా

'మేడ్ ఇన్ చైనా'... మన రోజువారి జీవితంలో చాలాసార్లు వింటాం, చూస్తూ ఉంటాం. ఇప్పుడు ఇదే క్రేజీ టైటిల్‌తో రాజ్ కుమార్ రావ్ ఓ సినిమా చేస్తున్నారు. గుజరాతీ బిజినెస్ మేన్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తృతం చేసుకోవాలని చైనా వెళ్లి అక్కడ ఏం నేర్చుకున్నాడు అన్నది కథ. ఈ సినిమా కూడా ఆగస్ట్ 30న థియేటర్స్‌లో పడాలి. కానీ పోస్ట్‌పోన్ అయిందని తెలిసింది.




ఏదైనా పెద్ద సినిమా ముందు ప్లాన్ చేసినట్టుగా రిలీజ్ కాకపోతే ఆ ప్రభావం అన్ని సినిమాల మీద పడుతుంది. తేదీలు మార్చుకోవాల్సి ఉంటుంది. సైకిల్ దెబ్బతింటుంది. ఉదాహరణకు గత ఏడాదినే తీసుకుంటే.. రజనీకాంత్ 'కాలా' ఏప్రిల్ 27న రిలీజ్ కానున్నట్టు ప్రకటించారు. ఆ డేట్‌పై ఆల్రెడీ మహేశ్‌బాబు 'భరత్ అనే నేను', అల్లు అర్జున్ 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమాలు కన్నేశాయి. ఈ రెండు చిత్రబృందాలు చర్చలు జరిపి రిలీజ్ డేట్లు మార్చుకున్నాయి. మొండిగా తలపడి థియేటర్లను, కలెక్షన్లను షేర్ చేసుకునే బదులు విడివిడిగా సోలో రిలీజ్ బెనిఫిట్‌లు ఎంజాయ్ చేసుకోవచ్చు. (పండగ సీజన్లను మినహాయించి) ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో 'ఫస్ట్ వీక్' ఎంత స్ట్రాంగ్‌గా ఉంటుందన్నదే కీలకంగా మారింది. క్లాష్ వద్దూ కాంప్రమైజే ముద్దు అనుకోవడం శుభ పరిణామం. క్లాష్ అయి ఏ టిక్కెట్టు కొనాలో ఆడియన్స్‌ని కన్‌ఫ్యూజ్ చేయకుండా సోలోగా వస్తే నిలువుదోపిడీ సమర్పించుకోవడానికి ప్రేక్షకుడు ఎప్పుడూ సిద్ధమే.

– గౌతమ్ మల్లాది







epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ మంగళవారం
13-8-2019


● పూరి జగన్నాథ్, విజయ్ దేవరకొండ, చార్మి

# క్రేజీ కాంబినేషన్

హీరో క్యారెక్టరైజేష న్‌లు తీర్చిదిద్దడంలో పూరి జగన్నాథ్‌కు పెట్టింది పేరు. ప్రస్తుతం యూత్‌లో ఎనర్జిటిక్‌గా దూసుకెళ్తున్న పేరు విజయ్ దేవరకొండ. ఇప్పుడు వీరిద్దరూ కలిసి ఓ సినిమా చేయబోతున్నారు. వీరి కాంబినేషన్‌ను క్రేజీ అనకుండా ఉండలేం. ''పూరి కనెక్ట్స్ గర్వంగా మా నెక్ట్స్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేస్తున్నాం. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. మిగతా వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని నిర్మాత చార్మీ తెలిపారు.

# నేనొచ్చేశా!



● రకుల్

శంకర్ తన సినిమాలతో ఓ ప్రపంచాన్నే సృష్టిస్తుంటారు. ఇప్పుడు ఆ ప్రపంచంలోకి అడుగుపెట్టారు రకుల్ ప్రీత్‌సింగ్. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇండియన్ 2'. ఇండియన్(తెలుగులో 'భారతీయుడు)కి ఇది సీక్వెల్. కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీ శంకర్ ముఖ్యపాత్రలు చేస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో సోమవారం జాయిన్ అయ్యారు రకుల్. ఇందులో సిద్ధార్థ్‌కు జోడీగా ఆమె నటిస్తున్నారని తెలిసింది. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం 2021లో విడుదల కానుంది.

విజయశాంతి సినిమాలకు బ్రేక్ ఇచ్చి 13 ఏళ్లయింది. ఇప్పుడు ఆమె మళ్లీ కెమెరా ముందుకు వచ్చారు.. అద్దం ముందు నిల్చుని డైలాగ్ పేపర్ చెక్ చేసుకుంటున్నారు. యాక్షన్, కట్ పదాల మధ్యలో మళ్లీ తన యాక్టింగ్ స్కిల్‌ని ఆడియన్స్‌కి చూపించడానికి

# ఇట్స్ మేకప్ టైమ్

రెడీ అయ్యారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. అనీల్ సుంకర, 'దిల్' రాజు నిర్మిస్తున్నారు. రష్మికా మందన్నా కథానాయిక. ఇందులో విజయశాంతి కీలక పాత్ర చేస్తున్నారు. సోమవారం షూటింగ్‌లో జాయిన్ అయ్యారామె. ''అదే క్రమశిక్షణ, అదే డైనమిజం, అదే యాటిట్యూడ్. 13 ఏళ్లలో విజయశాంతి గారు ఏం మారలేదు'' అన్నారు అనిల్ రావిపూడి. కాగా విజయశాంతిది మహేశ్‌తో సమానంగా సాగే పాత్ర అని తెలిసింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది.


● లొకేషన్‌లో..
● విజయశాంతి

# ఎవరి సలహాలూ వినొద్దన్నారు

"1980-90ల కాలంలో వచ్చిన సినిమాలు చూస్తూ పెరిగాను. ఆ రోజుల్లో పుట్టి ఉంటే ఎంత బాగుండేది? అని ఎప్పుడూ అనుకునేదాన్ని. ఇప్పుడు 'రణరంగం'లో అలాంటి పాత్ర చేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది" అని కల్యాణీ ప్రియదర్శన్ అన్నారు. శర్వానంద్, కాజల్ అగర్వాల్, కల్యాణీ ప్రియదర్శన్ ముఖ్యపాత్రల్లో సుధీర్ వర్మ తెరకెక్కించిన చిత్రం 'రణరంగం'. పీడీవీ ప్రసాద్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈనెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా కల్యాణి చెప్పిన విశేషాలు...

- 'రణరంగం' కథను సుధీర్ వర్మ బాగా చెప్పారు. ఇందులో స్క్రీన్‌ప్లే హైలైట్‌గా నిలుస్తుంది. ఫ్లాష్ బ్యాక్, ప్రస్తుతం... రెండూ సమానంగా నడుస్తుంటాయి. ంలో కచ్చితంగా భాగమవ్వాలనుకున్నా
- శర్వానంద్ పాత్ర జీవితంలో ఓ ఇరవై ఏళ్ల కాలాన్ని ఈ సినిమాలో చూపించనున్నాం. సాధారణ వ్యక్తి డాన్‌గా ఎలా ఎదిగారు? అన్నది కథాంశం. సినిమా మొత్తం తను చాలా సీరియస్‌గా, ఇంటెన్స్‌గా ఉంటారు. తనలో లవ్ యాంగిల్ ఉన్నా, ఎప్పుడైనా నవ్వినా అది నా పాత్ర (గీత) వల్లే. కథ 1990ల కాలంలో నడుస్తుంది. ఆ లుక్‌లో కనిపించడానికి మా అమ్మ (నటి లిజీ) సినిమాలో లుక్‌ను ప్రేరణగా తీసుకున్నాను. అమ్మ, శోభనగారి సినిమాలు చూశాను.
- నాకు గన్ పట్టుకోవాలని ఎప్పటి నుంచో ఉంది. 'రణరంగం' లో నేను గన్ పేల్చే సీన్ కూడా ఉంది.
- నేను తెలుగు సినిమాలు చేస్తున్నానని అమ్మ చాలా సంతోషంగా ఉన్నారు. ఈ సినిమాలో ఫస్ట్ టైమ్ లంగా వోణి వేసుకున్నా. ఆ డ్రెస్ నాకు బావుంటుందని నాన్నగారు (మలయాళ దర్శకుడు ప్రియదర్శన్) చాలా సార్లు అనేవారు.
- ఐదు సినిమాల అనుభవం వచ్చే వరకు నాన్నగారి దర్శకత్వంలో నటించకూడదనుకున్నాను. కానీ మోహన్‌లాల్‌తో నాన్న చేస్తున్న 'అరేంబికడలంటే సింహం'లో అతిథి పాత్ర చేశాను. తొలుత నటన సరిగ్గా లేదన్నారు.. ఎడిటింగ్‌లో చూసి బావుందన్నారు. నాన్న దర్శకత్వంలో మళ్లీ చేయకూడదనుకుంటున్నాను (నవ్వుతూ).
- సినిమాలు చేయాలనుకున్నప్పుడు అది చేయి.. ఇది చేయి అని అమ్మానాన్నలు సలహాలు ఇవ్వలేదు. 'ఎవరు పడితే వాళ్లు సలహాలు ఇస్తుంటారు. దాన్ని మాత్రం తీసుకోకు' అని చెప్పారు. ప్రస్తుతం తమిళంలో శివకార్తికేయన్ సినిమాలో నటిస్తున్నాను. సినిమా దర్శకత్వం చేయాలనే ఆలోచనలున్నాయి. కొన్ని ఐడియాలు ఉన్నాయి.
- స్క్రిప్ట్ బాగుంటే పాత్ర నిడివి ఎంత? ఫిమేల్ ఓరియంటెడ్ సినిమానా? కమర్షియల్ సినిమానా? అనే పట్టింపు లేదు. రెండు నిమిషాల పాత్ర అయినా చేయడానికి సిద్ధమే. 'మహానటి'కి కీర్తీ సురేశ్‌కు, కాస్ట్యూమ్ డిజైనర్ ఇంద్రాక్షి పట్నాయక్‌కి నేషనల్ అవార్డ్ రావడం సంతోషంగా అనిపించింది.. వాళ్లిద్దరూ నాకు మంచి ఫ్రెండ్స్.

నాకు, మా దర్శకుడు సుధీర్ వర్మకు హాలీవుడ్ దర్శకుడు క్వంటిన్ టరాంటినో అంటే బాగా ఇష్టం. ఆయన తీసిన 'కిల్ బిల్' నా ఫేవరెట్ సినిమా. సుధీర్, నేను సెట్లో కలసిపోవడానికి ఈ కామన్ ఇంట్రెస్ట్ ఉపయోగపడింది. ఈ నెల 15న క్వంటిన్ కొత్త సినిమా 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్', మా 'రణరంగం' ఒకే సారి రిలీజ్ అవుతుండటం విశేషం. ఆరోజు మేం రెండు సినిమాలు చూడాలి (నవ్వుతూ).


● కల్యాణీ ప్రియదర్శన్


● చైతన భరద్వాజ్, ప్రవీణ కడియాల, కార్తికేయ, అర్జున్ జంధ్యాల

# ఎంత ఖర్చుపెట్టినా ఆ పేరు రాదు

- కార్తికేయ

''గుణ 369' సినిమా చూసి మా అమ్మ తొలిసారి ఏడవటం చూశాను. ఈ చిత్రం తర్వాత నన్ను చూసి అమ్మ గర్వపడుతోంది. కొందరు మహిళలు నన్ను పట్టుకొని ఏడుస్తుంటే సినిమాకి ఎంత కనెక్ట్ అయ్యారో అర్థమైంది'' అని హీరో కార్తికేయ అన్నారు. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో కార్తికేయ, అనఘ జంటగా తెరకెక్కిన చిత్రం 'గుణ 369'. ప్రవీణ కడియాల సమర్పణలో తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల నిర్మించిన ఈ సినిమా ఈనెల 2న విడుదలైంది. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో కార్తికేయ మాట్లాడుతూ–''నా కెరీర్‌లో జీవితాంతం గుర్తు పెట్టుకొనే చిత్రం 'గుణ 369'. నాకు వస్తున్న ప్రశంసలు చూస్తుంటే భవిష్యత్తులో వంద బ్లాక్ బస్టర్‌లు ఇవ్వగలననే ధైర్యం వచ్చింది. ఇకపై నేను ఎంపిక చేసుకునే సినిమా కథల మీద ఈ సినిమా ఇంపాక్ట్ ఉంటుంది. ఈ చిత్రంతో బాధ్యతగల నటుడిగా పేరొచ్చింది. ఆ పేరు ఎంత ఖర్చుపెట్టినా రాదు. ఇందుకు నిర్మాతలకు థ్యాంక్స్.. దర్శకునికి రుణపడి ఉంటాను'' అన్నారు. అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ–''గుణ 369' విడుదల తర్వాత కర్నూలు నుండి వైజాగ్ వరకు టూర్‌కి వెళ్లాం. మంచి సినిమా తీశారు.. హ్యాపీగా ఉన్నామని ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు అంటుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమాను యూత్, మహిళలు, ఫ్యామిలీ ఆడియన్స్ అభినందిస్తున్నారు. ఏ దర్శకునికైనా ఇంతకన్నా ఏం కావాలి'' అన్నారు. ''హన్మకొండలో 9నెలల పసికందు శ్రీహితపై అత్యాచారం, హత్య జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ రోజు ఆ పాప తల్లిదండ్రులు జగన్, చరితలు ఫోన్ చేసి, 'గుణ 369' సినిమా చూసి, ఫోన్ చేశాం అని చెబుతుంటే మంచి సినిమా తీశాం అనే ఫీలింగ్‌తో హాయిగా ఉంది. మా చిత్రాన్ని శ్రీహితకు అంకితమిస్తున్నాం'' అని ప్రవీణ కడియాల అన్నారు.


● విజయ్ సేతుపతి


● ఆమిర్ ఖాన్

# ఆమిర్.. సేతుపతి.. ఓ మల్టీస్టారర్

ఆమిర్ ఖాన్.. బాలీవుడ్ సూపర్ స్టార్. విజయ్ సేతుపతి.. తమిళంలో అప్‌కమింగ్ సూపర్ స్టార్. ఇద్దరూ అద్భుతమైన నటులు. పేపర్ మీద రాసుకున్న పాత్రకు స్క్రీన్ మీద ప్రాణం పోస్తుంటారు. ఈ ఇద్దరూ త్వరలోనే స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారని తెలిసింది. ఈ విషయాన్ని విజయ్ సేతుపతి స్వయంగా తెలిపారు. ''ఆమిర్‌ఖాన్ గారు, నేను ఓ సినిమా చేయడానికి చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే ప్రకటిస్తాం'' అన్నారు. మరి ఈ సినిమా ఎలా ఉండబోతోందో అని అప్పుడే ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఈ ఇద్దరి హీరోల అభిమానులు.


● రెజీనా

"తెలుగు చిత్ర పరిశ్రమకు 'ఎస్.ఎమ్.ఎస్' చిత్రంతో 2012లో ఎంట్రీ ఇచ్చాను. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నా కెరీర్ పట్ల సంతోషంగా ఉన్నా. నాకు నచ్చిన పాత్రలను ఎంచుకుని వాటికి న్యాయం చేస్తున్నా. కానీ, పెద్ద సినిమాలు రాకపోవటానికి కారణం ఏంటో తెలియదు. అయితే నేను మంచి సినిమాలు, హిట్ సినిమాలు చేశాను" అని రెజీనా అన్నారు. అడివి శేష్, రెజీనా జంటగా నవీన్ చంద్ర కీలక పాత్రలో వెంకట్ రామ్‌జీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎవరు'. పివిపి సినిమా పతాకంపై పెరల్ వి.పొట్లూరి, పరమ్ వి.పొట్లూరి, కెవిన్ అన్నె నిర్మించిన ఈ సినిమా ఈనెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా రెజీనా పంచుకున్న విశేషాలు...

# సమీర పాత్ర ఫుల్‌మీల్స్

- పీవీపీగారు ఓ రోజు ఫోన్ చేసి, వెంకట్ రామ్‌జీ అనే కొత్త దర్శకుడు కథ చెప్తారు వినండి, నచ్చితే చేద్దాం అన్నారు. అడివి శేష్, రామ్‌జీ చెన్నై వచ్చారు. రామ్‌జీ రెండు గంటలు పాటు 'ఎవరు' కథ చెప్పినప్పుడే తనపై పూర్తినమ్మకం కుదిరింది. పైగా కథ చాలా బాగా నచ్చడంతో ఈ సినిమా చేస్తానని చెప్పాను.
- ఈ చిత్రంలో సమీర అనే పాత్ర చేశా. ఆమె జీవితంలో ఓ సంఘటన జరుగుతుంది. అది ఏంటి? చివరికి సమీర జీవితం ఎలాంటి మలుపు తిరుగుతుంది? అన్నదే చిత్ర కథ.
- సమీర పాత్ర పూర్తి సంతృప్తినిచ్చింది. ఫుల్ మీల్స్‌లాగా అన్నమాట. 'నక్షత్రం' సినిమాలో డబ్బింగ్ చెప్పా. పూర్తిస్థాయి పాత్ర చేసి, ఫుల్‌గా డబ్బింగ్ చెప్పిన తొలి చిత్రం 'ఎవరు'.
- 'ఏక్ లడ్‌కీ కో దేఖాతో ఐసే లగా' నా తొలి హిందీ చిత్రం. ఇందులో లెస్బియన్ పాత్రలో నటించా. సినిమా చూశాక చాలా మంది ఫోన్ చేసి అభినందించడం సంతోషంగా అనిపించింది. బోల్డ్‌గా నటించడానికి ఇబ్బంది లేదు. కానీ, వల్గర్‌గా ఉండే పాత్రలు మాత్రం చేయను. తాప్సీ నటించిన 'బద్లా'కి, మా సినిమాకి పోలికే లేదు. సినిమా చూస్తే తెలుస్తుంది.
- 'మహానటి' చిత్రానికి కీర్తీసురేశ్‌కి జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉంది. అలాంటి పాత్రలు చేసే అవకాశం అందరికీ రాదు. 'అ' సినిమాకి జాతీయ అవార్డు రావడంతో నాని మెసేజ్ చేశారు. ఆ చిత్రానికి మేకప్ విభాగంలో ఇంద్రాక్షి పట్నాయక్‌కి కూడా జాతీయ అవార్డు రావడం సంతోషం. 'అ' సినిమాలో నా మేకప్‌కి ఎంతో శ్రమించారామె.
- అడివి శేష్ మంచి నటుడు. తనతో పని చేసినందుకు చాలా సంతోషంగా అనిపించింది. సెట్‌లో సరదాగా ఎంజాయ్ చేశాం. ప్రస్తుతం ఓ తమిళ సినిమా చేస్తున్నా. తెలుగులో కూడా కొన్ని అవకాశాలున్నాయి.. ప్రొడక్షన్ వారే అధికారికంగా ప్రకటిస్తారు. హిందీలో కూడా త్వరలో ఓ సినిమా ఫైనల్ అవ్వనుంది.

# ట్రాప్‌లో పడేస్తారు

''ట్రాప్' సినిమా ట్రైలర్ చూడగానే తెలుగు ప్రేక్షకులందర్నీ ట్రాప్‌లో పడేస్తుందనిపించింది'' అని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మహేందర్ ఎప్పలపల్లి, కాత్యాయనీ శర్మ జంటగా బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో వీఎస్ ఫణీంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ట్రాప్'. స్వర్ణలత నిర్మించారు. ప్రేమ కవితాలయ పతాకం లోగోను నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, 'ట్రాప్' లోగోను


● కాత్యాయనీ, మహేందర్

నిర్మాత సురేష్ చౌదరి, టీజర్‌ను రచయిత మోహన్ వడపట్ల, ట్రైలర్‌ని బాలకిషన్ విడుదల చేశారు. ''హీరో, హీరోయిన్‌తో పాటు సాంకేతిక నిపుణులందరూ మంచి సపోర్ట్ అందించారు'' అన్నారు స్వర్ణలత. ''క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది'' అన్నారు వీఎస్ ఫణీంద్ర. కాత్యాయనీ శర్మ పాల్గొన్నారు.

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 2 | | | | 8 | 4 | |
| | | | 8 | | | | | 1 |
| | | 7 | 3 | | 1 | 2 | | 9 |
| | 1 | 3 | | 7 | | | | 8 |
| 7 | 8 | | 4 | | 9 | | 1 | 2 |
| 6 | | | | 1 | | 9 | 3 | |
| 3 | | 1 | 2 | | 6 | 5 | | |
| 2 | | | | | 4 | | | |
| | 4 | 9 | | | | 7 | | |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి. (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.


నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 5 | 7 | 4 | 1 | 2 | 9 | 6 |
| 4 | 1 | 7 | 9 | 6 | 2 | 3 | 5 | 8 |
| 9 | 6 | 2 | 5 | 3 | 8 | 1 | 4 | 7 |
| 8 | 9 | 4 | 2 | 7 | 3 | 5 | 6 | 1 |
| 7 | 2 | 6 | 1 | 5 | 4 | 9 | 8 | 3 |
| 5 | 3 | 1 | 8 | 9 | 6 | 4 | 7 | 2 |
| 6 | 5 | 9 | 3 | 1 | 7 | 8 | 2 | 4 |
| 2 | 7 | 3 | 4 | 8 | 5 | 6 | 1 | 9 |
| 1 | 4 | 8 | 6 | 2 | 9 | 7 | 3 | 5 |


● రమాకాంత్, శివాజీరాజా, విజయ్ రాజా, పూజా సోలంకి, సుదర్శన్

# సినిమా గురించి ప్రేక్షకులే మాట్లాడతారు

''ఏదెనా జరగొచ్చు' సినిమాకి హీరో, హీరోయిన్, దర్శకుడు... అన్నీ రమాకాంతే. మూడేళ్లు ఈ కథని మోస్తూ వస్తున్నాడు. అనుకున్న అవుట్‌పుట్ రావడం కోసం రాజీపడకుండా పనిచేశాడు. ఈ సినిమా బాగుందని నేను చెప్పను. విడుదలయ్యాక ప్రేక్షకులే చెబుతారు'' అని నటుడు శివాజీరాజా అన్నారు. విజయ్ రాజా హీరోగా, పూజా సోలంకి, సాషా సింగ్ హీరోయిన్స్‌గా కె.రమాకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏదెనా జరగొచ్చు'. సుదర్శన్ హనగోడు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శివాజీరాజా విడుదల చేశారు. ''ఏప్రిల్ 1న పుట్టిన ముగ్గురు ఫూల్స్ చేసే స్టుపిడ్ పనుల వల్ల ఎలాంటి ఇబ్బందుల్లో పడ్డారు? అన్నదే కథ'' అన్నారు. ''నటుడిగా నిరూపించుకునే పాత్ర ఈ సినిమాలో దొరికింది'' అన్నారు అజయ్ ఘోష్. ''మా సినిమాని పెద్ద హిట్ చేస్తారని ఆశిస్తున్నా'' అన్నారు సుదర్శన్. ''నాపై నమ్మకంతో ఈ సినిమా తీసిన రమాకాంత్‌గారికి రుణపడి ఉంటాను'' అన్నారు విజయ్ రాజా. పూజా, సాషా సింగ్, అనంతపురం జగన్ పాల్గొన్నారు.






సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 13-8-2019

వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం భూమి, విత్తనంలోనే ఉందని గుర్తెరగాలి!
- డా. వందనా శివ, ప్రముఖ దేశీ విత్తన పరిరక్షణ ఉద్యమకారిణి



ఆశ్లేష కార్తె : ఆగస్టు 16 వరకు మఖ కార్తె : ఆగస్టు 17 నుంచి



ద్రావజీవన ఎరువుల ట్యాంకు

# ద్రావణ ఎరువుల చెరువు!

**వార్షిక పంటలు, పండ్ల తోటల సాగు, పశుపోషణతో కూడిన సమీకృత ప్రకృతి వ్యవసాయమే రైతు జీవితాన్ని నిలబెడుతుందని నమ్మే రైతు దంపతుల విజయగాథ ఇది. సమీకృత ప్రకృతి వ్యవసాయంలో అనేక ప్రయోగాలు చేస్తున్న జిట్టా బాల్‌రెడ్డి, జ్యోతి దంపతులు సేంద్రియ ద్రావణ ఎరువు(ఆర్గానిక్ లిక్విడ్ మెన్యూర్స్)లను పంటలకు నిరంతరం అందించే సులువైన పద్ధతిని అనుసరిస్తున్నారు. ఫామ్ పాండ్(కృత్రిమ నీటి చెరువు)లోనే పేడ, జీవన ఎరువులతో ద్రావణ ఎరువులు నిరంతరం తయారు చేసుకుంటూ పంటలకు అందిస్తున్నారు. పెద్ద కమతాల్లోనూ పండ్ల, కూరగాయ తోటల్లో సైతం పోషకాల లోపం రాకుండా, ఎదుగుదల కుంటుపడకుండా మంచి దిగుబడులు సాధించవచ్చంటున్నారు.**

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు చాలా మంది పంటలకు, తోటలకు పోషకాలను తగు మోతాదులో ఇవ్వలేకపోవడం వల్ల దిగుబడి సరిగ్గా రావడం లేదన్న విషయాన్ని రైతు శాస్త్రవేత్త జిట్టా బాల్‌రెడ్డి గుర్తించారు.

కూలీల కొరత నేపథ్యంలో సకాలంలో జీవామృతం తదితర పోషక ద్రావణాలను తగిన మోతాదులో అందించడం రైతులకు కష్టతరంగా మారింది. పెద్ద కమతాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఇది మరీ కష్టంగా ఉంది. డ్రమ్ముల్లో, తొట్లలో జీవామృతం కలిపి, వడకట్టి సూక్ష్మ సేద్య పరికరాలతో పంటలకు అందించడం కొంచెం కష్టంతో కూడుకున్న పనే. చిన్నపాటి కుంటలోనే పోషక ద్రావణాలను నిరంతరం తయారు చేసుకుంటూ.. పక్కనే ఉన్న ఫామ్ పాండ్‌లోని నీటితో కలిపి ఒకే మోటారు ద్వారా పంటలకు సరఫరా చేసుకునే సులువైన పద్ధతిని బాల్‌రెడ్డి రూపొందించారు. ప్రకృతి వ్యవసాయంలో పోషక చక్రాన్ని సమర్థవంతంగా నిర్వహించడం ఈ పద్ధతి ద్వారా చిన్న కమతాలకే కాదు ఎంత పెద్ద కమతాలకైనా సులువేనని ప్రకృతి వ్యవసాయదారుడు జిట్టా బాల్‌రెడ్డి అంటున్నారు. గత పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆయన మూడేళ్ల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి దగ్గర్లోని రామకృష్ణాపురంలో తమ పొలంలో అమేయ కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించి ప్రకృతి వ్యవసాయంలో, పండ్ల నర్సరీ పెంపకంలో కొత్త పద్ధతులు అనుసరిస్తున్నారు.

మొత్తం 6.5 ఎకరాల పొలంలో 3.5 ఎకరాల్లో మామిడి(35 రకాలు), బొప్పాయి(ఐబిపి9), నిమ్మ (6 రకాలు), జామ(10 రకాల) తోటలను సాగు చేస్తూ ఈ పంట మొక్కలు అందించే నర్సరీని కూడా అభివృద్ధి చేశారు. 1.5 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కొంతస్థలంలో పశుగ్రాసం సాగు చేస్తున్నారు. పొలంలోనే ఇల్లు, పశువుల పెంపకానికి షెడ్లను, ఫామ్‌పాండ్‌ను, పోషక ద్రావణాలు తయారు చేసుకోవడానికి చిన్న కుంటను ఏర్పాటు చేసుకున్నారు. 40 మేకలు, 12 గొర్రెలు, 6 ఆవులు, 50 కోళ్లు పెంచుతూ సమీకృత ప్రకృతి వ్యవసాయానికి ఈ క్షేత్రాన్ని పట్టుగొమ్మగా మార్చారు.

## ఫామ్ పాండ్‌లోనే ద్రావణ ఎరువుల తయారీ

బాల్‌రెడ్డి క్షేత్రంలో తొలుత డ్రమ్ముల్లో జీవామృతం, పంచగవ్య, ఫ్రూట్ ఫర్మెంటెడ్ జ్యూస్ వంటి ద్రావణఎరువులు తయారు చేసి పంటలకు అందించేవారు. దానికన్నా ఫామ్ పాండ్‌లోనే పశువుల పేడ, జీవన ఎరువులు వేసి ద్రావణ ఎరువులు తయారు చేసుకుంటే ఎప్పుడూ లోటు లేకుండా పంటలకు సరఫరా చేయొచ్చని భావించిన బాల్‌రెడ్డి.. రెండు ఫామ్ పాండ్స్(నీటి కుంటలు) తవ్వారు. ఒక దాంట్లో సాగు నీరు నిల్వ ఉంటుంది. దానిపక్కనే ఉన్న మరో ఫామ్ పాండ్‌లో ద్రావణ ఎరువులు నిరంతరం తయారవుతూ.. డ్రిప్/రెయిన్‌గన్/మైక్రో స్ప్రింక్లర్ల ద్వారా పంటలకు సరఫరా అవుతూ ఉంటాయి. నీరు, ద్రావణ ఎరువులు రెండు వేర్వేరు ఫామ్ పాండ్లలో ఉన్నప్పటికీ, ఒకే మోటారు ద్వారా పంటలకు సునాయాసంగా, తక్కువ ఖర్చుతో, సకాలంలో సరఫరా చేస్తుండడం విశేషం.

## పేడ, జీవన ఎరువులతో ద్రావణ ఎరువు

రైతు బాల్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో 90 వేల లీటర్ల సామర్థ్యం గల ద్రవ జీవన ఎరువుల ట్యాంకును రూ. 16 వేలతో నిర్మించారు. 25 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు, ఆరడుగుల లోతున జేసీబీతో గుంత తీశారు. నీరు ఇంకిపోకుండా ప్లాస్టిక్ పరదాను పరిచి, నీరు నింపారు. అందులోకి రోజూ ఐదు నుంచి పది తట్టల వరకు పశువుల పేడ వేస్తున్నారు. ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్, అజొటోబాక్టర్ వంటి జీవన ఎరువుల మదర్ కల్చర్‌ను తెచ్చి.. బెల్లం, నీరు కలిపి ఒక్కో రకాన్ని వంద లీటర్లు తయారు చేసి ఫామ్ పాండ్ నీటిలో కలిపారు. పండ్ల తోటలకు 3 రోజుల కోసారి డ్రిప్ ద్వారా నీరు ఇస్తున్నారు. 6 రోజులకోసారి ద్రావణ ఎరువును కలిపిన నీటిని అందిస్తున్నారు.

> **పోషక లోపాన్ని సులభంగా అధిగమించవచ్చు**
>
> ఎకరానికి 15 రోజులకోసారి 200 లీటర్ల జీవామృతం ఇస్తే చాలని అంటూ ఉంటారు. అయితే, మా భూమికి ఆ మోతాదు సరిపోలేదు. 90 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఫామ్‌పాండ్‌లో ద్రావణ ఎరువులు తయారు చేయడం మొదలుపెట్టిన తర్వాత ఎకరానికి వెయ్యి లీటర్లకు పైగా ఇస్తున్నాం. ప్రతి 3 రోజులకు నీరు డ్రిప్ ద్వారా పండ్ల తోటలకు ఇస్తున్నాం. ప్రతి 6 రోజులకోసారి నీటితోపాటు ద్రావణ ఎరువు కూడా కలిసి వెళ్లేలా అనుసంధానం చేశాం. దీని వల్ల పంటల ఎదుగుదల, దిగుబడి ఎంతో బాగుంది. ఫామ్‌పాండ్‌లో పేడ రోజూ 5–10 తట్టలు వేస్తున్నాం. ట్రైకోడెర్మావిరిడి, అజొటోబాక్టర్, సూడోమోనాస్ వంటి జీవన ఎరువులను ఒక్కోటి 100 లీటర్ల మేరకు తయారు చేసి మొదట్లో ఫామ్‌పాండ్‌లో కలిపాం. పంటలకు ద్రావణ ఎరువు తోడిన తర్వాత ఆ మేరకు ఏ రోజుకారోజు నీటిని నింపుతున్నాం. ఫామ్‌పాండ్ ఎప్పుడూ పూర్తిగా ఖాళీ చెయ్యకపోతే జీవన ఎరువులు మళ్లీ మళ్లీ వేయాల్సిన అవసరం లేదు. పేడ వేస్తూ ఉంటే చాలు. ద్రావణ ఎరువు ఫామ్ పాండ్ నిండా ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుంది. కాబట్టి పెద్ద కమతాలకు కూడా పుష్కలంగా, తక్కువ సమయంలోనే, తక్కువ శ్రమతో పోషక ద్రావణ ఎరువులు అందించడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుంది.
>
> **– జిట్టా బాల్‌రెడ్డి(89782 21966),**
> రైతు శాస్త్రవేత్త, అమేయ కృషి విజ్ఞాన కేంద్రం, రామకృష్ణాపురం, యాదాద్రి భువనగిరి జిల్లా





● ఫామ్‌పాండ్ మోటారు నుంచి ద్రవజీవన ఎరువుల ట్యాంకులోకి ఏర్పాటు చేసిన పైపు

## పీడన శక్తితో ద్రావణ ఎరువు సరఫరా

రెండు వేర్వేరు ఫామ్ పాండ్స్‌లో ఉన్న సాగు నీరు, ద్రావణ ఎరువులను ఒకే మోటారుతో పంటలకు సరఫరా చేస్తుండడం విశేషం. సాగు నీరున్న ఫామ్ పాండ్‌లో బిగించిన మోటారుతో డ్రిప్ ద్వారా పంటలకు నీరందిస్తున్నారు. ఈ పాండ్‌కు దగ్గర్లోనే ఉన్న మరో పాండ్‌లో సిద్ధంగా ఉన్న పోషక ద్రావణాన్ని ఒక పైపు ద్వారా వేరే ఫామ్‌పాండ్‌లోని మోటారు ఫుడ్ బాల్ దగ్గర ఉన్న ముప్పావు అంగుళం నెప్పల్‌తో అనుసంధానం చేశారు. పక్క ఫామ్ పాండ్‌లోని ద్రావణ ఎరువును అనుసంధానం చేసిన పైపు ద్వారా పీడన శక్తి ద్వారా మోటార్ నీటితోపాటు ద్రావణ ఎరువును కూడా పీల్చుకొని, డ్రిప్ ద్వారా పంటలకు అందిస్తోంది.

20 నిముషాల్లో 1,400 లీటర్ల పోషకాల ద్రావణాన్ని 1,400 మొక్కలకు సరఫరా చేయవచ్చని అంచనా.. డ్రిప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే ద్రావణం పైపుల్లో జామ్ కాకుండా మూడు దశల్లో వడపోత ఉంటుంది. 200 లీటర్ల ప్లాస్టిక్ డ్రమ్ముకు పై కప్పు తీసేసి, డ్రమ్ము చుట్టూ 6 అంగుళాలకోచోట బెజ్జాలు పెట్టారు. ఆ డ్రమ్ముకు 80 మైక్రాన్ల నైలాన్ జాలీని సంచి లాగా తొడిగి, ద్రావణ ఎరువులు తయారు చేస్తున్న ఫామ్ పాండ్ మధ్యలో నిలబెట్టాలి. ఇలా చేయడం వల్ల ద్రావణ ఎరువును మోటారు పీల్చుకునేటప్పుడు పేడలోని పిప్పి అడ్డుపడదు. అదేమాదిరిగా, డ్రమ్ములో వేసే బాల్ వాల్‌కు కూడా నైలాన్ మెష్‌తో చేసిన సంచిని తొడగాలి. పైపును ఈ బాల్ వాల్‌కు ఒక వైపు బిగించి.. పక్కన ఫామ్‌పాండ్‌లో మోటారు వద్ద ముప్పావు అంగుళం నెప్పల్‌తో అనుసంధానం చేయాలి. ఇలా చేయడం వల్ల సాగు నీటిని తోడేందుకు మోటారు ఆన్ చేసినప్పుడు.. ఆ ఫామ్ పాండ్‌లోని నీటితోపాటు.. పక్క పాండ్‌లోని ద్రావణ ఎరువు కూడా డ్రిప్ లైన్లకు సరఫరా అవుతుంది. ద్రావణ ఎరువుతో సంబంధం లేకుండా వట్టి నీటినే పంటలకు అందించాలనుకున్నప్పుడు నెప్పల్ దగ్గర అనుసంధానం చేసిన పైపును తొలగిస్తే చాలు. మళ్లీ ద్రావణఎరువు సరఫరా చేయాలనుకున్నప్పుడు మళ్లీ ఆ పైపును అనుసంధానం చేస్తే సరిపోతుంది. ఇలా అదనంగా మరో మోటారు ఖర్చు లేకుండానే నీటిని, ద్రావణ ఎరువులను పంటలకు అందించుకోవచ్చు. అవసరాన్ని బట్టి డ్రిప్, రెయిన్‌గన్, మైక్రో స్ప్రింక్లర్లు, కాలువ ద్వారా పారించుకోవచ్చు. కూలీల ఖర్చు తగ్గుతుంది. రూ. వేలల్లో అయ్యే ఖర్చు రూ. వందల్లోకి తగ్గుతుంది. ఈ పద్ధతిలో 20 నిమిషాల్లోనే ఎకరానికి ద్రావణ ఎరువును అందించవచ్చని బాల్‌రెడ్డి తెలిపారు.



● ద్రావణ ఎరువుల ట్యాంకులో ఫిల్టర్ చేసే ఫుట్ బాల్ గురించి వివరిస్తున్న బాల్‌రెడ్డి

**– యంబ నర్సింహులు**, సాక్షి, యాదాద్రి
ఫొటోలు : **కోల్లోజు శివకుమార్**

## 18న 'సాగు చేయని' ఆకుకూరల పండుగ



సేంద్రియ వ్యవసాయ పొలాల్లో వాటంతట అవే మొలిచే ఎంతో విలువైన పాతకాలపు ఆకుకూరలు, ఔషధ మొక్కలను ఈతరం వారు చాలా వరకు గుర్తు కూడా పట్టలేరు. విలువ తెలియని వారు వీటిని 'కలుపు' మొక్కలు అంటుంటారు. అయితే, జహీరాబాద్ ప్రాంత మహిళా రైతులు తమ మెట్టపొలాల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజ పంటలతోపాటు 80 నుంచి 120 రకాల ఆకుకూరలు, ఔషధ మొక్కల(అన్ కల్టివేటెడ్ గ్రీన్స్)ను సాగు చేస్తున్నారు. అయితే, ఈ విత్తనాలు వేయరు. కలుపు మందులు చల్లరు కాబట్టి.. ఏటేటా వాటంతట అవే పెరుగుతూ ఉంటాయి. వీటినే అన్‌కల్టివేటెడ్ గ్రీన్స్ అని పిలుస్తున్నారు. వాటిని పేరు పేరునా గుర్తించడం, సేకరించడం, వండుకొని తినటం ద్వారా పౌష్టికాహార లోపం లేకుండా ఆరోగ్యంగా జీవించడం సంప్రదాయ వ్యవసాయ సంస్కృతిలో అంతర్భాగం. ఈ 'సాగు చేయని' ఆకుకూరల గురించి రైతు లోకానికి, పట్టణ, నగర ప్రాంత ప్రజలకు తెలియజెప్పడానికి డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఏడాదికోసారి పండుగ నిర్వహిస్తోంది. ఈ నెల 18(ఆదివారం) సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ – ఝరాసంఘం మండలం మచ్‌నూర్‌లోని పచ్చశాల(సేంద్రియ వ్యవసాయ కేంద్రం)లో ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు పండుగ జరగనుంది. ఆసక్తి గల వారు అక్కడికి వెళ్లి మహిళా రైతులతో కలిసి వారి పొలాల్లో సాగు చేయని ఆకుకూరలు, ఔషధ మొక్కల గురించి తెలుసుకోవచ్చు. వివరాలకు.. 040– 27764577 https://forms.gle/dLByYF1E3vjRLFoj9

## చోహాన్ క్యూ సహజ వ్యవసాయం, కోళ్ల పెంపకంపై శిక్షణ

దక్షిణ కొరియాకు చెందిన సహజ వ్యవసాయ శాస్త్రవేత్త డా. చోహాన్ క్యూ పద్ధతిలో రసాయనాలు వాడకుండా కోళ్ల పెంపకం, పంటల సాగు పద్ధతిలో సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఆయన శిష్యురాలు, సౌత్ ఆసియా రూరల్ రీకన్‌స్ట్రక్షన్ అసోసియేషన్ (సర్ర – బెంగళూరు) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రోడి రోహిణీరెడ్డి రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. తక్కువ ఖర్చు, తక్కువ శ్రమ, తక్కువ సమయంలో ఎక్కువ నాణ్యత, అధిక నికరాదాయం సాధించే మార్గాలను రైతులకు నేర్పిస్తారు. చిత్తూరు జిల్లా పులిచెర్లలోని 'సర్ర' నమూనా ప్రదర్శన క్షేత్రంలో శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందదలచిన వారు ఈ నెల 25లోగా పేర్లు నమోదు చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. మొబైల్ : 99859 47003 email : Sarraindia@gmail

## అక్టోబర్ 4న దక్షిణాది గో ఆధారిత రైతు సమ్మేళనం

గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సహకార సంఘం(ఆం. ప్ర.), భారతీయ కిసాన్ సంఘ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలో అక్టోబర్ 4(శుక్రవారం)న దక్షిణ భారత గోఆధారిత రైతు సమ్మేళనం, 4–6 తేదీల్లో జాతీయ సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు నాయకులు కుమారస్వామి, సుబ్రమణ్యం తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది రైతులు ఈ సమ్మేళనంలో పాల్గొనడమే కాకుండా రసాయన రహితంగా పండించిన తమ ఆహారోత్పత్తులను తెచ్చి ప్రదర్శించి, విక్రయిస్తారని తెలిపారు. వివరాలకు.. 99512 82288, 76598 55588, 98490 00399.

## 23-24 తేదీల్లో మైసూరులో డా. ఖాదర్ అటవీ వ్యవసాయ శిక్షణ

సిరిధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలను అటవీ వ్యవసాయ పద్ధతుల్లో రసాయనాలు వాడకుండా సాగు చేసే పద్ధతులపై స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి ఈ నెల 23–24 తేదీల్లో రైతులకు శిక్షణ ఇస్తారు. భూమి – నీటి యాజమాన్యం, అటవీ చైతన్య ద్రావణం తయారీ, మిక్సీతో సిరిధాన్యాల బియ్యం తయారీ పద్ధతులు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. కర్ణాటకలోని మైసూరు సమీపంలోని బిదరహల్లి కబిని డ్యాం దగ్గర గల డా. ఖాదర్ వలి అటవీ వ్యవసాయ క్షేత్రంలో శిక్షణ ఇస్తారు. హెచ్.డి.కోటె హ్యాండ్‌పోస్టు లోని మైరాడ సంస్థ ఆవరణలో వసతి సౌకర్యం కల్పిస్తారు. ఫీజు, రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. 74112 26677, 93466 94156, 99017 30600.

## సుస్థిర వ్యవసాయంపై 'వాలంతరి' 3 నెలల సర్టిఫికెట్ కోర్సు

తెలంగాణ రాష్ట్రానికి చెందిన గ్రామీణ యువతకు భూమి – నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయం నేర్పించే లక్ష్యంతో హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ప్రభుత్వ సంస్థ నీరు–భూమి యాజమాన్య శిక్షణ మరియు పరిశోధన సంస్థ(వాలంతరి) 3 నెలల రెసిడెన్షియల్ సర్టిఫికెట్ కోర్సును నిర్వహించనుంది. రుసుము రూ. 5 వేలు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. ఇంటర్/ఐటిఐ/డిప్లొమా చదివిన 18–30 మధ్య వయస్కులు అర్హులు. దరఖాస్తు రుసుము రూ. 500. Director General, WALAMTARI, Hyderabad పేరుపై డీడీ తీసి దరఖాస్తుతో జత చేసి పంపాలి. దరఖాస్తు వివరాలకు www.tswalamtari.cgg.gov.in వెబ్‌సైట్‌ను దర్శించవచ్చు. ఈ నెల 16లోగా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు.. 77029 99802, 99494 41329, 040–24006257.

# లాభసాటి పాడికి గేదెలా? ఆవులా?

**• డెయిరీ డైరీ-3**



మేలు జాతి పాడి పశువుల ఎంపికతోనే పాడి పరిశ్రమ లాభదాయకత ఆధారపడి ఉంటుంది. 10 –20 పాడి పశువులతో డెయిరీ పరిశ్రమ ఏర్పాటు చేసుకొని లాభదాయకంగా నిర్వహించుకోవాలనుకునే రైతులు పాటించాల్సిన మెళకువల్లో మేలైన పాలసార కలిగిన పాడి పశువుల ఎంపిక అతి ముఖ్యమైనది.

పాడి పశువుల పాలసార వాటి జాతిపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ పాల ఉత్పత్తితో లాభం పొందాలంటే మంచి పాలసార కలిగిన మేలు జాతి పాడి పశువులను ఎంపిక చేసుకోవాలి.

## గేదెలు, సంకర ఆవులు, దేశీ ఆవుల్లో ఏవి మేలు?

వాణిజ్యపరంగా లాభదాయకంగా పాల డెయిరీ ఏర్పాటు చేసుకోదలచిన రైతులు ముందుగా తమ తమ ప్రాంత మార్కెట్‌లో ఏ యే జాతి పశువుల పాలకు గిరాకీ ఉందో క్షుణ్ణంగా తెలుసుకొని వాటిని ఎంపిక చేసుకోవాలి. కొన్ని ప్రాంతాల్లో సంకరజాతి (హెచ్.ఎఫ్. / జెర్సీ) ఆవు పాలకు, మరికొన్ని ప్రాంతాల్లో గేదె (ముర్రా / గ్రేడెడ్ ముర్రా) పాలకు గిరాకీ ఉంటుంది. ఇటీవల కాలంలో కొన్ని నగర, పట్టణ ప్రాంతాల్లో దేశీ జాతి (గిర్ / సాహివాల్) ఆవు పాలకు గిరాకీ పెరుగుతోంది. ఒంగోలు జాతి ఆవుల్లో కొన్ని పూర్వం రోజుకు 15 లీటర్ల పాలు ఇవ్వగలిగేవట. అలాంటి ఆవుల జాతి సంతతిని అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం గతంలో శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ఒంగోలు జాతి పాడికి అనువైన దిగా వృద్ధి చెందలేకపోయింది. అయితే, దేశీ గోజాతుల్లో పాలసారను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలకు ప్రభుత్వం ఇటీవలే చర్యలు ప్రారంభించడం విశేషం.

పశుపోషణలో గేదెలకన్నా సంకరజాతి ఆవుల పోషణ సులభతరం, లాభదాయకం. సంకర జాతి ఆవులు తక్కువ కాలంలో ఎదకు వస్తాయి. 3 సంవత్సరాల వయసుకే తొలి ఈత ఈనుతాయి. 10 నెలలు పాలిస్తాయి. ఈతకు–ఈతకు మధ్య 12–13 నెలలుంటుంది.

గేదెలు సుమారు నాలుగేళ్లకు గానీ మొదటి ఈనవు. 8–10 నెలలు పాలిస్తాయి. ఆవు లేదా గేదె జీవిత కాలంలో సాధారణంగా 5–6 సార్లు ఈనుతాయి.


దేశీఆవులు 3 సంవత్సరాలకు ఎదకు వస్తాయి. నాలుగేళ్లకు మొదటిసారి ఈనుతాయి. పాల ఉత్పత్తి సంకర జాతి ఆవులతో పోలిస్తే తక్కువ. అయితే, దేశీ ఆవుల పాల (ఆరోగ్యదాయకమైన 'ఎ2' పాలుగా ప్రసిద్ధి) ధర ఎక్కువ. దేశీ ఆవులు 7 నెలలు పాలిస్తాయి.

గేదెలతో పోలిస్తే సంకర జాతి ఆవులలో మూగ ఎద ఉండదు. మంచి పోషణ ఉన్న ఆవులు ఎద లక్షణాలను ప్రస్ఫుటంగా కనబరిచి కృత్రిమ గర్భధారణకు సహకరిస్తాయి. దీనివల్ల ఈతకు ఈతకు మధ్య వ్యత్యాసం తగ్గుతుంది. ఆవులతో పోలిస్తే గేదెలు తినే మేత పరిమాణం ఎక్కువ, సగటు పాల దిగుబడి తక్కువ.

> **అన్ని కాలాల్లో పాల లభ్యత, పాల ధర, వెన్న శాతం దృష్టిలో ఉంచుకున్నప్పుడు పాడి పరిశ్రమను 50% గేదెలతోను, 50% ఆవులతోనూ ప్రారంభించాలి. నెమ్మదిగా అత్యున్నత పాలసార కలిగిన ఆబోతుల వీర్యంతో ఆవుల జాతిని అభివృద్ధి చేసుకోవాలి. ఆవుల సంఖ్యను పెంచుకుంటూ.. గేదెలను కాలక్రమేణా తీసివేసి, అధిక సగటు పాల ఉత్పత్తి సాధించడం ద్వారా అధిక లాభాలను ఆర్జించవచ్చు.**

ఇక్కడ ముఖ్యంగా ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే.. ఆవులను మనం సంతలలోనూ, ఇతర ప్రదేశాలలోనూ కొనకుండా, మన సొంత డెయిరీ ఫారంలోనే మంచి జాతిని, మన వాతావరణానికి తట్టుకునే ఆవులను వృద్ధి చేసి సగటు పాల ఉత్పత్తి అధికంగా పెంచుకోవచ్చు.

- పశువు ఈనిన నెల లేదా నెలా పదిహేను రోజుల లోపల అత్యధికంగా పాల ఉత్పత్తి స్థాయిని చేరుతుంది. కాబట్టి, ఈనిన నెలలోపు పశువులనే కొనుగోలు చేయాలి.
- పాడి పశువులు మొదటి 5 ఈతలలోనే గరిష్ట స్థాయిలో పాల దిగుడినివ్వగలవు. కాబట్టి మొదటి ఈత లేదా రెండో ఈత పశువులను మాత్రమే కొనాలి.
- సంకరజాతి ఆవు కనీసం రోజుకు 8–12 లీటర్ల పాలు, ముర్రా గేదె సరాసరి 7–8 లీటర్ల పాలు ఇవ్వగలగాలి.
- ఎలాంటి దురలవాట్లు లేని, ఆరోగ్యవంతమైన పశువులను ముఖ్యంగా, జననేంద్రియ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు లేని వాటిని గమనించి కొనాలి.
- పాడి పశువులు బెదరకుండ, మచ్చికగా ఉండే వాటినే కొనాలి.
- పొదుగు ఆరోగ్యంగా ఉండాలి. చనుకట్లు సమానంగా ఉండాలి.



## ఆవులు - గేదెల మధ్య తేడాలేమిటి?

**పాల ఉత్పత్తికి సామర్థ్యం**
**ఆవులు:** సంకరజాతి హెచ్.ఎఫ్. ఆవులు ఒక ఈత కాలంలో సుమారుగా 4,500 కిలోల పాలు, సంకరజాతి జెర్సీ ఆవులు ఈతకాలంలో సుమారుగా 3,500 కిలోల పాలు ఇస్తాయి.
**గేదెలు:** ముర్రా గేదెలు ఈత కాలంలో 2,200 కిలోల పాలు ఇస్తాయి.

**ఈతల మధ్య కాలం**
**ఆవులు:** సంకర జాతి ఆవులు ఈతల మధ్యకాలం సుమారుగా 360–400 రోజులు ఉంటుంది.
**గేదెలు:** ముర్రా జాతి గేదెల ఈతల మధ్యకాలం సుమారుగా 450–500 రోజులు ఉంటుంది.

**పశువు శరీర పోషణ ఖర్చు**
**ఆవులు:** సంకరజాతి ఆవులు తిన్న ఆహారాన్ని సమర్థవంతంగా పాల ఉత్పత్తికి ఉపయోగించుకుంటాయి. కనుక పోషణ ఖర్చు తక్కువ.
**గేదెలు:** గేదెలు తిన్న ఆహారాన్ని శరీరాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకుంటాయి. కనుక పశు పోషణ ఖర్చు ఎక్కువ.

**పాల ఉత్పత్తి ఖర్చు**
**ఆవులు:** ఈత కాలంలో సుమారుగా 4,000 కిలోల పాలు ఇస్తుందనుకుంటే.. పాల ఉత్పత్తికి కావలసిన దాణా 4,000 / 2.5 = 1,600 కిలోలు. కిలో దాణా ఖరీదు రూ. 12 చొప్పున పాల ఉత్పత్తికి ఒక ఈత కాలంలో అయ్యే ఖర్చు రూ. 19,200.
**గేదెలు:** ఈత కాలంలో సుమారు 2,200 కిలోల పాలు ఇస్తుందనుకుంటే.. పాల ఉత్పత్తికి కావలసిన దాణా 2200/2= 1100 కిలోలు. కిలో దాణా ఖరీదు రూ. 12 చొప్పున పాల ఉత్పత్తికి ఒక ఈత కాలంలో అయ్యే ఖర్చు రూ. 13,200.

**పాలపై వచ్చే ఆదాయం**
**ఆవులు:** ఆవు పాలలో సగటు వెన్న శాతం తక్కువ. అయినా ఆవు పాడి కాలంలో ఇచ్చే పాల పరిమాణం ఎక్కువ. కాబట్టి ఆదాయం ఎక్కువ.
**గేదెలు:** గేదె పాలలో సగటు వెన్న శాతం ఎక్కువ. అయినా గేదె ఒక పాడి కాలంలో ఇచ్చే పాల పరిమాణం తక్కువ. కాబట్టి నికరాదాయం తక్కువ.

**పునరుత్పత్తి**
**ఆవులు:** బాగా మేసిన ఆవు దూడలు 16 నుంచి 18 నెలల్లో చూడికట్టి 25–27 నెలలకు మొదటి ఈత ఈనుతాయి. ఆవుల పునరుత్పత్తి సామర్థ్యం దృష్ట్యా మంద త్వరగా వృద్ధి చెందుతుంది.
**గేదెలు:** బాగా మేపిన గేదె దూడలు 36 నెలలకు చూడి కట్టి, 46 నెలలకు మొదటి ఈత ఈనుతాయి. గేదెలలో పునరుత్పత్తి సామర్థ్యం దృష్ట్యా త్వరగా అభివృద్ధి చెందదు.

**ఎదకాలం**
**ఆవులు:** ఎదకాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. మూగ ఎద ఉండదు.
**గేదెలు:** ఎదకాలం 24 నుంచి 36 గంటలు ఉంటుంది. 30% గేదెలలో మూగ ఎద ఉంటుంది.

**వ్యాధి నిరోధక శక్తి**
**ఆవులు:** సంకరజాతి ఆవులలో తక్కువ
**గేదెలు:** గేదెలలో ఎక్కువగా ఉంటుంది

**పశువు నుంచి సహకారం**
**ఆవులు:** సంకరజాతి ఆవు పాలు ఎవరైనా తీయవచ్చు. దూడ లేకుండా కూడా పాలు ఇస్తుంది.
**గేదెలు:** గేదెల నుంచి అలవాటు పడిన వ్యక్తులు, అలవాటుపడిన ప్రదేశంలో పాలుతియ్యాలి. దూడ లేకుండా పాలు పితకడం కష్టం.

**వాతావరణం**
**ఆవులు:** సంకరజాతి ఆవుకు సరైన వసతి సౌకర్యం కల్పిస్తే ఎండ వేడిని తట్టుకోగలవు. గాలి విస్తారంగా ఉన్న ప్రదేశాలు అనుకూలం. వేసవిలో కూడా చూడి కడతాయి. ఈనుతాయి. పాలు ఇస్తాయి.
**గేదెలు:** గేదెలు ఎండ వేడిని తట్టుకోలేవు. వేసవిలో పాల ఉత్పత్తి బాగా తగ్గుతుంది. వేసవిలో చూడికట్టవు. 90% గేదెలు శీతాకాలంలోనే (అక్టోబర్ – ఫిబ్రవరి) ఎదకు వస్తాయి.

**వాణిజ్యపరంగా పాల విలువ**
**ఆవులు:** వాణిజ్యపరంగా కిలో పాల విలువ తక్కువ.
**గేదెలు:** కిలో పాల ఖరీదు ఎక్కువ.

**జాతి అభివృద్ధి**
**ఆవులు:** కృత్రిమ గర్భోత్పత్తికి బాగా సహకరిస్తాయి. చూడి కట్టే శాతం 60 వరకు ఉంటుంది. వేగంగా జాతిని అభివృద్ధి చేయగలవు. మేలైన పునరుత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటాయి. ఎక్కువ దూడలు జన్మించడం ద్వారా మంద ఎక్కువగా, తొందరగా అభివృద్ధి చెందుతుంది.
**గేదెలు:** కృత్రిమ గర్భోత్పత్తికి అంతగా సహకరించవు (30–35% ఉంటుంది). ఆవులతో పోల్చినప్పుడు జాతి అభివృద్ధి తొందరగా జరగదు.

**పాలలో పోషక విలువలు**
**ఆవులు:** వెన్న శాతం 3 నుంచి 5% ఉంటుంది. ఎస్.ఎన్.ఎఫ్. 8.5% ఉంటుంది. విటమిన్ 'ఎ' లభ్యత ఎక్కువ. ప్రత్యేకించి రసగుల్లా, రసమలై, చుంచుం, చనా వంటి స్వీట్స్ తయారు చేస్తారు.
**గేదెలు:** వెన్న శాతం 6 నుంచి 9% ఉంటుంది. ఎస్.ఎన్.ఎఫ్. 9 నుంచి 9.5% ఉంటుంది. విటమిన్ 'ఎ' లభ్యత ఎక్కువ. ప్రత్యేకించి కోవా, పన్నీరు, మలై, కుల్ఫీ, వెన్న, పెరుగు, నెయ్యి తయారు చేస్తారు.



సాక్షి
# భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
13-8-2019

## ఉద్యోగ సమాచారం

### ఎన్ఎఫ్ఎల్‌లో 41 ఖాళీలు

భారత ప్రభుత్వ రంగ మినీరత్న సంస్థ అయిన నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ (ఎన్ఎఫ్ఎల్)..దేశవ్యాప్తంగా సంస్థకు చెందిన యూనిట్లలో ఖాళీగా ఉన్న 41 నాన్ ఎగ్జిక్యూటివ్ (వర్కర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** లోకో ఆపరేటర్ గ్రేడ్ (3)-3, స్టోర్ అసిస్టెంట్ గ్రేడ్ (2)-12, ఆఫీస్ అసిస్టెంట్ గ్రేడ్ (3)-10, లోకో అటెండెంట్ గ్రేడ్ (3)-16.
- **ట్రేడులు:** టర్నర్, ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, మెషిన్ టూల్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్ తదితర పోస్టులున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి పదో తరగతి, సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, ఆగస్టు 31 నాటికి 30 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక:** ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

### డీఐసీలో 10 ఖాళీలు

భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖకు చెందిన న్యూఢిల్లీలోని డిజిటల్ ఇండియా కార్పొరేషన్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టులు:** వెబ్ డిజైనర్, గ్రాఫిక్ డిజైనర్, అప్లికేషన్ డెవలపర్, సైంటిఫిక్ ఆఫీసర్, మల్టీమీడియా ఆర్టిస్ట్, అప్లికేషన్ డెవలపర్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ/బీటెక్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 26, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://digitalindiacorporation.in

### టీఎస్ గురుకులాల్లో 29 ఖాళీలు

తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖకు చెందిన గురుకుల క్రీడా పాఠశాలలు, అకాడమీల్లో.. తాత్కాలిక ప్రాతిపదికన 29 పార్ట్ టైం స్పోర్ట్స్ కోచ్‌ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **క్రీడల వారీ ఖాళీలు:** కబడ్డీ-2, ఆర్చరీ-2, యోగా-1, ఫుట్‌బాల్-2, సాఫ్ట్‌బాల్-2, కోకో-2, వాలీబాల్-2, బాస్కెట్ బాల్-1, వెయిట్ లిఫ్టింగ్-2, హ్యాండ్ బాల్-1, రెజ్లింగ్-1, హాకీ-1, బాక్సింగ్-2, జిమ్నాస్టిక్స్-1, నెట్ బాల్-1, ఫెన్సింగ్-1, అథ్లెటిక్స్-4, లాన్ టెన్నిస్-1.
- **అర్హత:** సంబంధిత క్రీడల్లో ఏడాది డిప్లొమా /6 వారాల కోర్సు ఉత్తీర్ణత. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. (నేరుగా సంబంధిత కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలి).
- **ఇంటర్వ్యూ చివరితేదీ:** ఆగస్టు 26, 2019.
- **హార్డుకాపీ అందజేయడానికి చివరితేదీ:** ఆగస్టు 17, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://tgtwgurukulam.telangana.gov.in




# ఆమెకు మళ్లీ కొలువు

**కార్పొరేట్ ప్రపంచంలో.. మహిళలు ఉద్యోగ సాధనలో పురుషులకు దీటుగా రాణిస్తున్న కాలం ఇది! కంపెనీలు కూడా మహిళా ఉద్యోగులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తున్న వైనం! జండర్ డైవర్సిటీ పేరుతో మహిళలకు పెద్దపీట వేస్తున్న పరిస్థితులు! మరోవైపు.. ఉద్యోగాల్లో చేరి పలు కారణాలతో మధ్యలోనే జాబ్స్ మానేస్తున్న ఉద్యోగినుల సంఖ్య కూడా ఎక్కువే! వీరిలో చాలామంది కొంత విరామం తర్వాత తిరిగి కొలువుల్లో చేరాలని భావిస్తున్నారు. కానీ అందుకు సరైన మార్గాలు తెలియక అవకాశాలను అందుకోలేకపోతున్నారు! ఈ నేపథ్యంలో.. మహిళా ఉద్యోగులు కెరీర్ రీ-స్టార్ట్‌కు మార్గాలు.. నేర్చుకోవాల్సిన నైపుణ్యాలు.. ప్రముఖ కంపెనీల ప్రత్యేక విధానాలపై కథనం...**

- **సౌజన్య..** పదేళ్ల క్రితం బీటెక్ పూర్తవుతూనే క్యాంపస్ సెలక్షన్స్‌లో ఓ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేరారు. నాలుగేళ్లు పని చేశాక వివాహం నిశ్చయం కావడంతో ఉద్యోగం వదులుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు ఆమె ఉద్యోగంలో చేరాలని.. మళ్లీ కెరీర్ ప్రారంభించాలని ఆలోచిస్తున్నారు.
- **శిరీష..**అకడమిక్‌గా ప్రతిభావంతురాలైన ఈమె ఆరేళ్లపాటు ఓ ప్రముఖ సంస్థలో ఉద్యోగం చేసి.. అద్భుతంగా రాణించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా మధ్యలోనే కొలువు వదులుకున్నారు. ఇప్పుడు మళ్లీ కెరీర్ ప్రారంభించాలనుకుంటున్నారు.

... వీళ్లిద్దరూ మాత్రమే కాదు.. డిగ్రీలు పూర్తవుతూనే కొలువులో చేరి.. కొంతకాలం ఉద్యోగం చేసి మానేసిన మహిళల్లో ఎంతోమంది కెరీర్ రీ-స్టార్ట్ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ముఖ్యంగా ఆర్థిక స్వావలంబనతోపాటు తమ నైపుణ్యాలు ఉపయోగపడాలనే ఆలోచనలతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టాలనుకుంటున్నారు. అందుకుతగ్గట్టుగానే కార్పొరేట్ రంగం సైతం వీరికి తిరిగి స్వాగతం పలుకుతోంది.

### కెరీర్ రీ-స్టార్ట్‌కు కంపెనీల చేయూత

- మహిళా ఉద్యోగులు తమ కెరీర్‌ను రీ-స్టార్ట్ చేయడానికి, సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడానికి ప్రస్తుతం అనేక సంస్థలు చేయూతనందిస్తున్నాయి. ఇదివరకే తమ సంస్థల్లో పనిచేసి మానేసిన మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక విధానాలు అనుసరిస్తున్నాయి. ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్ మొదలు సర్వీస్ సెక్టార్ సంస్థల వరకు.. ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తూ తమ పూర్వ ఉద్యోగినులకు ఆహ్వానం పలుకుతున్నాయి. వీటిని కేవలం తమ పూర్వ ఉద్యోగినులకే కాకుండా.. కెరీర్ రీ-స్టార్ట్ చేయాలనుకుంటున్న మహిళలందరికీ అందుబాటులోకి తేవడం విశేషం.

### ప్రముఖ కంపెనీల రీస్టార్ట్ ప్రోగ్రామ్స్

- ప్రముఖ కార్పొరేట్ దిగ్గజం టాటా గ్రూప్.. 'టాటా సెకండ్ కెరీర్' పేరుతో మహిళలు తమ కెరీర్‌ను తిరిగి ప్రారంభించే అవకాశం కల్పిస్తోంది. అదే విధంగా.. యాక్సెంచర్ సంస్థ 'కెరీర్ రీబూట్', క్యాప్ జెమినీ సంస్థ 'కెరీర్ కమ్ బ్యాక్', జీఈ ఇండియా 'రీ-స్టార్ట్', గూగుల్ సంస్థ 'జీకెరీర్', గోల్డ్‌మన్ శాచ్ సంస్థ 'రిటర్న్‌షిప్', యాక్సిస్ బ్యాంక్ 'రీ-కనెక్ట్', గోద్రెజ్ సంస్థ 'కెరీర్ 2.0', హిందుస్థాన్ యూనిలీవర్ సంస్థ 'కెరీర్ బై ఛాయిస్', మహీంద్రా లాజిస్టిక్స్ సంస్థ 'సెకండ్ కెరీర్ ప్రోగ్రామ్స్(ఉడాన్)... వంటి ప్రత్యేక విధానాలతో కెరీర్ రీ-స్టార్ చేయాలనుకుంటున్న మహిళా ఉద్యోగులకు చేయూతనందిస్తున్నాయి.

> పూర్వ ఉద్యోగినులను ప్రోత్సహించేందుకు కంపెనీల ప్రత్యేక విధానాలు
>
> వ్యక్తిగత కారణాలతో కొలువులకు బ్రేక్ ఇస్తున్న మహిళా ఉద్యోగులు
>
> కొంత విరామం తర్వాత కెరీర్ రీ-స్టార్ట్‌కు సిద్ధమవుతున్న వైనం

### ఆరు నెలల నుంచి అయిదు, పదేళ్ల వరకు

కనీసం ఆరు నెలల నుంచి అయిదు, పదేళ్ల వరకూ.. ఉద్యోగం చేసి మానేసిన మహిళలకు ఆయా కంపెనీలు తిరిగి స్వాగతం పలుకుతున్నాయి. గతేడాది నిర్వహించిన ఓ సర్వేలో... 100 బెస్ట్ సంస్థల్లో 9 శాతం నుంచి పది శాతం మంది సెకండ్ ఇన్నింగ్ మహిళా ఉద్యోగులే ఉన్నట్లు స్పష్టమైంది. ఇది మహిళా ఉద్యోగుల కెరీర్ రీ-స్టార్ట్‌కు సంస్థలు అందిస్తున్న చేయూతకు నిదర్శనంగా పేర్కొనొచ్చు. మళ్లీ కొలువులో చేరాలనుకుంటున్న ఉద్యోగినుల కోసం సంస్థలు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాయి. తద్వారా ప్రస్తుతం అనుసరిస్తున్న కొత్త విధానాలు, టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నాయి. ఈ శిక్షణ కార్యక్రమం నెల నుంచి రెండు నెలల వరకు ఉంటుంది.

### జండర్ డైవర్సిటీ

సంస్థలు తమ పూర్వ ఉద్యోగినులను తిరిగి నియమించుకోవడానికి రెండు అంశాలు దోహదం చేస్తున్నాయి. అవి.. జండర్ డైవర్సిటీ, సంస్థ వర్క్ కల్చర్. జండర్ డైవర్సిటీకి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో మహిళా ఉద్యోగులకు తిరిగి అవకాశం కల్పించడం జరుగుతోంది. అదేవిధంగా తమ పూర్వ ఉద్యోగినులను నియమించుకుంటే వారికి సంస్థ పనితీరు, విధి విధానాలపై అవగాహన ఉంటుందని భావిస్తున్నాయి. ఫలితంగా విధి నిర్వహణ పరంగా మెరుగైన పనితీరు కనబరుస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### వర్క్ ఫ్రమ్ హోమ్

పూర్వ ఉద్యోగినులను నియమించుకుంటున్న సంస్థలు.. వారికి వర్క్ ఫ్రమ్ హోమ్, ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ విధానం కూడా కల్పిస్తుండటం గమనార్హం. ప్రధానంగా గతంలో తమ కంపెనీలో పనిచేసి అద్భుతమైన పనితీరు కనబర్చిన మహిళా ఉద్యోగినులకు ఇలాంటి సౌలభ్యం లభిస్తోంది. దీనికి పని పట్ల వారు చూపిన నిబద్ధతే కొలమానంగా నిలుస్తోంది.

### ఉద్యోగాన్వేషణకు మార్గాలు

- కెరీర్‌ను రీ-స్టార్ట్ చేయాలనుకుంటున్న మహిళలకు ఉద్యోగాన్వేషణ పరంగా ఇప్పుడు ఎన్నో మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా ఆన్‌లైన్ జాబ్ పోర్టల్స్ ఇందుకు వేదికగా నిలుస్తున్నాయి. మహిళా ఉద్యోగులు, కెరీర్ రీ-స్టార్ట్ ఔత్సాహికుల కోసం పలు ప్రత్యేక జాబ్ పోర్టల్స్ సైతం అందుబాటులోకి వస్తుండటం విశేషం. వీటిలో.. కొన్ని ముఖ్యమైనవి.. » జాబ్స్ ఫర్ హర్ డాట్ కామ్ » అవ్‌తార్ ఐ విన్, » షీరోస్, » హర్ సెకండ్ ఇన్నింగ్స్, » కాఫీప్లేస్ డాట్ కామ్, » క్వీన్స్.ఇన్, » మైకైండ్ ఆఫ్ జాబ్ డాట్ కామ్. ఇవన్నీ కూడా స్టార్టప్ సంస్థలు. ఇవి కెరీర్ రీ-స్టార్ట్ చేయాలనుకునే మహిళలకు వారి అర్హతలు, అనుభవం ఆధారంగా లభించే ఉద్యోగాల వివరాలు తెలియజేస్తున్నాయి. వీటిలోనే వర్క్ ఫ్రమ్ హోమ్, ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ విధానంలో పని చేసే అవకాశం కల్పించే సంస్థల సమాచారం కూడా అందుబాటులో ఉంది.

### స్టార్టప్ సంస్థలు ముందంజ

మహిళా ఉద్యోగులను తిరిగి నియమించుకోవడంలో స్టార్టప్ సంస్థలు ముందంజలో నిలుస్తున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా సర్వీస్ సెక్టార్, ఎడ్‌టెక్ స్టార్టప్ సంస్థలు, ఈ-కామర్స్ సంస్థల్లో ఈ ధోరణి ఎక్కువగా ఉంది. ఇవి ఆన్‌లైన్ ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తున్నాయి.

### స్వీయ అన్వేషణ సవాలే

కెరీర్ సెకండ్ ఇన్నింగ్ ప్రారంభించాలనుకునే మహిళలకు ఉద్యోగాన్వేషణ సవాలుతో కూడిందే! ముఖ్యంగా వారు ఉద్యోగం మానేసిన తర్వాత తమకు సంబంధించిన విభాగంలో నేటికీ అవగాహన కలిగి ఉన్నారా లేదా? అనే విషయాన్ని సంస్థలు నిశితంగా గమనిస్తున్నాయి. అదే విధంగా గతంలో ఉద్యోగం మానేయడానికి వారు చెబుతున్న కారణాలు వాస్తవమా, కాదా? అనే అంశాన్ని సైతం క్షుణ్నంగా పరిశీలిస్తున్నాయి. వీటికి సంబంధించి సంతృప్తి చెందితేనే సంస్థలు ఆఫర్లు ఇస్తున్నాయి.

### అప్‌డేట్ అవుతుండాలి

కెరీర్ రీ-స్టార్ట్ చేయాలనుకునే మహిళలు అంతకుముందు వరకు తాము చేసిన పని, నిర్వహించిన విధులు వంటి వాటికే పరిమితం కాకుండా.. వాటికి సంబంధించి తాజా పరిణామాలు, జాబ్ మార్కెట్ ట్రెండ్స్‌పై నిరంతర అవగాహన ఏర్పరచుకోవాలి. ఇందుకోసం అవసరమైతే ప్రత్యేక శిక్షణ తీసుకోవడానికి కూడా వెనుకాడకూడదు. ముఖ్యంగా ప్రస్తుతం ఐటీ రంగంలో ఉద్యోగం పరంగా శిక్షణ తప్పనిసరిగా మారింది.

> **అవకాశాలు ఎన్నో**
>
> కొద్ది కాలం బ్రేక్ తీసుకొని.. మళ్లీ కెరీర్ ప్రారంభించాలనుకునే మహిళలకు ఇప్పుడు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. అయితే వారు తమ కెరీర్‌కు బ్రేక్ పడినప్పటి నుంచి ఆయా ఉద్యోగానికి సంబంధించి జరిగిన మార్పులపై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. అప్పుడే కెరీర్ సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడం సులభం అవుతుంది.
>
> – రీతూపర్ణ చక్రవర్తి, కో- ఫౌండర్, టీమ్‌లీజ్

> **ఎన్నో ప్లాట్‌ఫామ్స్**
>
> కెరీర్ రీ-స్టార్ట్ చేయాలనుకునే మహిళలకు ఇప్పుడు ఎన్నో ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా వీరికోసమే ప్రత్యేక సంస్థలు ఏర్పడుతున్నాయి. ఔత్సాహికులు వీటిని వినియోగించుకోవాలి. వీటిలో అవకాశాల గురించి తెలియజేయడమే కాకుండా.. రీ స్కిల్లింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ కూడా అందుబాటులో ఉంటున్నాయి.
>
> – కె.సత్యదీప్, కో-ఫౌండర్, షీరోస్.



### మహిళా ఉద్యోగులు కెరీర్ రీ-స్టార్ట్

- ఐఎల్ఓ గణాంకాల ప్రకారం-గత అయిదేళ్లలో మొత్తం మహిళా ఉద్యోగుల్లో ఉద్యోగం మానేసిన వారి సంఖ్య 40 నుంచి 50 శాతం వరకు ఉంది.
- వీరిలో 60 శాతం మందిలో తిరిగి కెరీర్ ప్రారంభించాలనే ఆసక్తి నెలకొంది.
- ముఖ్యంగా ఐటీ, సైన్స్, రీసెర్చ్ విభాగాల్లో కెరీర్ రీ-స్టార్ట్ ఔత్సాహికుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది.
- మహిళా ఉద్యోగులు కెరీర్ రీ-స్టార్ట్‌కు ఆర్థిక స్వావలంబన, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, తమ నైపుణ్యాలు మరుగున పడకూడదనే ఆలోచన ప్రధానంగా నిలుస్తోంది.

# మెయిన్‌లో.. మార్కుల మార్గం

## ఏపీ గ్రూప్-2

**ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్2 స్క్రీనింగ్ టెస్టు ఫలితాలను కొద్ది రోజుల క్రితమే వెల్లడించింది. మొత్తం 6195 మంది మెయిన్‌కు అర్హత సాధించారు. ఇప్పుడు వీరంతా రెట్టించిన ఉత్సాహంతో మెయిన్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కీలకమైన మెయిన్స్‌లో విజయం సాధించేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ నేపథ్యంలో.. గ్రూప్2 మెయిన్ పరీక్షల్లో విజయం సాధించడమెలాగో తెలుసుకుందాం..**



- » ఆగస్టు 29,30 తేదీల్లో గ్రూప్ 2 మెయిన్ పరీక్షలు
- » ప్రిపరేషన్‌ను వేగవంతం చేసిన అభ్యర్థులు
- » రివిజన్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

### పరీక్ష స్వరూపం

మెయిన్ పరీక్షలను ఈనెల(ఆగస్టు) 29,30 తేదీల్లో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించేందుకే ఏపీపీఎస్సీ సిద్ధమవుతోంది. మెయిన్‌లో మూడు పేపర్లు 450 మార్కులకు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రంలో 150 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. నెగిటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కుల కోత విధిస్తారు.

### పేపర్ 1.. జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ

పేపర్1లో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ అంశాలపై ప్రశ్నలు అడుగుతారు. జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యాంశాలు, కరెంట్ అఫైర్స్, దైనందిన జీవితంలో సైన్స్ అనువర్తనాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో తాజా పరిణామాలు, స్వాతంత్ర్యోద్యమంపై ప్రత్యేక దృష్టితో ఆధునిక భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ చరిత్ర; ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్, జాగ్రఫీ ఆఫ్ ఇండియా(ఏపీ ప్రత్యేక దృష్టి), డిజాస్టర్ మేనేజ్‌మెంట్,ఏపీ పునర్వ్యవస్థీకరణ; డేటా అనాలసిస్; లాజికల్ రీజనింగ్ వంటి మొత్తం 11 టాపిక్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. కోర్ సబ్జెక్టును సమకాలీన అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదువుకోవడం ద్వారా ఈ పేపర్‌లో మంచి స్కోరింగ్‌కు అవకాశముంది.

### పేపర్ 2.. ఆంధ్రప్రదేశ్ చరిత్ర, భారత రాజ్యాంగం

పేపర్ 2లో రెండు ఉప విభాగాలు (పార్ట్1, పార్ట్2) ఉంటాయి. పార్ట్1లో.. ఆంధ్రప్రదేశ్ సామాజిక చరిత్ర, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ సామాజిక, సాంస్కృతిక ఉద్యమాల చరిత్రపై ప్రశ్నలు ఎదురవుతాయి. ఏపీ భౌగోళిక లక్షణాలు, చరిత్ర, సంస్కృతిపై ప్రభావం, శాతవాహనులు, ఇక్ష్వాకులు, సామాజిక-మత పరమైన పరిస్థితులు, సాహిత్యం, సంస్కృతి, కళలు, విష్ణుకుండినులు, వేంగి చాళుక్యులు, తెలుగు భాష, ఐరోపా వాసుల రాక, కంపెనీ పాలనలో ఆంధ్ర, 1857 తిరుగుబాటు-దాని ప్రభావం, సామాజిక చైతన్యం, 1885-1947 మధ్యకాలంలో ఆంధ్రాలో జాతీయోద్యమ వ్యాప్తి, సోషలిస్టులు, కమ్యూనిస్టుల పాత్ర, జమీందారీ వ్యతిరేక ఉద్యమాలు, రైతు ఉద్యమాలు, జాతీయవాద కవిత్వం, విప్లవ సాహిత్యం, నాటక సంస్థలు, మహిళల భాగస్వామ్యం; ఆంధ్రోద్యమం పుట్టుక-వ్యాప్తి, ఆంధ్ర మహాసభల పాత్ర, 1953లో ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులు, వార్తాపత్రికల పాత్ర, గ్రంథాలయోద్యమం; 1956లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం, పెద్దమనుషుల ఒప్పందం, 1956-2014 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సామాజిక, సాంస్కృతిక కీలక పరిణామాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశముంది. ఇందులో స్కోరింగ్‌కు టాపిక్స్ వారీగా ప్రమాణిక పుస్తకాలను ఒకటికి నాలుగుసార్లు చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.

- పార్ట్ 2లో భారత రాజ్యాంగం అంశం ఉంటుంది. ఇందులో » భారత రాజ్యాంగ స్వభావం, భారత ప్రభుత్వ నిర్మాణం-విధులు; » కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య న్యాయ, కార్యనిర్వాహక అధికారాల పంపిణీ, » కేంద్ర, రాష్ట్ర సంబంధాలు, 73, 74 రాజ్యాంగ సవరణలు. » భారతదేశం- రాజకీయ పార్టీలు; భారత్‌లో సంక్షేమ యంత్రాంగంపై ప్రశ్నలు అడుగుతారు. ఇందులో ప్రధానంగా ఆయా సిలబస్ అంశాలపై తాజా పరిణామాలపై దృష్టిపెట్టి నిశితంగా ప్రిపరేషన్ కొనసాగించాలి. మెమరీబేస్డ్ కాకుండా... సబ్జెక్టును అన్ని కోణాల్లో అవగాహన చేసుకోవాలి. అప్పుడే ప్రశ్నను ఏ రీతిలో అడిగినా సమాధానం గుర్తించే సామర్థ్యం సొంతమవుతుంది.

### పేపర్ 3... ప్లానింగ్, ఎకానమీ

పేపర్ 3లో.. భారత ప్రణాళికలు, భారత ఆర్థిక వ్యవస్థ-సమకాలీన సమస్యలు, ఆంధ్రప్రదేశ్‌పై ప్రత్యేక దృష్టితో గ్రామీణ సమాజ అభివృద్ధి అంశాలు ఉన్నాయి. ఈ పేపర్ కోసం » భారత ఆర్థిక వ్యవస్థ-ప్రస్తుత స్థితి, » ఆర్థిక విధానాలు, » వనరులు-అభివృద్ధి, » ద్రవ్యం, బ్యాంకింగ్, పబ్లిక్ ఫైనాన్స్, » జాతీయ ఆదాయం, » ఆంధ్రప్రదేశ్ ఆర్థిక విధానాలు, » ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ-పారిశ్రామిక వృద్ధి, » ఆంధ్రప్రదేశ్‌లో వనరుల అభివృద్ధి తదితర అంశాలపై ప్రధానంగా దృష్టిసారించాలి. ఇందులో మంచి మార్కుల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తాజా ఎకనమిక్ సర్వేలు, బడ్జెట్ ముఖ్యాంశాలపై పట్టు సాధించాలి.

### సమయస్ఫూర్తి

గ్రూప్ 2 మెయిన్‌కు ప్రిపరేషన్ సాగిస్తున్న అభ్యర్థులు సమయస్ఫూర్తితో వ్యవహరించాల్సిన సమయమిది. పరీక్షకు తక్కువ సమయం మాత్రమే అందుబాటులో ఉన్నందున ప్రిపరేషన్ ప్రణాళికను పటిష్టంగా రూపొందించుకోవాలి. విలువైన ఈ సమయాన్ని సాధ్యమైనంత మేర సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పుడు సిలబస్‌లోని ప్రతి అంశాన్ని చదవడం సాధ్యం కాదు. కాబట్టి ఆయా టాపిక్స్‌ను పరీక్ష దృష్ట్యా ప్రాధాన్య క్రమం గుర్తించి సిద్ధమవ్వాలి. ముఖ్యమైన సదరు కీలకాంశాలను ప్రతిరోజు చదివేలా టైం ప్లాన్ సిద్ధం చేసుకోవాలి.

### డిస్క్రిప్టివ్ అప్రోచ్

గ్రూప్2 మెయిన్ పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో జరుగుతుంది. దాంతో అధిక శాతం మంది అభ్యర్థులు బిట్స్ రూపంలో చదువుతున్నారు. ఇది అంతిమంగా ఫలితంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి అభ్యర్థులు డిస్క్రిప్టివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి. ఇలా చేయడం ద్వారా ఒక అంశంపై విభిన్న కోణాల్లో అవగాహన ఏర్పడుతుంది. ప్రశ్న ఏ విధంగా అడిగినా సమాధానం ఇచ్చే సమర్థత లభిస్తుంది. డిస్క్రిప్టివ్ తరహాలో ప్రిపరేషన్ సాగిస్తున్నప్పుడు అభ్యర్థులు ముఖ్యాంశాలను షార్ట్ నోట్స్ రూపంలో రాసుకోవాలి. ఈ విధానం వల్ల రివిజన్‌ను వేగంగా ముగించొచ్చు. ముఖ్యంగా ఎకానమీ, పాలిటీ సబ్జెక్ట్‌ల్లో ఈ తరహా వ్యూహం లాభిస్తుంది.

### సమకాలీన అంశాలు

గ్రూప్ 2 ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు సబ్జెక్టులను సమకాలీన అంశాలతో అనుసంధానిస్తూ చదవడం ఉపయుక్తం. జనరల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకానమీ, పాలిటీ తదితర సబ్జెక్ట్‌లకు ఈ తరహా ప్రిపరేషన్ సాగించాలి. ఆయా విభాగాల్లో సమకాలీన పరిణామాలను తెలుసు కుంటూనే.. వాటికి నేపథ్యంగా సబ్జెక్ట్‌లో పేర్కొన్న అంశాలను అనుసంధానం చేసుకోవాలి.

### ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

అభ్యర్థులు కేవలం ప్రిపరేషన్‌కే పరిమితం కాకుండా.. ఇప్పటివరకు పూర్తిచేసిన అంశాల్లో తమ అవగాహనను విశ్లేషించుకోవాలి. ఇందుకోసం మాక్ టెస్టులకు హాజరుకావాలి. టెస్టుల్లో తాము చేసిన పొరపాట్లను గుర్తించి ఏయే టాపిక్స్‌పై మరింత అవగాహన పెంచుకోవాలో తెలుసుకోవాలి. పేపర్ వారీగా మాక్ టెస్ట్‌లకు హాజరుకావడం విజయావకాశాలను మెరుగుపరుస్తుంది. చదవడానికే పరిమితం కాకుండా.. ప్రాక్టీస్ కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీ, జాగ్రఫీల్లోనూ ప్రాక్టీస్ ఓరియెంటేషన్ మేలు చేస్తుంది. సమాధానాలు గుర్తించేటప్పుడు తార్కికంగా ఆలోచిస్తూ ప్రాక్టీస్ చేయాలి.

### రివిజన్.. రివిజన్

అభ్యర్థులు చివరి పది రోజులను కేవలం రివిజన్‌కే కేటాయించాలి. పోటీ పరీక్షల్లో సక్సెస్ మంత్ర 'రివిజన్' అని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఎంత చదివాం అనే దానికంటే.. చదివింది ఏమేరకు గుర్తుంది అనేది ప్రధానంగా మారింది. బాగా గుర్తుండాలంటే.. ఒక్కో అంశాన్ని కనీసం నాలుగుసార్లు రివిజన్ చేసేలా ప్లాన్ చేసుకోవాలి. రివిజన్ సమయంలోనూ మాక్ టెస్టులు రాసేందుకు ప్రయత్నించాలి. పరీక్ష తేదీకి వారం ముందు నుంచి పూర్తిగా క్విక్ రివిజన్ విధానాన్ని అనుసరించాలి. వివిధ పద్ధతుల్లో రాసుకున్న షార్ట్ నోట్స్‌లు ఉపయోగించుకుంటూ వేగంగా రివిజన్ చేసుకోవాలి.

### ఎగ్జామ్ టిప్స్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, విధానాలపై పట్టు సాధించాలి.
- ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంపై లోతైన అవగాహన అవసరం.
- సబ్జెక్ట్ వారీగా కోర్ అంశాలతోపాటు తాజా పరిణామాలను అధ్యయనం చేయాలి.
- ప్రతి రోజు మూడు పేపర్లు చదివే విధంగా సమయం కేటాయించుకోవాలి.
- డిగ్రీ స్థాయి పుస్తకాల్లోని ముఖ్యాంశాలను తప్పక చదవాలి.
- ఎకానమీ వివిధ సర్వేల గణాంకాలను అధ్యయనం చేయాలి.
- కొత్త మెటీరియల్ జోలికి వెళ్లకుండా చదివిన పుస్తకాలనే మళ్లీ మళ్లీ చదవాలి.
- బేసిక్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. టెస్ట్ సిరీస్‌లు రాయాలి.
- ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ఆత్మవిశ్వాసంతో మెలగాలి.

epaper.sakshi.com

## భారత జట్టు హెడ్ కోచ్ తుది జాబితాలో ఆరుగురు



టీమిండియా చీఫ్ కోచ్ పదవి కోసం క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) కసరత్తు పూర్తి చేసింది. ఎంతో మంది దరఖాస్తు చేసుకోగా ఆరుగురితో తుది జాబితాను సిద్ధం చేసింది. ఇందులో ప్రస్తుత కోచ్ రవిశాస్త్రితో పాటు మైక్ హెసెన్ (న్యూజిలాండ్), టామ్ మూడీ (ఆస్ట్రేలియా), ఫిల్ సిమన్స్ (విండీస్), లాల్‌చంద్ రాజ్‌పుత్, రాబిన్‌సింగ్ (భారత్) ఉన్నారు. త్వరలోనే వీరికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. విశ్వసనీయ వర్గాల ప్రకారం కోహ్లి అండదండలున్న రవిశాస్త్రికే మళ్లీ కోచ్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

## శ్రేయస్ అయ్యర్ బాగా ఆడాడు: కోహ్లి



**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** రెండో వన్డేలో యువ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ బాగా ఆడాడని టీమిండియా కెప్టెన్ కోహ్లి కితాబిచ్చాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం బీసీసీఐ వెబ్‌సైట్ కోసం సహచరుడు యజువేంద్ర చహల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను మాట్లాడుతూ ... 'బ్యాటింగ్ ఆర్డర్‌లో టాప్–3 బ్యాట్స్‌మెన్‌లో ఒకరైనా నిలబడి భారీస్కోరు చేస్తేనే ఇన్నింగ్స్ నిలబడుతుంది. ఓపెనర్లు శిఖర్, రోహిత్ విఫలమవడంతో ఇన్నింగ్స్ బాధ్యత నేను తీసుకున్నా. పిచ్, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా 270 పరుగుల స్కోరు మంచి లక్ష్యమే అనుకున్నాం. ముందుగా బ్యాటింగ్ తీసుకుని మంచి పనే చేశాం. మీరు విండీస్ ఇన్నింగ్స్‌ను గమనిస్తే అదే అర్థమవుతుంది. లక్ష్యఛేదనలో ఆతిథ్య జట్టు తెగ కష్టపడింది. ఆ సమయంలో ఎవరికైనా బ్యాటింగ్ క్లిష్టమే అవుతుంది. హెట్‌మైర్, పూరన్ నిలదొక్కుకుంటున్న సమయంలో వాన పడటం కూడా మాకు కలిసొచ్చింది. ఈ జట్టులో ఎక్కువ మంది ఎడంచేతి బ్యాట్స్‌మెన్ ఉండటం వల్లే చహల్‌ను కాదని కుల్దీప్‌ను తీసుకున్నాం. ఈ ఎత్తుగడ కూడా మమ్మల్ని గెలిపించేందుకు దోహదపడింది' అని అన్నాడు.

వర్షం, బ్రేక్ సమయంలో తన డ్యాన్సింగ్‌పై మాట్లాడుతూ 'విండీస్ సంగీతం వినపడగానే నా రెండు కాళ్లు ఆగవు. చిందులేసేందుకు ఉత్సాహం చూపిస్తాయి. ఆట విరామంలో ఈ సరదా కూడా ఉత్సాహపరుస్తుంది' అని అన్నాడు.

## వారియర్స్‌తో 'టై'టాన్స్

### గెలవాల్సిన మ్యాచ్‌ను టైగా ముగించిన తెలుగు టైటాన్స్



**అహ్మదాబాద్:** గుజరాత్‌పై విజయంతో ఇక తెలుగు టైటాన్స్ గాడిలో పడిందని అనుకుంటే... ఆ దూకుడు కేవలం ఒక విజయానికి మాత్రమే పరిమితమైంది. సోమవారం బెంగాల్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌ను టైటాన్స్ 29–29తో 'టై' చేసుకుంది. ఈ సీజన్‌లో టైటాన్స్‌కిది రెండో 'టై' కావడం విశేషం. ఆట ఆరంభంలోనే సిద్ధార్థ్ దేశాయ్ తన రైడ్‌తో పాయింట్ తెచ్చి జట్టు ఖాతా తెరిచాడు. మ్యాచ్ మొదటి భాగంలో ప్రత్యర్థి నుంచి పోటీ ఎదురవడంతో తెలుగు టైటాన్స్ 13–11తో స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. అయితే రెండో అర్ధ భాగం ఆరంభమైన కాసేపటికే ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేసిన టైటాన్స్ 17–12తో ఆధిక్యంలోకెళ్లింది. అయితే ఆధిక్యంలో ఉన్నామన్న అతివిశ్వాసం జట్టును దెబ్బతీసింది. ప్రతి రైడర్‌ను పట్టేయాలని డిఫెండర్ విశాల్ భరద్వాజ్ చూపించిన అనవసరపు దూకుడు అతడిని పలుమార్లు కోర్టును వీడేలా చేసింది. అప్పటి వరకు నిలకడగా రాణించిన సిద్ధార్థ్ దేశాయ్, సూరజ్ దేశాయ్‌ల రైడింగ్ లయ తప్పడంతో ప్రత్యర్థులకు సులభంగా దొరికిపోయారు. ఒక్కో పాయింట్ సాధిస్తూ వచ్చిన వారియర్స్ టైటాన్స్‌ను ఆలౌట్ చేసి 23–21తో ఆధిక్యంలోకెళ్లింది. అయితే చివర్లో పుంజుకున్న టైటాన్స్ స్కోర్‌ను సమం చేసి ఊపిరి పీల్చుకుంది. టైటాన్స్ రైడర్ సూరజ్ దేశాయ్ 7 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధ జట్టు 35–33తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. యూపీ రైడర్ పవన్ శెరావత్ అటు రైడింగ్‌లో, ఇటు ప్రత్యర్థిని పట్టేయడంలోనూ చెలరేగాడు. మొత్తం 15 పాయింట్లు (6 రైడ్, 3 టాకిల్, 6 బోనస్)తో జట్టుకు ఒంటి చేత్తో విజయాన్ని అందించాడు. *నేడు ప్రొ కబడ్డీ లీగ్‌లో విశ్రాంతి దినం. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధతో హరియాణా స్టీలర్స్; గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.*

# భువీ... పడగొట్టేశాడు

**వన్డే సిరీస్‌లోనూ భారత్ ఆధిపత్యం మొదలైంది. బ్యాటింగ్‌లో కోహ్లి, శ్రేయస్ అయ్యర్ భారత్ స్కోరుకు బాటలు వేయగా... భువనేశ్వర్ తన పేస్‌తో విండీస్ ఇన్నింగ్స్‌ను కూల్చేశాడు. కుల్దీప్ స్పిన్‌తో ఇబ్బంది పెట్టాడు. దీంతో వాన అంతరాయం కలిగించినా... టీమిండియా విజయాన్ని అడ్డుకోలేకపోయింది.**

- 210కే కుప్పకూలిన విండీస్
- రెండో వన్డేలో కోహ్లి సేన జయభేరి
- రేపు ఆఖరి వన్డే



భువనేశ్వర్‌కు సహచరుల అభినందన

ఆఖరి వన్డే రేపు ఇక్కడే జరుగుతుంది.

**పోర్ట్ ఆఫ్ స్పెయిన్:** కరీబియన్ గడ్డపై ఇక ఈ వన్డే సిరీస్ కూడా భారత్ కోల్పోదు. ఆఖరి మ్యాచ్‌లో ఓడినా సమమైనా చేసుకుంటుంది కానీ... చేజార్చుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే రెండో వన్డేలో భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 59 పరుగుల తేడాతో వెస్టిండీస్‌పై గెలుపొందింది. దీంతో 1–0తో సిరీస్‌లో ఆధిక్యంలోకి వచ్చింది. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ (4/31) ధాటికి వర్షం అడ్డుపడిందేమోగానీ... ప్రత్యర్థి శిబిరం నుంచి ఏ ఒక్క బ్యాట్స్‌మెన్ ఎదురుపడలేదు. భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారు జామున ముగిసిన ఈ మ్యాచ్‌లో మొదట టీమిండియా 50 ఓవర్లలో 7 వికెట్లకు 279 పరుగులు చేసింది. కోహ్లి (125 బంతుల్లో 120; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించగా, అయ్యర్ (68 బంతుల్లో 71; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వర్షం అంతరాయం కలిగించడంతో వెస్టిండీస్ లక్ష్యాన్ని 46 ఓవర్లలో 270 పరుగులకు కుదించారు. కానీ విండీస్ మాత్రం ఆ ఓవర్లదాకా ఆడలేకపోయింది. 42 ఓవర్లలో 210 పరుగులకే ఆలౌటైంది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (2/59) తిప్పేయగా, షమీ (2/39) ఆఖరి స్పెల్‌తో ముగించాడు. శతక్కొట్టిన కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి వన్డే వర్షార్పణమవగా...

### లూయిస్ ఒక్కడే...

గేల్, షై హోప్, నికోలస్ పూరన్, బ్రాత్‌వైట్ లాంటి హిట్టర్లున్న జట్టుకు సొంతగడ్డపై 270 పరుగుల లక్ష్యం కష్టమే కాదు. కానీ పూరన్ మినహా ఇంకెవరూ కష్టపడలేదు. 300 వన్డే ఆడుతున్న గేల్ (11) విఖ్యాత బ్యాట్స్‌మన్ లారా (10,348) అత్యధిక పరుగులు చేసిన విండీస్ బ్యాట్స్‌మన్ ఘనతను 10,353 పరుగులతో తన పేర లిఖించుకున్నాడు. కానీ ఆటలో విఫలమయ్యాడు. హోప్ (5), హెట్‌మైర్ (18), చేజ్ (18) కూడా చేతులెత్తేశారు. ఓపెనర్ ఎవిన్ లూయిస్ (80 బంతుల్లో 65; 8 ఫోర్లు, 1 సిక్స్), పూరన్‌తో కలిసి పోరాడాడు. ఇద్దరు నాలుగో వికెట్‌కు 56 పరుగులు జోడించారు. ఒక దశలో విండీస్ 148/3 స్కోరు వద్ద పటిష్టంగా కనిపించింది. కానీ అదే స్కోరు వద్ద లూయిస్... కుల్దీప్ స్పిన్‌లో చిక్కుకున్నాడు. పూరన్‌ను భువీ ఔట్ చేయడంతో 179 పరుగుల వద్ద ఐదో వికెట్‌ను కోల్పోయింది. ఆ తర్వాత విండీస్ చకాచకా వికెట్లను కోల్పోయి లక్ష్యానికి దూరమైంది. మిగతా సగం వికెట్లు కేవలం 31 పరుగుల వ్యవధిలోనే పడటంతో విండీస్ 210 స్కోరు వద్ద ఆలౌటైంది. బ్రాత్‌వైట్ (0), కీమర్ రోచ్ (0) డకౌటయ్యారు. జట్టు స్కోరును 200 పరుగులు దాటించాకా కాట్రెల్ (17), థామస్ (0)లను షమీ ఒకే ఓవర్లో ఔట్ చేయడంతో విండీస్ ఇన్నింగ్స్ ముగిసింది.

### స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** 279/7; **వెస్టిండీస్ ఇన్నింగ్స్:** గేల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) భువనేశ్వర్ 11; లూయిస్ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 65; హోప్ (బి) అహ్మద్ 5; హెట్‌మైర్ (సి) కోహ్లి (బి) కుల్దీప్ 18; పూరన్ (సి) కోహ్లి (బి) భువనేశ్వర్ 42; చేజ్ (సి అండ్ బి) భువనేశ్వర్ 18; హోల్డర్ (నాటౌట్) 13; బ్రాత్‌వైట్ (సి) షమీ (బి) జడేజా 0; రోచ్ (బి) భువనేశ్వర్ 0, కాట్రెల్ (సి) జడేజా (బి) షమీ 17; థామస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షమీ 0; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (42 ఓవర్లలో ఆలౌట్) 210**

**వికెట్ల పతనం:** 1–45, 2–52, 3–92, 4–148, 5–179, 6–179, 7–180, 9–209, 10–210.

**బౌలింగ్:** భువనేశ్వర్ 8–0–31–4, షమీ 8–0–39–2, అహ్మద్ 7–0–32–1, కుల్దీప్ 10–0–59–2, జాదవ్ 5–0–25–0, జడేజా 4–0–15–1.

### పొదుపుగా బౌలింగ్ చేద్దామనుకుంటే...

నేను బౌలింగ్‌కు వచ్చినపుడు ఒకటే ఆలోచించా... డాట్ బాల్స్ వేయాలని, పొదుపుగా బౌలింగ్ చేయాలని..! కానీ అనూహ్యంగా వికెట్లు కూడా దక్కడం ఆనందాన్నిచ్చింది. నిజానికి నేనసలు మ్యాచ్ ఫలితంపై ఆలోచించలేదు. అయితే ఒకట్రెండు వికెట్లు తీస్తే గెలుపుదారిన పడతామనిపించింది. భారత్ బ్యాటింగ్‌లో కెప్టెన్ కోహ్లి సెంచరీ కూడా లక్ష్యాన్ని కాపాడుకునేందుకు దోహదం చేసింది. వాన చినుకులు పడటంతో పరుగులు చేయడం అంత సులభం కాదనిపించింది. ఇదే విషయాన్ని కోహ్లి మాకు చెప్పాడు. చేజ్‌ను రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేయడం అద్భుతమైన అనుభూతినిచ్చింది. నేను క్యాచ్‌కు ప్రయత్నించాను, కానీ చేతికందుతుందని అస్సలనుకోలేదు. ఈ సిరీస్‌లో ఆధిక్యంలో నిలిచిన మేం తదుపరి మ్యాచ్ గెలిచి సిరీస్ గెలుచుకుంటాం. *–భారత పేసర్ భువనేశ్వర్*

## నాలుగో స్థానానికి అయ్యరే సరైనోడు

### సునీల్ గావస్కర్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** భారత మిడిలార్డర్‌లో సమస్యగా మారిన నాలుగో స్థానానికి శ్రేయస్ అయ్యర్ సరిగ్గా సరిపోతాడని భారత దిగ్గజ క్రికెటర్, వ్యాఖ్యాత సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. రిషభ్ పంత్‌ను నాలుగో స్థానంలో ఆడించడం కంటే అయ్యర్‌ని ఆడిస్తేనే జట్టుకు ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని ఆయన విశ్లేషించారు. జట్టు మేనేజ్‌మెంట్ నాలుగో స్థానాన్ని శాశ్వతంగా అయ్యర్‌కు కేటాయించాలని గావస్కర్ సూచించారు. 'నా దృష్టిలో పంత్ ధోనిలా ఫినిషర్... అతనికి ఐదు లేదా ఆరో స్థానాన్ని కేటాయిస్తే మంచిది. కానీ అయ్యర్ అలా కాదు ఇన్నింగ్స్‌ను నిర్మించగలడు. అందుకోసం అయ్యర్‌కు... భారత్‌ను చాలా కాలం నుంచి వేధిస్తోన్న నాలుగో స్థానాన్ని కేటాయిస్తే మంచిది' అని గావస్కర్ అభిప్రాయపడ్డారు.

# సంధి దశలో సఫారీలు

- 16 నెలల్లో నలుగురు కీలక ఆటగాళ్ల రిటైర్మెంట్
- బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ పెద్ద దెబ్బ
- టెస్టు చాంపియన్‌షిప్ ముంగిట కష్టాలు
- కొత్త తరం నిలదొక్కుకుంటేనే దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు మనుగడ

సాక్షి క్రీడా విభాగం




**ఒక్కొక్కరుగా దిగ్గజాల రిటైర్మెంట్, ఫిట్‌నెస్ సమస్యలు, బోర్డు పాలన వైఫల్యాలతో దక్షిణాఫ్రికా క్రికెట్ ప్రమాణాలు క్రమంగా పడిపోతున్నాయి. గతేడాది సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో సిరీస్ వరకు ఫర్వాలేదనిపించిన ఆ జట్టు అనంతరం డీలా పడిపోయింది. ఆఖరికి శ్రీలంకకు టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. ఇక వన్డే ప్రపంచ కప్‌లో వారి వైఫల్యం దీనికి పరాకాష్ట. ప్రతిభావంతులను గౌరవించకపోవడం, సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోలేకపోవడం... ఇలా అనేక తప్పిదాలతో ప్రొటీస్ పరిస్థితి దిగజారింది. తక్షణమే దిద్దుబాటు చర్యలు లేకుంటే మరింతగా పతనమయ్యే ప్రమాదమూ ఉంది.**

పేరుకు 12 జట్లున్నా... ప్రస్తుతం టెస్టు హోదా ఉన్న దేశాల్లో బలమైనవని చెప్పుకోదగ్గవి ఆరే! అవి... భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్. వీటిలోనూ విండీస్ ఆట మూడు దశాబ్దాలుగా అనిశ్చితం. ఇప్పుడు దక్షిణాఫ్రికా రూపంలో మరో జట్టు తీవ్ర కష్టాల్లో ఉంది. మేటి అనదగ్గ ఆటగాళ్లు ఒకరివెంట ఒకరు నిష్క్రమిస్తుండటంతో సఫారీలు నడి సంద్రంలో చుక్కాని లేని నావలా మిగిలారు. విధ్వంసక ఏబీ డివిలియర్స్‌తో మొదలైన రిటైర్మెంట్‌ల పరంపర... నిలకడకు మారుపేరైన హాషీమ్ ఆమ్లా వరకు వచ్చింది. వీరిద్దరి మధ్యలో ప్రధాన పేసర్లు మోర్నీ మోర్కెల్, డేల్ స్టెయిన్ వీడ్కోలు పలకడం ప్రొటీస్‌ను మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ఇప్పుడా జట్టులో మిగిలిన నాణ్యమైన ఆటగాళ్లు కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్, వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్ మాత్రమే. మిగతా వారిలో కొందరు అంతర్జాతీయ క్రికెట్‌లో తమ ముద్ర వేసే దిశలో ఉండగా... ఇంకొందరు ఉనికి చాటుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. పూర్తిగా సంధి కాలం అనదగ్గ ఇలాంటి దశను అధిగమించేందుకు దక్షిణాఫ్రికా బోర్డు గట్టి చర్యలు చేపట్టకుంటే... ఆ జట్టు ఓ సాధారణమైనదిగా మిగిలిపోవడం ఖాయం.

### రెండు, మూడేళ్లయినా ఆడగలిగినవారే!

తమ దిగ్గజ ఆటగాళ్లు అర్ధంతర రిటైర్మెంట్ గురించి ఆలోచిస్తున్నారంటే ఏ దేశ క్రికెట్ బోర్డయినా ఏం చేస్తుంది? తక్షణమే సంప్రదింపులు జరిపి, వారి సేవలు ఎంత కీలకమో వివరించి నిర్ణయాన్ని కొన్నాళ్లు వాయిదా వేసుకునేలా చేయడమో, మూడు ఫార్మాట్లలో వారి సేవలు ఎక్కడ ఎక్కువ అవసరమో అక్కడ తగిన విధంగా వాడుకునేలా చేయడమో చేస్తుంది. కానీ, దక్షిణాఫ్రికా బోర్డు ఇలాంటి చొరవేదీ చూపుతున్నట్లు లేదు. డివిలియర్స్ ఉదంతమే దీనికి పక్కా నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి మైదానంలోనైనా రాణించగలిగే అతడు గతేడాది ఏప్రిల్‌లో అనూహ్యంగా అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికి అందరినీ ఆశ్చర్యపర్చాడు. అప్పటికి ఏబీ వయసు 34 ఏళ్లే. తన ఫామ్‌ను అంతకుమించిన ఫిట్‌నెస్‌ను చూస్తే కనీసం రెండేళ్లయినా మైదానంలో మెరుపులు మెరిపించగల స్థితిలో ఉన్నాడు. అయితే, ఆస్ట్రేలియాతో 2018 మార్చి 30న జొహన్నెస్‌బర్గ్‌లో ప్రారంభమైన టెస్టు తర్వాత ఇక ఆడనంటూ తప్పుకొన్నాడు. ఇదే టెస్టుతో, అంతకుమందే ప్రకటించిన మేరకు పేసర్ మోర్నీ మోర్కెల్ బై బై చెప్పాడు. ఆ సమయంలో అతడికి 33 ఏళ్లే. గాయాలు వేధిస్తున్నాయని అనుకున్నా... మోర్కెల్ మరీ ఫామ్ కోల్పోయి ఏమీ లేడు. పెద్ద జట్లతో సిరీస్‌లైనా ఆడేలా అతడిని ఒప్పించలేకపోయారు. మోర్కెల్ లేని లోటు ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వదేశంలో శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో తెలిసొచ్చింది. చరిత్రలో తొలిసారిగా దక్షిణాఫ్రికా... లంకకు టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. ఇక 36 ఏళ్ల స్టెయిన్‌ది మరో కథ. ప్రపంచ స్థాయి బౌలర్ అయిన అతడు వరుసగా గాయాలతో సతమతం అవుతున్నాడు. ఈ క్రమంలో టెస్టులకు రాం రాం చెప్పాడు. దీంతో ఇద్దరు ఫ్రంట్‌లైన్ పేసర్ల సేవలను కోల్పోయినట్టైంది. మరో ప్రధాన పేసర్ వెర్నాన్ ఫిలాండర్ అద్భుత బౌలరే. అయితే, 34 ఏళ్లు దాటిన అతడు గాయాలతో కొంతకాలంగా ప్రధాన స్రవంతి క్రికెట్‌లో లేడు. తాజాగా హాషీమ్ ఆమ్లా రిటైర్మెంట్‌తో దక్షిణాఫ్రికా మరో స్టార్ ఆటగాడిని కోల్పోయినట్టైంది. వాస్తవానికి 36 ఏళ్ల ఆమ్లా విరమణపై ఊహాగానాలు ఉన్నా... కనీసం ఇంకో ఏడాదైనా టెస్టుల వరకు ఆడతాడని భావించారు. అతడు మాత్రం మూడు ఫార్మాట్లకు అస్త్రసన్యాసం చేశాడు.

### టెస్టు చాంపియన్‌షిప్‌లో ఎలాగో...

బ్యాటింగ్, బౌలింగ్‌లో మూలస్తంభాలైన నలుగురి రిటైర్మెంట్‌తో ప్రస్తుతం దక్షిణాఫ్రికా ఎదుర్కోనున్న అసలు సవాలు టెస్టు చాంపియన్‌షిప్. ఆ జట్టు చాంపియన్‌షిప్‌లో 16 టెస్టులు ఆడనుంది. వీటిలో వచ్చే జనవరి లోపు భారత్ (3), ఇంగ్లండ్ (4 సొంతగడ్డపై)లతోనే ఏడు టెస్టులున్నాయి. విండీస్, పాక్, లంకలతోనూ రెండేసి ఆడాల్సి ఉంది. చివరగా ఆస్ట్రేలియాతో 3 టెస్టుల్లో తలపడుతుంది. బౌలింగ్‌లో రబడ మినహా ఇంకెవరిపైనా ఆశలు లేని నేపథ్యంలో డు ప్లెసిస్, డికాక్‌లకు తోడు ఓపెనర్ మార్క్‌రమ్, ఎల్గర్ సత్తా చాటితేనే సఫారీలు కనీసం పోటీ ఇవ్వగలరు.

### పెద్దరికం లేని బోర్డు...

దూరదృష్టి లేని క్రికెట్ సౌత్ ఆఫ్రికా (సీఎస్ఏ) తీరే ప్రస్తుత పరిస్థితికి కారణం. ఆటగాళ్లు, బోర్డు అధికారుల మధ్య సత్సంబంధాలు లేవు. వన్డే ప్రపంచ కప్ వంటి ప్రతిష్టాత్మక టోర్నీ ముందుండగా రిటైర్మెంట్ ప్రకటించిన డివిలియర్స్‌కు నచ్చజెప్పి ఆపే పెద్దరికం, కప్‌నకు తుది జట్టును ప్రకటించే సమయంలో తిరిగొస్తానన్న అతడిని తీసుకునే విశేష చొరవ ఎవరికీ లేకపోయింది. గాయాలతో ఉన్న స్టెయిన్‌ను జాగ్రత్తగా కాపాడుకునే వ్యూహం, ఆమ్లాను కొన్నాళ్లు ఆగేలా చేసే ప్రయత్నమూ వారిలో కొరవడింది. వన్డేలు, టి20ల కంటే స్టెయిన్ టెస్టుల్లోనే దక్షిణాఫ్రికాకు ఎక్కువ అవసరం. కానీ, అతడు టెస్టులకే రిటైర్మెంట్ ఇచ్చాడు. ఇక్కడా బోర్డు నిష్క్రియాపరత్వం కనిపిస్తోంది. ఇప్పుడు సీఎస్ఏ... ఫుట్‌బాల్ తరహాలో జట్టుకు మేనేజర్‌ను నియమించి అతడే కోచింగ్ సిబ్బందిని, కెప్టెన్‌ను ఎంపిక చేసేలా కొత్త విధానం తీసుకురావాలని చూస్తోంది. ప్రధాన కోచ్ గిబ్సన్, సహాయ సిబ్బంది కాంట్రాక్టు కూడా ముగియనుంది. వచ్చేవారైనా దేశంలో ప్రతిభావంతులైన క్రికెటర్లను వెలికితీసి బాధ్యతలను సమర్థంగా నెరవేరిస్తేనే ప్రొటీస్ జట్టు పటిష్టంగా ఉంటుంది.

## 'మాంట్రియల్ మాస్టర్' నాదల్

### కెరీర్‌లో 35వ మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన స్పెయిన్ స్టార్





బియాంక

**టొరంటో (కెనడా):** మాంట్రియల్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టైటిల్‌ను స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ సొంతం చేసుకున్నాడు. ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ డానిల్ మెద్వెదేవ్ (రష్యా)తో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాదల్ 6–3, 6–0తో గెలిచాడు. తద్వారా తన ఖాతాలో రికార్డుస్థాయిలో 35వ మాస్టర్స్ సిరీస్ టైటిల్‌ను జమ చేసుకున్నాడు. విజేత నాదల్‌కు 10,49,040 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 7 కోట్ల 48 లక్షలు)తోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఇదే టోర్నీ మహిళల సింగిల్స్ టైటిల్‌ను 19 ఏళ్ల బియాంక ఆండ్రెస్కూ (కెనడా) గెల్చుకుంది. బియాంకతో జరిగిన ఫైనల్లో అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ వెన్ను నొప్పి కారణంగా మధ్యలోనే వైదొలిగింది. అప్పటికి బియాంక తొలి సెట్‌లో 3–1తో ఆధిక్యంలో ఉంది. విజేత బియాంకకు 5,21,530 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 కోట్ల 71 లక్షలు)తోపాటు 900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
చీఫ్ మ్యూజియం ఆఫీసర్ కార్యాలయం,
శ్రీ వెంకటేశ్వర మ్యూజియం, తిరుమల / తిరుపతి

**టెండర్ నోటీసు**

చీఫ్ మ్యూజియం ఆఫీస్ కార్యాలయం, SV మ్యూజియం, TTD, తిరుమల / తిరుపతి వద్ద ఒక సంవత్సర కాంట్రాక్ట్ కాలానికి ఇంతకు ముందు నియమించిన గైడ్ లెక్చరర్స్ మరియు అన్‌స్కిల్డ్ వర్కర్స్ (గ్యాలరీ అటెండర్స్)కు వేతనాలు చెల్లింపు మరియు ఖాళీలను పెంచుటకు **(హిందూ కమ్యూనిటీ మాత్రమే)** అవుట్ సోర్సింగ్ మ్యాన్‌పవర్ సరఫరా కొరకు ప్రముఖ / అనుభవం గల (అవుట్‌సోర్సింగ్ పర్సన్స్ సరఫరాలో కనీసం 3 సంవత్సరాలు అనుభవం) అవుట్ సోర్సింగ్ మ్యాన్‌పవర్ ఏజెన్సీల నుండి AP ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫాం ద్వారా చీఫ్ మ్యూజియం ఆఫీసర్, T.T.D, తిరుమల వారు ఇ–టెండర్లు కోరుతున్నారు. టెండర్‌దారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నుండి లేబర్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలి. బిడ్లను TTD వెబ్‌సైట్ www.tirumala.org నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పని వివరాల కొరకు https://tender.ape-procurement.gov.in (లేదా) https://www.apeprocurement.gov.in కు లాగాన్ అవ్వండి. **బయానా : రూ. 1,09,556.00** (రూపాయలు ఒక లక్ష తొమ్మిది వేల ఐదు వందల యాభై ఆరు మాత్రమే)

1.) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : **14.08.2019, ఉ.10.30గం.కు.**
2.) బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది : **27.08.2019 మ.03.00గం.కు**
3.) బిడ్ల స్వీకరించు చివరి తేది మరియు సమయం : **27.08.2019 సా.5.00గం.కు**
4.) టెక్నికల్ బిడ్ తెరుచు తేది మరియు సమయం : **28.08.2019 ఉ.10.30గం.కు**
5.) ధర బిడ్ తెరుచు తేది మరియు సమయం : **29.08.2019 ఉ.10.30గం.కు**

ఏ కారణం తెలియజేయకుండా ఏదేని లేదా అన్ని టెండర్లు తిరస్కరించు హక్కు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, TT దేవస్థానములు, తిరుపతి వారు కలిగి ఉన్నారు.

**Roc. No.PR4/13909/Adv.No.202/PRO/2019, Dt: 12.08.2019** ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

భారత ప్రభుత్వం
**అణుశక్తి శాఖ**
**న్యూక్లియర్ ఫ్యూయెల్ కాంప్లెక్స్**
ISO సెల్ & ఇన్సినిరేషన్
ECIL పోస్ట్, హైదరాబాద్ - 500062

**టెండరు కోరుతూ ప్రకటన**
**టెండరు నోటీసు నం: NFC/Inc/PT/01/2018**

దిగువ తెలిపిన పని కొరకు మంచి అనుభవం గల కాంట్రాక్టర్ల నుండి DCE (FT, M-ZFG, EPC, HPU, ISO & HR) వారు భారత రాష్ట్రపతి తరపున సీల్డ్ టెండర్లు కోరుతున్నారు.

| పని వివరణ | అంచనా వ్యయం (రూ.) | బయానా (రూ.) | కాంట్రాక్ట్ కాలం | టెండర్ డాక్యుమెంట్ జారీ | టెండర్ దాఖలుకు చివరి తేది | సీల్డ్ టెండర్లు తెరుచు తేది |
|---|---|---|---|---|---|---|
| యాష్‌ను బ్రిక్స్ / పాట్స్‌లోకి మార్చుట | 11,80,000 | 23,600 | పని ప్రారంభ తేది నుండి 12 నెలలు | 13.08.2019 నుండి 22.08.2019 వరకు | 29.08.2019 1400 గం.వరకు | 29.08.2019 1430 గం.కు |

తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ **www.nfc.gov.in** ను దర్శించండి.



ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో చేతిలో బల్లెం పట్టుకుని నడుస్తున్న ప్రధాని మోదీ



బేర్‌తో కలిసి తెప్పపై నదిని దాటుతున్న ప్రధాని



ఏనుగు పేడను పరిశీలిస్తున్న బేర్, ప్రధాని మోదీ

# మోదీ వర్సెస్ వైల్డ్

- సాహసికుడు బేర్ గ్రిల్స్‌తో కలిసి మోదీ సాహసాలు
- గ్రిల్స్‌తో కలిసి బల్లెం తయారీ.. తెప్పపై ప్రయాణం
- యువతకు కీలక సందేశం ఇచ్చిన ప్రధాని మోదీ
- డిస్కవరీ గ్రూప్ ఛానళ్లలో ప్రసారమైన సాహసయాత్ర

**డెహ్రాడూన్:** ప్రముఖ సాహస యాత్రికుడు బేర్ గ్రిల్స్(45) ప్రధాని మోదీతో కలిసి ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో సాహస యాత్ర చేపట్టారు. బెంగాల్ పులులు, మొసళ్లు, విషసర్పాల మధ్య ఎలా మనుగడ సాగించాలో గ్రిల్స్ మోదీకి వివరించారు. ఈ సందర్భంగా తన బాల్యం, ఎదుర్కొన్న కష్టాలు, రాజకీయ జీవితంపై పలు ఆసక్తికర అంశాలను ప్రధాని ఆయనతో పంచుకున్నారు. ప్రకృతిలో మమేకమై ఎలా జీవించాలో వివరించారు. పులుల అడుగుజాడల్ని చూసుకుంటూ వీరిద్దరూ హిమాలయాల్లోని ఓ నదిని తెప్పపై దాటారు. 'మ్యాన్ వర్సెస్ వైల్డ్' కార్యక్రమంలో భాగంగా చిత్రీకరించిన ఈ సాహస యాత్ర సోమవారం డిస్కవరీ గ్రూప్ ఛానళ్లలో ప్రపంచవ్యాప్తంగా 180కిపైగా దేశాల్లో ప్రసారమైంది. ఈ సందర్భంగా మోదీ, గ్రీల్స్ మధ్య సాగిన ఆసక్తికర సంభాషణ ఇదే..

**బేర్ గ్రిల్స్: జిమ్ కార్బెట్ ఫేమస్ కదా సార్?**

**మోదీ:** అవును ఇది ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం. వృక్షాలపై అధ్యయనం చేయాలనుకునేవారికి ఇక్కడుండే వందలాది రకాల చెట్లు ఉపయోగపడతాయి. పర్వతాలు, నదులతో పాటు అడవి జంతువులు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. భారత్ భిన్నత్వంలో ఏకత్వం సాధించిన దేశం. 100 భాషలు, 1,600 యాసలు ఇక్కడ ఉన్నాయంటే భారత్‌లో ఏ స్థాయిలో భిన్నత్వం ఉందో మీరే అర్థం చేసుకోండి.

**ఈ ప్రాంతం ప్రమాదకరమని భావిస్తున్నారా?**

ప్రకృతిని మనమెప్పుడూ ప్రమాదకరంగా భావించకూడదు. ప్రకృతితో పోరాడితే అన్ని సమస్యలే ఎదురవుతాయి. అదే ప్రకృతికి అనుగుణంగా కలిసిజీవిస్తే క్రూరమృగాలు కూడా సహకరిస్తాయి.

**మోదీజీ.. చిన్నప్పుడు మీరు మంచి స్టూడెంటా?**

మంచి స్టూడెంటా? కాదా? అని అంటే చెప్పలేను.

**ఇప్పుడు మీరు స్టైలిష్ దుస్తులు ధరిస్తున్నారు. చిన్నప్పుడూ ఇంతేనా?**

చిన్నప్పుడు నేను సామాన్యంగానే జీవించా. మురికి బట్టలే వేసుకున్నా. కానీ స్కూలుకు వెళ్లేటప్పుడు మాత్రం శుభ్రమైన యూనిఫాంను వేసుకెళ్లేవాడిని. అందుకోసం నిప్పు కణికలను ఓ రాగి చెంబులో వేసి యూనిఫాంను ఇస్త్రీ చేసుకునేవాడిని. స్కూలు అయిపోయాక పాకెట్ మనీ కోసం నాన్నతో కలిసి రైల్వేస్టేషన్ దగ్గర టీ అమ్మేవాడిని. అలా రైల్వేలు నా జీవితంలో కీలకపాత్ర పోషించాయి. మా ప్రాంతంలో మంచు కురిశాక దానిపై ఉప్పులాంటి పొర ఏర్పడేది. దాన్ని జాగ్రత్తగా సేకరించి దాచి పెట్టుకునేవాళ్లం. స్నానం సమయంలో ఆ ఇసుకనే వాడేవాళ్లం. వేడి నీటిలో ఈ ఇసుక వేసి బట్టలను ఉతికేవాళ్లం.

**మీరు చిన్నప్పుడు హిమాలయాలకు వెళ్లారట?**

అప్పుడు నా వయసు 17–18 సంవత్సరాలు ఉంటుంది. నేను ఇల్లు వదిలేశా. ప్రపంచాన్ని చూడాలనుకున్నా. హిమాలయాలకు వెళ్లగానే అక్కడి ప్రకృతి నచ్చింది. అక్కడే రుషులను కలుసుకున్నాను. అక్కడి మనుషుల మధ్య గడపడం అద్భుతమైన అనుభవం. అప్పటి శక్తే నన్ను ఇంకా నడిపిస్తోంది. నేను కలుసుకున్న రుషులంతా చాలా నిరాడంబరంగా ఉన్నారు. వాళ్లు ఒక్క కార్బన్ వ్యర్థాన్ని కూడా వదిలిపెట్టలేదు. ఈ సందర్భంగా మా నాన్న గురించి చెప్పాలి. మా ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా వర్షాలు పడినప్పుడు మా నాన్న 25–30 పోస్ట్‌కార్డులు కొనేవారు. మా ప్రాంతంలో వర్షం పడిందని బంధువులందరికీ లేఖలు రాసేవారు. ఈ అనవసర ఖర్చు ఎందుకని మేం గోల చేసేవాళ్లం. అప్పట్లో నేనూ ఆశ్చర్యపోయేవాడ్ని. ప్రకృతి పట్ల ఆయనకున్న అభిమానం అలాంటిది. ఆ విలువ ఏంటో ఇప్పుడు నాకు అర్థమవుతోంది.

అనంతరం వారిద్దరూ కలిసి ఎత్తుగా ఉన్న గడ్డి ప్రాంతాన్ని దాటి నదీతీరానికి చేరుకున్నారు.

**మీరు ప్రధాని కావాలని ఎప్పుడు అనుకున్నారు?**

నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్లు పనిచేశా. అది నాకు కొత్త ప్రయాణం. ఆ తర్వాత ఈ పని(ప్రధాని బాధ్యతలు) చేపట్టాలని దేశం ఆదేశించింది. అందుకే ఐదేళ్లుగా పనిచేస్తున్నా. ఈ కాలంలో అభివృద్ధిపైనే నేను దృష్టి సారించాను. ప్రజల కలల్ని నా కలలుగా చేసుకుని పనిచేశా. ప్రజల కలల సాకారంతోనే నాకు సంతృప్తి లభిస్తుంది. 18 సంవత్సరాల తర్వాత మొదటిసారి నేను సెలవు తీసుకున్నా.

**ప్రధాని హోదా మిమ్మల్ని ఎప్పుడైనా ఇబ్బంది పెట్టిందా?**

మోదీ: నా మెదడు ఎప్పుడూ హోదా గురించి ఆలోచించదు. అలాంటివాటికి నేను అతీతుడ్ని. ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రధానిగా ఉన్నా, నా మెదడు కేవలం పనిగురించే ఆలోచిస్తూ ఉంటుంది. పదవి అనేది నా ఆలోచనల్లోకి కూడా రాదు.

**చిన్నప్పుడు మీరు మొసలిని ఇంటికి తీసుకెళ్లారట.. అసలేం జరిగింది?**

ఓ అదా.. నేను రోజూ చెరువులో స్నానం చేసేవాడిని. అక్కడ కనిపించిన ఓ మొసలి పిల్లను ఇంటికి పట్టుకెళ్లా. దీంతో మా అమ్మ 'తల్లీబిడ్డలను వేరుచేయడం తప్పు. దాన్ని మనం పెంచుకోకూడదు. వెళ్లి వదిలేసి రా' అని చెప్పింది. ప్రకృతిని చూసి మనమెప్పుడూ భయపడకూడదు. అలా భయపడితేనే సమస్యలు ఉత్పన్నమవుతాయి.

**భారీ ర్యాలీల్లో పాల్గొనేటప్పుడు ఎదురయ్యే ఆందోళనను ఎలా ఎదుర్కొంటారు?**

నా సమస్య ఏంటంటే నేనెప్పుడూ అలాంటి భయాన్ని ఎదుర్కోలేదు. కాబట్టి భయం గురించి ప్రజలకు చెప్పలేను. నా స్వభావం చాలా సానుకూలమైనది. నేను ప్రతీదాంట్లో మంచినే చూస్తా. అనుకున్నపని జరగకపోతే బాధపడను.

**మీరు యువతకిచ్చే సందేశం ఏమిటి?**

నేను యువతకు చెప్పేదొకటే. జీవితాన్ని ముక్కలు ముక్కలుగా చూడొద్దు. జీవితాన్ని సంపూర్ణంగా చూస్తే అందులో ఎత్తుపల్లాలు ఉంటాయి. మనం కిందపడ్డా బాధపడకూడదు. తిరిగి పైకిలేవడానికి అక్కడే దారి మొదలవుతుంది.

అనంతరం మోదీ, గ్రిల్స్ కలిసి నదిని దాటారు. ప్రధానిని టార్పాలిన్‌తో చేసిన తెప్పలో ఎక్కించిన గ్రిల్స్ దాన్ని తోసుకుంటూ నదిని దాటారు. ఈ సందర్భంగా వర్షం కురవడంతో మోదీ, గ్రిల్స్ తడిసిపోయారు. దీంతో ఇద్దరూ కరివేపాకులు కలిపిన టీని తాగారు.

**ప్రకృతి పరిరక్షణ అంటే మీకు ఇష్టమా..?**

మేం ఇండియాలో ప్రతీ చెట్టును దేవుడిగా భావిస్తాం. ఇక్కడ 'తులసీ వివాహం' అని సంప్రదాయం ఉంది. ఇందులో భగవంతుడిని, తులసి మొక్కకు ఏడాదికోసారి పెళ్లి చేస్తాం. అలా తులసీదళాన్ని మా కుటుంబంలో భాగం చేసుకుంటాం. భూమిని కాపాడుకోవడమన్నది మన బాధ్య త. మన సుఖం కోసం ప్రకృతిని దోచుకుంటున్నాం.

**స్వచ్ఛ భారత్ కోసం ఏం చేయాలంటారు?**

బయటివారి వల్ల స్వచ్ఛభారత్ సాధ్యం కాదు. భారత్‌లో ఉండేవారి స్వభావం వల్లే దేశం క్లీన్ అవుతుంది. వ్యక్తిగత శుభ్రత అన్నది భారతీయ సంస్కృతిలోనే ఓ భాగం. ఇప్పుడు సామాజిక పరిశుభ్రత అలవర్చుకోవాలి. ఈ విషయంలో మహాత్మాగాంధీ చాలా కృషి చేశారు.

## చంపడం నా స్వభావానికి విరుద్ధం

ఈ సందర్భంగా ఇద్దరూ కలిసి ఓ కత్తి, తాడు, కర్ర సాయంతో బల్లెం తయారుచేశారు. పులులు తాము వేటాడే జంతువును సమీపించే వరకూ నక్కి ఉండి ఒక్కసారిగా దాడిచేస్తాయని గ్రిల్స్ తెలిపారు. పులి సమీపిస్తే ఇలా దాడిచేయాలంటూ బల్లెం వాడే పద్ధతిని చూపించారు. దీంతో మోదీ స్పందిస్తూ..'చంపడం నా స్వభావానికి విరుద్ధం. ఈ ఆయుధాన్ని మీరే తీసుకోండి' అని చెప్పారు. దీంతో గ్రిల్స్ దాన్ని తీసుకోబోతుండగా..'పర్లేదు. మీకోసం నేను దీన్ని తీసుకుంటా' అని చెప్పారు. ఈ సందర్భంగా గ్రిల్స్ స్పందిస్తూ..'సార్ ఒకవేళ ఇప్పుడు పులి వస్తే మీరెంత వేగంగా పరిగెత్తగలరు?' అని ప్రశ్నించారు. దీంతో మోదీ..'మీరు చెప్పండి' అని అడిగారు. దీంతో గ్రిల్స్ 'నేను మీకంటే వేగంగా పరిగెత్తగలను' అని జవాబిచ్చారు. వెంటనే మోదీ 'అవునా!' అంటూ తేరిపారా చూశారు. మోదీ మాటకు గ్రిల్స్ స్పందిస్తూ..'ఇది పేలని జోక్ సార్. నేను మిమ్మల్ని వదిలి వెళతానా?' అంటూ వ్యాఖ్యానించారు.

## క్లుప్తంగా...

### ఢిల్లీ-లాహోర్ బస్సు రద్దు



**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు అనంతరం లాహోర్–ఢిల్లీ బస్ సర్వీసులను పాక్ రద్దు చేసిన నేపథ్యంలో, భారత్ కూడా ఢిల్లీ–లాహోర్ బస్ సర్వీసును రద్దు చేసిందని ప్రజారవాణా సీనియర్ అధికారి తెలిపారు. ఈ బస్సు సోమవారం ఉదయం 6 గంటలకు లాహోర్‌కు వెళ్లాల్సి ఉండగా ప్రస్తుతం రద్దు అయింది. తమ దేశం నుంచి వస్తున్న బస్ సర్వీసులన్నీ సోమవారం నుంచి నిలిచిపోతాయని శనివారమే పాక్ స్పష్టం చేసింది. 1999 ఫిబ్రవరిలో ఈ బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి.

### రేప్ కేసులకు 'ఫాస్ట్‌ట్రాక్'

**న్యూఢిల్లీ:** పెండింగ్‌లో ఉన్న అత్యాచార కేసులను విచారించేందుకు అక్టోబర్ 2 నుంచి ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర న్యాయ శాఖ సిద్ధం అవుతోంది. మొత్తం 1,023 ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి రూ. 767.25 కోట్లు ఖర్చవుతుందని న్యాయ విభాగం పేర్కొంది. అందులో నిర్భయ నిధుల కింద కేంద్రం నుంచి రూ. 474 కోట్లు మంజూరు కానున్నాయి, ఆర్థిక సంఘం ఖర్చుల వివరాలను ప్రతిపాదించిన తర్వాత దాన్ని ఆర్థిక మంత్రి దగ్గరకు పంపనున్నామని, న్యాయవిభాగం ఈ నెల 8న కేబినేట్ సెక్రెటేరియట్‌కు రాసిన లేఖలో తెలిపింది. దీనితోపాటే అక్టోబర్ 2 నుంచి ఈ కోర్టులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. మొదటి దశలో 9 రాష్ట్రాల్లో 777 కోర్టులు ఏర్పాటు చేస్తామని, రెండో దశలో 246 కోర్టులు ఏర్పాటు చేస్తామని మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇదివరకే తెలిపిన సంగతి తెలిసిందే.

### అలా అయితే ఆర్టికల్ రద్దయ్యేదా?: చిదంబరం



**చెన్నై:** కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం కశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కశ్మీర్‌లో హిందువుల శాతం అధికంగా ఉంటే ఆర్టికల్ 370ని రద్దు చేసేవారా అంటూ బీజేపీని ప్రశ్నించారు. అక్కడ ఎక్కువ శాతం ముస్లింలు ఉన్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నారని సోమవారమిక్కడ అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. ఆర్టికల్ రద్దుకు మతం రంగు పులిమే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని విమర్శించింది. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర స్థాయి నుంచి మున్సిపాలిటీ స్థాయికి తగ్గించేలా కేంద్ర పాలిత ప్రాంత హోదా ఇచ్చారని విమర్శించారు. కశ్మీర్‌లో ముస్లింలు ఎక్కువగా ఉన్నారన్న కారణంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఇప్పటికీ కశ్మీర్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఏమీ లేదని, ఒకవేళ ప్రశాంతంగా ఉంటే దేశంలోని ఇతర ప్రాంతాల్లోలాగే అక్కడ ఎందుకు మీడియాను అనుమతించడం లేదని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా తమకు, ఇతర పార్టీలు సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని తెలిపారు.

# ఉత్తరాఖండ్‌లో కొండచరియల బీభత్సం

- శిథిలాల కింద చిక్కుకుని ఆరుగురు మృతి
- కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌ల్లో కొనసాగుతున్న వరద సహాయ చర్యలు
- కేరళలో 83కి చేరిన మృతుల సంఖ్య



సోమవారం డెహ్రాడూన్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న రిస్పనా నది

**డెహ్రాడూన్:** భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటంతో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఆరుగురు చనిపోయారు. ఘాట్ ప్రాంతాలున్న చమోలీ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో ఆ శిథిలాల్లో చిక్కుకుని మహిళ, ఆమె 9 నెలల కూతురు సహా ఆరుగురు మృతి చెందారు. బద్రీనాథ్– పగల్‌నాలా, రిషికేష్– కేదార్‌నాథ్ రహదారుల్లో రవాణా సైతం కొండచరియలు విరిగిపడిన కారణంగా నిలిచిపోయింది. రాష్ట్రంలో పోటెత్తిన చాప్లాగడ్ నది ధాటికి పక్కనే ఉన్న ఇళ్లు, భవనాలు, షాపులు కుప్పకూలి నీటిలో కొట్టుకుపోయాయి. జమ్మూకశ్మీర్‌లోని రిసాయి జిల్లాలో ఓ పెద్ద బండరాయి విరిగిపడటంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

మరోవైపు, భారీ వర్షాలతో అతలాకుతలమైన కేరళ, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ ల్లో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. పై నాలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరద కారణంగా మృతి చెందిన వారి సంఖ్య సోమవారానికి 199కి చేరగా, కేవలం కేరళలోనే 83 మంది చనిపోయారు. అయితే, మలప్పురంలో ఇంకా 50 మంది వరకు జాడ తెలియని నేపథ్యంలో మృతుల సంఖ్య ఇంకా పెరగొచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. కేరళలో 2.87 లక్షల మంది ఇంకా సహాయ కేంద్రాల్లోనే ఉన్నారు.

గుజరాత్‌లోని కచ్ జిల్లాలో వరదల్లో చిక్కుకుపోయిన 125 మందిని భారత వైమానిక దళం కాపాడింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్ సమీపంలో వరదల కారణంగా గత 6 రోజులుగా మూసివేసి ఉన్న ముంబై– బెంగళూరు హైవేపై సోమవారం వాహనాలకు పాక్షికంగా అనుమతి ఇచ్చారు. వర్షాలకు భారీగా ధ్వంసమైన తన నియోజకవర్గం వాయినాడ్(కేరళ)లో కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పర్యటించి, బాధితులను పరామర్శించారు. వరద సహాయ చర్యల్లో పాలుపంచుకోవాల్సిందిగా కాంగ్రెస్ శ్రేణులను కోరారు.

## బీజేపీలోకి రెజ్లర్ బబిత



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం, పలు అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి సత్తా చాటిన రెజ్లర్ బబితా ఫొగాట్, ఆమెకు శిక్షణనిచ్చిన ఆమె తండ్రి మహవీర్‌సింగ్ ఫొగాట్‌లు సోమవారం బీజేపీలో చేరారు. వీరిద్దరి విజయాలు స్ఫూర్తిగా 'దంగల్' పేరుతో ఆమిర్‌ఖాన్ హీరోగా బాలీవుడ్‌లో ఓ సినిమా కూడా రూపొందిన విషయం తెలిసిందే. కేంద్ర క్రీడా మంత్రి కిరణ్ రిజుజు, హరియాణా రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ అనిల్ జైన్ సమక్షంలో వారు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. యువశక్తికి బబిత నిదర్శనంగా నిలిచిందని కిరణ్ రిజిజు ప్రశంసించారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్‌ల చేరిక పార్టీకి కొత్త శక్తినిస్తుందని బీజేపీ పేర్కొంది. బబిత చేరిక హరియాణా బీజేపీకి మంచిరోజు అని అనిల్ అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారా ప్రధాని మోదీ చరిత్రను తిరగరాశారని బబిత ప్రశంసించారు.

## హాంకాంగ్ విమానాశ్రయంలో నిరసనలు

**పలు విమానాల రద్దు**



నిరసనకారులతో నిండిపోయిన ఎయిర్‌పోర్టు

**హాంకాంగ్:** నిరసనకారుల సెగ హాంకాంగ్ విమానాశ్రయాన్ని తాకింది. విమానాశ్రయంలోకి ప్రవేశించిన నిరసనకారులు ఆ దేశ పోలీసులకు వ్యతిరేకంగా గళం విప్పారు. నల్లటి దుస్తులు ధరించి ప్లకార్డులు ప్రదర్శించారు. విమానాశ్రయం లోపల ఇంత పెద్ద స్థాయిలో ఆందోళనలు జరపడం ఇదే తొలిసారి. నిరసన తెలుపుతోన్న ఓ మహిళపై ఆదివారం పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ వారు ఆందోళన నిర్వహించారు. పోలీసుల దాడిలో రక్తమోడుతున్న మహిళ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ దాడిలో మహిళ కంటిచూపు కోల్పోయిందని వారు ఆరోపించారు. ఆమెకు మద్దతుగా కంటికి బ్యాండేజీలు కట్టుకుని నిరసన తెలిపారు. హాంకాంగ్ పోలీసులకు మతి భ్రమించిందని, వారు తమ పరిధిని దాటి ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. 'హాంకాంగ్ పోలీసులు మమ్మల్ని చంపేస్తున్నారు', 'హాంకాంగ్ సురక్షిత స్థలం కాదు', 'హాంకాంగ్ ప్రజలారా మేల్కోండి.. భయపడాల్సిన అవసరం లేదు' అని ప్లకార్డులు ప్రదర్శించారు. నల్లటి దుస్తులు ధరించిన వేలాది మంది నిరసనకారులతో విమానాశ్రయ ప్రాంగణమంతా నలుపు రంగును పులుముకున్నట్లు అయింది. నిరసనకారుల దెబ్బకు హాంకాంగ్ నుంచి బయలుదేరాల్సిన, అక్కడికి రావాల్సిన అన్ని విమానాలను రద్దు చేశారు.

**నిరసనకారులు ఉగ్రవాదులే: చైనా**

పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న హాంకాంగ్ నిరసనకారులపై చైనా మండిపడింది. నిరసనకారుల చర్యలు ఉగ్రవాద చర్యల్లాగే ఉన్నాయని, ఇప్పుడిప్పుడే ఉగ్రవాదం పురుడు పోసుకుంటోందని వ్యాఖ్యానించింది.

# అలా అయితే గ్రీన్‌కార్డ్ రాదు!

- ప్రభుత్వ సౌకర్యాలు పొందాలనుకుంటే శాశ్వత నివాస హోదాకు నో
- అమెరికా తాజా నిర్ణయం



**వాషింగ్టన్:** అమెరికా గ్రీన్‌కార్డ్ పొందేందుకు ఎదురుచూస్తున్న ఆశావహులకు ఆ దేశ ప్రభుత్వం చేదువార్త చెప్పింది. ఫుడ్ స్టాంప్స్(అల్పాదాయ వ్యక్తులకు ఆహారం అందించేందుకు ప్రభుత్వం చవకగా ఇచ్చే వోచర్లు), వైద్య సాయం(మెడిక్ ఎయిడ్), గృహ సదుపాయం(హౌజింగ్ అసిస్టెన్స్) తదితర సౌకర్యాలు కోరుకుంటున్న వారికి గ్రీన్‌కార్డ్ నిరాకరించే అవకాశముందని స్పష్టం చేసింది. గ్రీన్‌కార్డ్ పొందినవారికి అమెరికాలో శాశ్వతంగా నివసించే అవకాశంతో పాటు పలు ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. అమెరికా తమ పౌరులకు ఇచ్చే ఇలాంటి ప్రభుత్వ సౌకర్యాలను తాము భవిష్యత్తులో కూడా ఆశించబోమని కాన్సులార్ ఆఫీసర్‌ను నమ్మించాల్సి ఉంటుందని పేర్కొంటూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ తాజాగా నిబంధనలను జారీ చేసింది. అమెరికాకు రావాలనుకునే లేదా అమెరికాలో ఉండాలనుకునే విదేశీయులు తమ ఖర్చులను తామే భరించేలా, అమెరికా ప్రభుత్వం అందించే సౌకర్యాలపై ఆధారపడకుండా ఉండేలా ఈ తాజా నిబంధనలు తోడ్పడుతాయని వైట్ హౌజ్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఒక స్థాయిని మించి ప్రభుత్వ సౌకర్యాలు పొందే వ్యక్తులను 'పబ్లిక్ చార్జ్(ప్రజలపై భారం)'గా పరిగణిస్తారు. అలా పబ్లిక్ చార్జ్‌గా మారే అవకాశమున్న వారిని దేశంలోకి అడుగు పెట్టకుండానే నిరోధిస్తారు. ఇప్పటికే దేశంలో ఉంటున్నవారైతే.. వారి ఇమిగ్రేషన్ స్థాయిని మార్చుకునే అవకాశం ఇవ్వరు. విదేశీయులపై ప్రజాధనం ఖర్చుకాకూడదనే ఈ నిబంధనలను అధ్యక్షుడు ట్రంప్ తెరపైకి తెచ్చారని వైట్‌హౌజ్ పేర్కొంది. 'ఈ చట్టం 1996 నుంచే ఉంది కానీ కఠినంగా అమలు చేయలేదు' అని పేర్కొంది. పన్ను చెల్లింపుదారులపై భారం పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా పౌర, వలస సేవల సంస్థ(యూఎస్‌సీఐఎస్) డైరెక్టర్ కెన్ స్పష్టం చేశారు. ఈ నిబంధనల వల్ల గ్రీన్‌కార్డ్ ఆశావహులు తమ ఆదాయాన్ని పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక వ్యాఖ్యానించింది.

# భిన్నాభిప్రాయాలు ఘర్షణగా మారొద్దు

- చైనాకు సూచించిన భారత విదేశాంగ మంత్రి జై శంకర్
- భారత్–చైనా సంబంధాలు సరికొత్త ఎత్తుకు చేరుకుంటాయని ఆకాంక్ష
- ఉపాధ్యక్షుడు, విదేశాంగ మంత్రితో భేటీ



చైనా విదేశాంగమంత్రితో జైశంకర్ కరచాలనం

**బీజింగ్/ఇస్లామాబాద్:** భారత్, చైనా మధ్య ఉండే భిన్నాభిప్రాయాలు ఘర్షణగా మారకూడదని భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ తెలిపారు. ఓ దేశపు సమస్యలపై మరో దేశం ఎలా స్పందిస్తుందన్న విషయంపైనే భవిష్యత్తులో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని భారత్ ఏకపక్షంగా రద్దుచేయడాన్ని ఖండిస్తున్నామని చైనా ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. వుహాన్ సదస్సులో ఏర్పడిన సానుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ భారత్–చైనాల సంబంధాలను సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. మూడు రోజుల చైనా పర్యటనలో భాగంగా బీజింగ్ చేరుకున్న జై శంకర్, చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ క్విషన్, విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు. పాక్ విదేశాంగ మంత్రి ఖురేషీ చైనా పర్యటన ముగిసిన వెంటనే జై శంకర్ చైనాను సందర్శించడం గమనార్హం.

**వారు వాస్తవాన్ని గుర్తించారు:** బీజింగ్‌లో సోమవారం జరిగిన భారత్–చైనా అత్యున్నత కమిటీ(సాంస్కృతిక, ప్రజా సంబంధాలు) సమావేశంలో జై శంకర్ మాట్లాడుతూ..'అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్–చైనాల ద్వైపాక్షిక సంబంధాలు చాలా విశిష్టమైనవి. ఇండియా–చైనా రెండూ అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థికవ్యవస్థలు. రెండేళ్ల క్రితం భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఈ వాస్తవాన్ని గ్రహించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాలు పటిష్టం కావాల్సిన అవసరముందని అస్తానా(కజకిస్తాన్)లో జరిగిన భేటీలో చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలకు ప్రజామద్దతును పొందాల్సిన అవసరం కూడా ఉంది. అయితే ఇది సాధ్యం కావాలంటే ఇండియా–చైనాల మధ్య ఉన్న అభిప్రాయభేదాలు ఘర్షణలుగా మారకూడదు' అని తెలిపారు. ఈ భేటీ వల్ల ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత పటిష్టమవుతాయి వాంగ్ చెప్పారు.

# జమ్మూకశ్మీర్‌లో ఈద్ ప్రశాంతం

**ఎన్ఎస్ఏ దోవల్ ఏరియల్ సర్వే**



ఆంక్షలకారణంగా స్వస్థలాలకు వెళ్లలేక ఢిల్లీలోనే బక్రీద్ జరుపుకుని నిర్వేదంలో కశ్మీరీ యువత

**శ్రీనగర్/జమ్మూ:** జమ్మూకశ్మీర్‌లో సోమవారం బక్రీద్ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. జమ్మూతో పాటు కశ్మీర్‌లోని పలుచోట్ల ముస్లింలు భారీ సంఖ్యలో ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడక్కడా చెదురుమదురు సంఘటనలు చోటుచేసుకోగా, ఆందోళనకారుల్ని భద్రతాబలగాలు చెదరగొట్టాయి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు, స్వయంప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని కేంద్రం ఇటీవల రద్దుచేసిన సంగతి తెలిసిందే. పండుగ సందర్భంగా మద్దతుదారులతో సందడిగా ఉండే నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీల ఇళ్లు ఈసారి మూగబోయాయి. ఫరూక్‌ను గుప్కార్‌రోడ్డులోని ఆయన ఇంట్లోనే హౌస్‌అరెస్ట్ చేసిన బలగాలు.. ఆయన కుమారుడు ఒమర్‌ను హరినివాస్ ప్యాలెస్‌లో నిర్బంధించాయి. ఇక ముఫ్తీని చష్మా సాహి అనే నివాసంలో ఉంచారు. జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ జమ్మూకశ్మీర్‌లో పరిస్థితిని సమీక్షించారు. శ్రీనగర్‌తో పాటు దక్షిణ కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఆర్మీ, పోలీస్ ఉన్నతాధికారులూ ఏరియల్ సర్వేలో పాల్గొన్నారు. టెలిఫోన్, మొబైల్, ఇంటర్నెట్ సేవలు మూగబోయిన నేపథ్యంలో కశ్మీరీలు ఇతర రాష్ట్రాల్లోని తమ వారితో మాట్లాడేందుకు పోలీసులు 300 ప్రత్యేక టెలిఫోన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సాక్షి బిజినెస్
మంగళవారం 13-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు** (శుక్రవారం ముగింపు)

| | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 255 ▲ | 37,582 |
| నిఫ్టీ | 77 ▲ | 11,110 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 7,905 | ▼ | 52 |
| డోజోన్స్ | 26,024 | ▼ | 264 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,227 | ▼ | 27 |
| డాక్స్ | 11,680 | ▼ | 14 |
| షాంఘై | 2,815 | ▲ | 40 |
| నికాయ్ (శుక్రవారం ముగింపు) | 20,685 | ▲ | 91 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో (శుక్రవారం ముగింపు)

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.75 | 71.39 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.12 | 87.17 |
| యూరో | ఎస్‌బీఐ | 77.56 | 80.46 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.34 | 67.83 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.01 | 49.19 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.2 | 51.96 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.10 | 19.87 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.53 | 20.10 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.41 | 10.76 |

# ముకేశ్.. మెగా డీల్స్!

చమురు నుంచి టెలికం దాకా వివిధ రంగాల్లో విస్తరించిన పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) తాజాగా మరిన్ని భారీ వ్యాపార ప్రణాళికలు ప్రకటించింది. ఏడాదిన్నర వ్యవధిలో రుణ రహిత సంస్థగా మారాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా రూ. 1.15 లక్షల కోట్ల భారీ డీల్స్ ప్రకటించింది. అలాగే అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ఫైబర్ సర్వీసులను కూడా వచ్చే నెల నుంచే అందుబాటులో తేనున్నట్లు వెల్లడించింది. వీటితో పాటు పలు వ్యాపార వ్యూహాలు ఆవిష్కరించింది.



భార్య నీతా అంబానీ, తల్లి కోకిలాబెన్‌తో కలిసి ఏజీఎంకు హాజరైన ముకేశ్ అంబానీ

## రిలయన్స్‌లోకి రూ. 1.15 లక్షల కోట్లు

- రిఫైనరీ, ఇంధన రిటైల్‌లో వాటా విక్రయం
- సౌదీ ఆరామ్‌కో చేతికి 20 శాతం వాటా
- ఇంధన రిటైలింగ్‌లో బ్రిటన్ బీపీకి 49 శాతం
- ఏడాదిన్నరలో రుణ రహిత కంపెనీగా ఆవిర్భావం
- సెప్టెంబర్ 5 నుంచి జియో ఫైబర్ సేవలు
- అయిదేళ్లలో ఐపీవోకి జియో, రిటైల్

## రిలయన్స్ 42వ ఏజీఎం ముఖ్యాంశాలు...

### సౌదీ ఆరామ్‌కో-ఆర్ఐఎల్ డీల్

- రిఫైనరీ, పెట్రోకెమికల్ వ్యాపారంలో **20%** వాటా సౌదీ ఆరామ్‌కో చేతికి
- డీల్ విలువ రూ.**1.05** లక్షల కోట్లు (**15** బిలియన్ డాలర్లు)
- దీని ప్రకారం ఈ విభాగాల విలువ రూ.**5,25,000** కోట్లు (**75** బిలియన్ డాలర్లు)

### బీపీ-ఆర్ఐఎల్ డీల్

- ఇంధన రిటైల్ వ్యాపారంలో **49%** వాటా బీపీ చేతికి
- డీల్ విలువ రూ.**7,000** కోట్లు
- దేశవ్యాప్తంగా ఐదేళ్లలో **5,500** పెట్రోలు బంకులు

### రుణ రహిత కంపెనీగా...



- ఐదేళ్లలో కన్సూమర్ వ్యాపారాలన్నీ స్టాక్ మార్కెట్లో లిస్టింగ్
- రియల్టీ, ఫైనాన్షియల్ పెట్టుబడులను తగిన విధంగా ఉపయోగించుకోవడం
- ప్రస్తుతం కంపెనీ మొత్తం రుణ భారం : రూ.**2.88** లక్షల కోట్లు
- నగదు నిల్వలు : రూ.**1.32** లక్షల కోట్లు
- నికర రుణ భారం : రూ.**1.56** లక్షల కోట్లు
- **18** నెలల్లో (**2021**, మార్చి **31** నాటికి) రుణ రహిత కంపెనీగా ఆవిర్భావం లక్ష్యం

### షేరు పనితీరు గత ఐదేళ్లలో...

- రిలయన్స్ **135%** అప్
- నిఫ్టీ: **44%** అప్

### జియో దూకుడు...

- ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న డిజిటల్ కంపెనీ
- సబ్‌స్క్రయిబర్ల సంఖ్య : **34** కోట్లు
- యూజర్ల పరంగా దేశంలో నంబర్ **1** టెల్కో, ప్రపంచంలో **2**వ స్థానం
- జియో ఫైబర్ నెట్ వాణిజ్య సేవలు : సెప్టెంబర్ **5**న షురూ
- కనీస బ్రాడ్‌బ్యాండ్ స్పీడ్ : **100** ఎంబీపీఎస్
- టారిఫ్ : రూ.**700** నుంచి రూ.**10,000**
- మైక్రోసాఫ్ట్‌తో భాగస్వామ్యం : అజూర్ క్లౌడ్ సేవలు జియో నెట్‌వర్క్‌లో
- **2020**, జనవరి **1** నుంచి ఐవోటీ సేవలు

**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ 42వ వార్షిక సర్వ సభ్య సమావేశ (ఏజీఎం) వేదికపై సంస్థ అధినేత ముకేశ్ అంబానీ భారీ వ్యాపార ప్రణాళికలను ప్రకటించారు. ఏడాదిన్నర వ్యవధిలో రుణరహిత కంపెనీగా మార్చే దిశగా పలు చర్యలను వెల్లడించారు. ప్రధానమైన పెట్రోకెమికల్ వ్యాపార విభాగంలో సౌదీకి చెందిన చమురు దిగ్గజం సౌదీ ఆరామ్‌కోకు 20 శాతం వాటాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ విభాగం విలువను 75 బిలియన్ డాలర్ల కింద అంచనా వేశారు. అంటే... 20 శాతం వాటా కింద 15 బిలియన్ డాలర్ల వరకూ రిలయన్స్ చేతికి అందుతాయి. ఇక, ఇంధనాల రిటైల్ వ్యాపారంలో బ్రిటన్ దిగ్గజం బ్రిటిష్ పెట్రోలియం (బీపీ) సంస్థకు 49 శాతం వాటాలు విక్రయిస్తున్నట్లు అంబానీ చెప్పారు. ఈ డీల్ విలువ సుమారు రూ.7,000 కోట్లు. స్థూలంగా ఈ రెండు ఒప్పందాల ద్వారా సుమారు రూ.1,15,000 కోట్లు రిలయన్స్‌కు లభించగలవని అంచనా. ఒప్పందాల స్వరూపం ప్రకారం... పెట్రోకెమికల్ వ్యాపారంలో 20 శాతం వాటా సౌదీ ఆరామ్‌కోకు దక్కుతుంది. ఇంధన రిటైల్ నెట్‌వర్క్‌లో బీపీకి 49 శాతం వాటా దక్కుతుంది. ఆ నెట్‌వర్క్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చేతిలో మిగిలే 51 శాతం వాటాలో సైతం కొంత సౌదీ ఆరామ్‌కో చేతికి వెళుతుంది.

### రోజుకు 5 లక్షల బ్యారెళ్ల సరఫరా...

ప్రపంచంలోనే అతి పెద్ద ముడిచమురు ఎగుమతిదారు అయిన ఆరామ్‌కో... జామ్‌నగర్ (గుజరాత్)లోని రిలయన్స్ జంట రిఫైనరీలకు దీర్ఘకాలిక ప్రాతిపదికన రోజుకు 5,00,000 బ్యారెళ్ల చమురును సరఫరా చేయనుందని అంబానీ ఈ సందర్భంగా తెలిపారు. రిలయన్స్‌కు ప్రస్తుతం 1,400 పైచిలుకు పెట్రోల్ బంకులు, 31 విమాన ఇంధన విక్రయ స్టేషన్లు ఉన్నాయి. బీపీతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడం ద్వారా వచ్చే అయిదేళ్లలో ఈ నెట్‌వర్క్‌ను 5,500 బంకుల స్థాయికి పెంచుకోవాలని ఇరు సంస్థలు నిర్దేశించుకున్నాయి. సౌదీ ఆరామ్‌కోతో డీల్ 2020 మార్చి నాటికి పూర్తి కాగలదని ఏజీఎం అనంతరం రిలయన్స్ ఈడీ పీఎంఎస్ ప్రసాద్ విలేకరులకు తెలియజేశారు. అయిదేళ్ల వ్యవధిలో పెట్రో కెమికల్స్ వ్యాపార విభాగాన్ని అన్‌లిస్టెడ్ అనుబంధ సంస్థగా విడగొట్టనున్నట్లు చెప్పారాయన.

### రూ. 2.8 లక్షల కోట్ల రుణభారం..

గడిచిన ఐదేళ్లుగా చమురు నుంచి టెలికం, రిటైల్ దాకా వివిధ వ్యాపార విభాగాల విస్తరణ కోసం రిలయన్స్ రూ.5.4 లక్షల కోట్లకు పైగా ఇన్వెస్ట్ చేసింది. ఇందులో అధిక భాగం రుణాల రూపంలోనే ఉంది. ఈ ఏడాది జూన్ ఆఖరు నాటికి రిలయన్స్ గ్రూప్ రుణ భారం రూ.2,88,243 కోట్లు కాగా... దాని చేతిలో మాత్రం రూ.1,31,710 కోట్ల నగదు నిల్వలున్నాయి. బీపీ, సౌదీ ఆరామ్‌కో సంస్థలతో డీల్స్‌తో రుణభారం కొంత వరకూ తగ్గుతుంది. అధిక రుణభారంతో సంస్థ వృద్ధికి విఘాతం ఏర్పడుతుందన్న పరిశ్రమ నిపుణుల అభిప్రాయాలను అంబానీ తోసిపుచ్చారు. అయితే, 18 నెలల కాలంలో మొత్తం రుణ భారాన్ని తగ్గించేసుకుని అప్పుల్లేని సంస్థగా ఆవిర్భవించాలని కంపెనీ నిర్దేశించుకుంది. నగదు నిల్వల కన్నా రుణ భారం తక్కువగా ఉంటే రుణరహిత సంస్థగా పరిగణిస్తారు. టెలికం, రిటైల్ తదితర వ్యాపార విభాగాలన్నింటినీ కలిపితే రిలయన్స్ గ్రూప్ విలువ 134 బిలియన్ డాలర్లకు పైగానే ఉంటుందని అంచనా.

### టాప్ టెల్కోగా జియో..

టెలికం విభాగం జియో యూజర్ల సంఖ్య ఈ ఏడాది జూన్ చివరినాటికి 34 కోట్లకు చేరినట్లు ముకేశ్ అంబానీ తెలిపారు. యూజర్లపరంగా దేశీయంగా అతి పెద్ద టెలికం ఆపరేటర్‌గా, ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆపరేటర్‌గా (సింగిల్ ప్లాట్‌ఫాం) జియో ఆవిర్భవించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), గృహాలకు, ఎంటర్‌ప్రైజ్ కంపెనీలకు, చిన్న సంస్థలకు (ఎస్ఎంఈ) బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందించటం ద్వారా మరింత వృద్ధి సాధించనున్నట్లు చెప్పారు. ఈ నాలుగు విభాగాల నుంచి ఆదాయ ఫలాలు ఈ ఆర్థిక సంవత్సరం నుంచే కనిపిస్తాయన్నారు. 2020 జనవరి 1 నుంచి ఐవోటీ సర్వీసులు అందుబాటులోకి వస్తాయి.

## స్టార్టప్స్‌కు ఊతం..



స్టార్టప్ సంస్థలకు తోడ్పాటునిచ్చే దిశగా వాటికి ఉచితంగా ఇంటర్నెట్ సేవలు అందించడంతో పాటు కొన్నింటిలో ఇన్వెస్ట్ కూడా చేయనున్నట్లు అంబానీ చెప్పారు. 'జియో సంస్థ... భారత్‌లో భారతీయుల చేతిలో తయారైన స్టార్టప్. సాధారణంగా స్టార్టప్స్ వ్యయాల్లో 80 శాతం వాటా క్లౌడ్, కనెక్టివిటీ తదితర అవసరాలదే ఉంటుంది. అందుకే ఔత్సాహిక సంస్థలకు వీటిని ఉచితంగా అందించేందుకు జియో సిద్ధంగా ఉంది. 2020 జనవరి 1 నుంచి ఈ సర్వీసు అందుబాటులోకి వస్తుంది. ఈలోగా జియోడాట్‌కామ్‌లో స్టార్టప్స్ ప్యాకేజీలు నమోదు చేసుకోవచ్చు. వ్యవసాయం, విద్య, వైద్యం, నైపుణ్యాల శిక్షణ విభాగాల స్టార్టప్స్‌కు ప్రాధాన్యం లభిస్తుంది' అని అంబానీ చెప్పారు. తల్లి కోకిలాబెన్, భార్య నీతా అంబానీ, తనయులు ఆకాశ్, అనంత్, కూతురు ఈషా, కోడలు శ్లోక కూడా ఏజీఎంలో పాల్గొన్నారు. నవభారతం రూపుదిద్దుకుంటున్న ఈ తరుణంలో రిలయన్స్ కూడా కొత్త రిలయన్స్‌గా రూపాంతరం చెందుతుందని అంబానీ పేర్కొన్నారు.

## రూ. 700కే జియో ఫైబర్

జియో టెలికం సర్వీసులు ప్రారంభించి మూడేళ్లవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 5న జియో ఫైబర్ సర్వీసులను కూడా ప్రారంభించనున్నట్లు అంబానీ వెల్లడించారు. ల్యాండ్‌లైన్ నుంచి జీవితకాలం పాటు ఉచిత వాయిస్ కాల్స్... కనిష్టంగా 100 ఎంబీపీఎస్ బ్రాండ్‌బ్యాండ్ స్పీడ్ అందించేట్లుగా ఈ సర్వీసులుంటాయి. నెలకు రూ. 700 నుంచి రూ. 10,000 దాకా ప్లాన్స్ ఉంటాయి. అమెరికా, కెనడాలకు నెలకు రూ.500 అద్దెకే ల్యాండ్‌లైన్స్ నుంచి అపరిమిత ఇంటర్నేషనల్ కాల్స్ చేసుకోవచ్చు. ప్రస్తుత మార్కెట్ రేట్లతో పోలిస్తే ఇది అయిదోవంతు నుంచి పదో వంతు దాకా తక్కువ ఉంటుందని అంబానీ తెలిపారు. 'అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఫిక్స్‌డ్ లైన్ డౌన్‌లోడ్ స్పీడ్ 90 ఎంబీపీఎస్ మాత్రమే ఉంటోంది. కానీ మన దగ్గర జియో ఫైబర్ ప్రారంభ ప్లానే 100 ఎంబీపీఎస్ స్పీడ్ ఉంటుంది. 1 జీబీపీఎస్ దాకా స్పీడ్ పొందవచ్చు' అని ఆయన పేర్కొన్నారు. 1,600 పట్టణాల నుంచి ఇప్పటిదాకా 1.5 కోట్ల మేర రిజిస్ట్రేషన్స్ నమోదైనట్లు వివరించారు.

### ఫైబర్‌తో టీవీ ఉచితం

జియో ఫరెవర్ ప్లాన్స్ పేరిట ఉండే వార్షిక ప్లాన్స్‌ను ఎంచుకున్న వారికి హెచ్‌డీ లేదా 4కే ఎల్ఈడీ టీవీ సెట్ కూడా ఉచితంగా అందించనున్నట్లు ముకేష్ అంబానీ చెప్పారు. దీంతో పాటు 4కే సెట్ టాప్ బాక్స్‌ను కూడా ఉచితంగా పొందవచ్చు. అలాగే ప్రముఖ ఓవర్ ది టాప్ (ఓటీటీ) యాప్స్‌కి కూడా సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది.

### ఫస్ట్ డే ఫస్ట్ షో..

సినిమాలు థియేటర్లలో రిలీజైన రోజే ఇంట్లోనే వాటిని చూసే సర్వీసు కూడా ప్రవేశపెడుతున్నట్లు అంబానీ చెప్పారు. జియో ఫస్ట్ డే ఫస్ట్ షో పేరిట 2020 మధ్యలో దీన్ని అందుబాటులోకి తేనున్నట్లు వివరించారు. ప్రీమియం కస్టమర్లు ఈ సర్వీసులు పొందవచ్చని పేర్కొన్నారు.

### మైక్రోసాఫ్ట్‌తో జట్టు...

కొత్తగా క్లౌడ్ డేటా సెంటర్స్ ఏర్పాటు కోసం సాఫ్ట్‌వేర్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌తో చేతులు కలిపినట్లు అంబానీ చెప్పారు. మైక్రోసాఫ్ట్ అజ్యూర్ క్లౌడ్ ప్లాట్‌ఫాం ఆధారంగా ఈ ప్రపంచ స్థాయి డేటా సెంటర్స్ ఏర్పాటవుతాయని ఆయన తెలిపారు. ఇందుకోసం ఇరు సంస్థలు దీర్ఘకాలిక ఒప్పందం కుదుర్చుకున్నాయి.

## షేర్‌హోల్డర్లకు మరింత విలువ..

రిలయన్స్ ఇండస్ట్రీస్ చరిత్రలోనే ఇది అతి పెద్ద విదేశీ పెట్టుబడి (సౌదీ ఆరామ్‌కో డీల్). అంతే కాదు దేశంలోకి వచ్చిన అత్యంత భారీ ఎఫ్‌డీఐల్లో ఇది కూడా ఒకటి. మరోవైపు పెట్రో రిటైల్ వ్యాపార విభాగంలో బ్రిటన్ సంస్థ బీపీ 49 శాతం వాటాలు కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రు.7,000 కోట్లు. వచ్చే 18 నెలల్లో.. అంటే 2021 మార్చి 31 నాటికి రుణ రహిత కంపెనీగా మారతాం. ఇందుకు సంబంధించి మాకు స్పష్టమైన ప్రణాళిక ఉంది. ఈ లక్ష్య సాధన క్రమంలో షేర్‌హోల్డర్లయిన మీ అందరికీ.. కంపెనీ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేనంత వేగంగా మరింత అధిక డివిడెండ్లు, మధ్య మధ్యలో బోనస్ ఇష్యూలు, ఇతరత్రా సాధనాల ద్వారా మరిన్ని ప్రయోజనాలు అందిస్తామని హామీ ఇస్తున్నాను. సౌదీ ఆరామ్‌కో, బీపీతో ఒప్పందాలు ఈ ఆర్థిక సంవత్సరంలోనే పూర్తవుతాయని భావిస్తున్నాం. వీటితో రూ.1.15 లక్షల కోట్ల దాకా నిధులు అందుబాటులోకి వస్తాయి. వచ్చే అయిదేళ్లలో జియో, రిలయన్స్ రిటైల్‌ను ఐపీవోకి కూడా తెస్తాం. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచే జియోఫైబర్ సర్వీసులను ప్రారంభిస్తున్నాం. వచ్చే ఐదేళ్లు ఏటా 15 శాతం వృద్ధి సాధించగలం.

*– ముకేశ్ అంబానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ*



ఎంఆర్ హెడ్‌సెట్‌తో జియో సేవలను వివరిస్తున్న ఆకాశ్ అంబానీ, ఈషా అంబానీ



ఏజీఎంకు హాజరైన అనంత్ అంబానీ

**నాట్కో:** హైదరాబాద్ సమీపంలోని మేకగూడ వద్ద ఉన్న ఏపీఐ ఫెసిలిటీలో ఆగస్టు 5-9 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో ఆరు లోపాలను యూఎస్‌ఎఫ్‌డీఏ గుర్తించింది.

## బులియన్ రూ.లలో

| | |
|---|---|
| **ముంబై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,170 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,350 |
| వెండి (కిలో) | 47,600 |
| **చెన్నై** | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,830 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,300 |
| వెండి (కిలో) | 47,600 |
| **హైదరాబాద్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,830 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,030 |
| వెండి (కిలో) | 47,600 |
| **ప్రొద్దుటూరు** | |
| బంగారం (24 క్యారెట్లు) | 37,350 |
| బంగారం (22 క్యారెట్లు) | 34,470 |
| వెండి (కిలో) | 43,500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | |
| బంగారం (24 క్యారెట్లు) | 38,960 |
| బంగారం (22 క్యారెట్లు) | 36,030 |
| వెండి (కిలో) | 47,600 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## హైదరాబాద్‌లో ఆర్సియమ్ రెండో సెంటర్

**హైదరాబాద్:** న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న టెక్నాలజీ కంపెనీ ఆర్సియమ్ హైదరాబాద్‌లో రెండవ సెంటర్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం 800లుగా ఉన్న ఉద్యోగుల సంఖ్య వచ్చే మూడేళ్లలో 1,500లకు చేరుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. కొత్త కేంద్రం ద్వారా సరికొత్త ఆవిష్కరణలు సాగుతాయని కంపెనీ సీఈఓ గౌరవ్ సూరి తెలిపారు. ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలు, బిజినెస్ స్కూల్స్ నుంచి ఉద్యోగులను భర్తీ చేసుకుంటున్నామని కంపెనీ కంట్రీ హెడ్ రన్‌విజయ్ లంబా తెలిపారు.



కొత్త కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్సియమ్ సీఈఓ గౌరవ్ సూరి, కంట్రీ హెడ్ రన్‌విజయ్ లాంబా

## మరింతగా పెరిగిన జీవీకే పవర్ నష్టాలు

### క్యూ1లో నష్టం రూ.132 కోట్లు



**న్యూఢిల్లీ:** జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ నికర నష్టాలు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో రెట్టింపునకు మించి పెరిగాయి. గత క్యూ1లో రూ.55 కోట్లుగా ఉన్న నికర నష్టాలు ఈ క్యూ1లో రూ.132 కోట్లకు పెరిగాయని జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.1,106 కోట్ల నుంచి రూ.1,042 కోట్లకు తగ్గిందని పేర్కొంది. జీవీకే కంపెనీ.. ఇంధన, విమానాశ్రయాలు, రవాణా, ఆతిథ్య, జీవ శాస్త్రాల రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

### సెంచరీ టెక్స్‌టైల్స్ లాభం 11 శాతం అప్



**న్యూఢిల్లీ:** సెంచరీ టెక్స్‌టైల్స్ అండ్ ఇండస్ట్రీస్ (సీటీఐఎల్) కంపెనీ నికర లాభం ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక కాలంలో 11 శాతం పెరిగింది. గత క్యూ1లో రూ.163 కోట్లుగా ఉన్న నికర లాభం ఈ క్యూ1లో రూ.181 కోట్లకు పెరిగిందని పేర్కొంది. మొత్తం ఆదాయం రూ.983 కోట్ల నుంచి 10 శాతం తగ్గి రూ.881 కోట్లకు తగ్గిందని తెలిపింది. మొత్తం వ్యయాలు రూ.799 కోట్ల నుంచి 4 శాతం తగ్గి రూ.770 కోట్లకు చేరాయని పేర్కొంది.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 13-08-2019

| | |
|---|---|
| విశాఖ | 352-00 |
| చిత్తూరు | 348-00 |
| వరంగల్ | 331-00 |
| చెన్నై | 355-00 |
| ముంబై | 381-00 |
| విజయవాడ | 339-00 |
| నమక్కల్ | 350-00 |
| గోదావరి | 334-00 |
| 12-08-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 328-00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 3.90 |
| బెంగళూరు | 340-00 |
| ఢిల్లీ | 330-00 |
| కోల్‌కత్త | 380-00 |

## బోర్డ్ మీటింగ్స్



ఓఎన్‌జీసీ, సన్ ఫార్మా, కోల్ ఇండియా, నాల్కో, అపోలో హాస్పిటల్స్, గ్లెన్‌మార్క్ ఫార్మా, భారత్ ఫోర్జ్, రీట్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, హిందుస్తాన్ ఏరోనాటిక్స్, బ్లూ స్టార్, గోద్రేజ్ ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇన్‌ఫ్రా, నాగార్జున ఫెర్టిలైజర్స్, వీనస్ రెమిడీస్, అమృతాంజన్ హెల్త్, అశోక బిల్డ్‌కాన్, మణప్పురమ్ ఫైనాన్స్, రెడింగ్టన్ ఇండియా, ఇప్కా ల్యాబ్స్, పార్శ్వనాథ్ డెవలపర్స్

## పసిడి.. పరుగోపరుగు

- ఢిల్లీలో 10గ్రా. ధర రూ.38,470
- జీవితకాల గరిష్టస్థాయి నమోదు

**న్యూఢిల్లీ:** బంగారం ధర జోరుమీద కొనసాగుతోంది. వరుసగా గతకొద్ది రోజులనుంచి జీవితకాల గరిష్టస్థాయిని తిరగరాస్తోంది. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల (బిస్కెట్ గోల్డ్) బంగారం ధర రూ.38,470 వద్దకు చేరుకుంది. ప్రాంతీయ నగల వ్యాపారుల నుంచి డిమాండ్ క్రమంగా పెరిగిన కారణంగా ఇక్కడి ధర రూ.50 పెరిగి ఆల్ టైం రికార్డు హైకి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వివరించింది. అమెరికా–చైనాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం ఒక కొలిక్కిరానందున అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర రూ.1,503.30 డాలర్లకు చేరింది. తాజా పరిణామాల వల్ల దేశీ కమోడిటీ మార్కెట్లో కూడా బంగారానికి డిమాండ్ పెరుగుతూ ఉందని విశ్లేషించింది. ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి మార్గమైన బంగారం వైపునకు మళ్లడమే డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు.

**శాంతించిన వెండి..**

మొన్నటివరకు బంగారం దారిలోనే ప్రయాణించిన వెండి ధరలు.. సోమవారం శాంతించాయి.



ఇండస్ట్రియల్ యూనిట్లు, కాయిన్ తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గిన నేపథ్యంలో కిలో వెండి ధర రూ.1,150 తగ్గి రూ.43,000 వద్దకు చేరుకుంది. వీక్లీ డెలివరీ సిల్వర్ ధర రూ.43,324 వద్ద ఉంది.

## ఫ్లిప్‌కార్ట్ సిబ్బందికి ఎన్‌ఎస్‌డీసీ శిక్షణ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో (ఎన్‌ఎస్‌డీసీ) ఈ–కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన 20,000 మంది డెలివరీ సిబ్బందికి ఎన్‌ఎస్‌డీసీ విభాగమైన లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ శిక్షణ ఇవ్వనుంది. సరుకు రవాణా విధానం, స్థానిక రవాణా చట్టాలు, నిబంధనలు, కస్టమర్లతో ప్రవర్తించే తీరు వంటి అంశాల్లో సిబ్బందికి అవగాహన కల్పిస్తారు.



సోమవారం బక్రీద్ పర్వదినం సందర్భంగా హైదరాబాద్‌లోని మక్కా మసీదు ప్రాంగణంలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

# త్వరలో కానిస్టేబుల్ ఫలితాలు

- నెలాఖరులోగా విడుదలకు సన్నాహాలు
- చకచకా శిక్షణకు ఏర్పాట్లు
- శిక్షణకోసం వీలైతే పొరుగు రాష్ట్రాలకు అభ్యర్థులు

**సాక్షి, హైదరాబాద్:** వేలాది మంది అభ్యర్థులు తీవ్ర ఉత్కంఠతతో ఎదురుచూస్తున్న కానిస్టేబుల్ పరీక్ష తుది ఫలితాలు త్వరలోనే విడుదల కానున్నాయి. ఇప్పటికే ఎస్సై అభ్యర్థుల ఫలితాలు విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) ఈ నెలాఖరుకు కానిస్టేబుల్ అభ్యర్థులకు తీపికబురు అందించనుంది. ఇప్పటికే 1,272 మంది ఎస్సై అభ్యర్థుల తుది ఫలితాలు విడుదల చేసి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు పోలీసు అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ (టీఎస్‌పీఏ)తోపాటు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న పోలీస్ ట్రైనింగ్ కాలేజీల్లో శిక్షణకు ఏర్పాట్లు చకాచకా జరుగుతున్నాయి.

## సిలబస్, సిబ్బంది అంతా సిద్ధం..

కొత్తగా వచ్చే పోలీసు సిబ్బందికోసం ఇప్పటికే సిలబస్ సిద్ధంగా ఉంది. పెద్దగా మార్పులు ఏమీ లేనప్పటికీ.. ఈసారి యాప్స్ వినియోగం, టెక్నాలజీ, సైబర్ నేరాలు, ఆధారాల సేకరణకు ఆధునిక సమాచారం జోడించి స్వల్పమార్పులు చేసినట్లు సమాచారం. ప్రాక్టికల్స్‌కు కూడా పెద్దపీట వేశారు. ఎస్సై బ్యాచ్ 1,272 మంది, 16,925 మంది కానిస్టేబుళ్లకు ఒకేసారి తరగతులు ప్రారంభంకానున్నాయి. వీరికి తరగతులు బోధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 3,800 మంది పోలీసు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. వీరికి తోడుగా 35 మంది విశ్రాంత పోలీసులు, మాజీ సైనికులు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నారు. తరగతులు మొదలయ్యేసరికి మరో 40 మంది వరకు విశ్రాంత పోలీసు, సైనిక సిబ్బంది వచ్చి చేరతారని అధికారులు తెలిపారు. దాదాపు 18వేల మందికి ఒకేసారి శిక్షణ ఇచ్చేందుకు ఈ సిబ్బంది, ఇక్కడున్న సదుపాయాలు సరిపోతాయా? అన్న సందేహం కూడా అధికారుల్లో ఉంది. దీంతో రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపారు. శిక్షణలో భాగంగా కొందరిని అక్కడికి పంపించే అవకాశాలను పరిశీలిస్తున్నారు.

## అత్యాచార ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సీరియస్

**సాక్షి, హైదరాబాద్:** వరంగల్ జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచార ఘటన విషయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. దీనిపై వరంగల్ సీపీతో సోమవారం ఫోన్‌లో మాట్లాడారు.




# 9న జంతర్‌మంతర్ వద్ద ఆదివాసీల సభ

### ఎంపీ సోయం బాబురావు



**హైదరాబాద్:** అన్నిరాష్ట్రాల్లో ఉన్న ఆదివాసీల సమస్యలు, వారికి జరుగుతున్న అన్యాయాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లటానికి డిసెంబర్ 9న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు చెప్పారు. సోమవారం ఇక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం, సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల ఉనికిని చాటుకునేందుకు, వారి హక్కులను కాపాడుకునేందుకు, దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీల సంఘాలను సంఘటితం చేసేందుకు సభను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓటుబ్యాంకు కోసం 1976 తర్వాత అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీల రిజర్వేషన్లకు గండికొడుతూ లంబాడాలను ఎస్టీలుగా గుర్తించిందని అన్నారు. జనావాసాలకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగాలకు ఆమడదూరంలో ఉండి అడవినే నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలనే నిజమైన గిరిజనులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో లంబాడా టీచర్లను కాకుండా ఆదివాసీలనే విద్యావలంటీర్లుగా నియమించాలని అన్నారు. తెలంగాణ ఉద్యమసమయంలో పోడు వ్యవసాయం చేసుకునే వారికి పట్టాలు ఇవ్వాల్సిందేనన్న సీఎం కేసీఆర్ గద్దెనెక్కినాక మాట తప్పారని విమర్శించారు. ఆదివాసీ ఉద్యమం కూడా మరో తెలంగాణ ఉద్యమం లాంటిదేనని పేర్కొన్నారు. అనంతరం సోయం బాబురావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొంది వెంకటరమణ, ఆధార్ సొసైటీ అధ్యక్షుడు కల్తీ వీరమల్లు, రాష్ట్ర నాయకులు సుంచు రామకృష్ణ, సిడాం జంగు, మెట్ల పాపయ్య, భుజంగరావు, రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం

### వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

**పెద్దేముల్:** ఓ కామాంధుడు ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన ఘటన వికారాబాద్ జిల్లాలో ఆలస్యంగా వెలుగు చూసింది. పెద్దేముల్ మండలం రేగొండి గ్రామానికి చెందిన దంపతులు దినసరి కూలీలు. వీరికి ఐదేళ్ల కూతురు, కుమారుడు ఉన్నారు. బాలిక స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతోంది. ఈ నెల 9న వరలక్ష్మి వ్రతం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి సెలవు ఉండటంతో తల్లిదండ్రులు బాలికను ఇంటివద్ద ఉంచి పనులకు వెళ్లారు. అనంతరం అదే గ్రామానికి చెందిన నగేష్ (22) బాలికను తన ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కూతురు అస్వస్థతగా ఉంది. జ్వరం వచ్చిందేమోనని మందులు వేశారు. జ్వరం తగ్గకపోవడంతో మరుసటి రోజు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రెండురోజులు గడిచినా ఫలితం లేకపోయింది. దీంతో తల్లి ఆరా తీయగా అత్యాచార విషయం చెప్పింది. బంధువుల వద్ద తలదాచుకున్న నిందితుడిని గ్రామానికి పట్టుకొచ్చి సోమవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. తాండూరు డీఎస్పీ రామచంద్రుడు, సీఐ రవికుమార్ పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ చేరుకొని చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నగేష్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. చిన్నారిని పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.







Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792